

మార్కాపురం సబ్‌స్టేషన్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం జిల్లావ్యాప్తంగా 3,500 మంది రైతులు డీడీలు తీసి ఏడాదిగా ఎదురుచూస్తున్నారు. వాటిల్లో పశ్చిమ ప్రకాశంలోనే రెండు వేలకుపైగా ఉన్నాయి. ఈ మధ్యనే జిల్లాకు 300 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. వాటిల్లో 150 వరకు మాత్రమే మార్కాపురం డివిజన్‌కు కేటాయించారు. ఇంకా వేల సంఖ్యలోనే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్ వెతలు

ఏడాది క్రితం డీడీలు తీసినా అరకొరగానే మంజూరు

పశ్చిమ రైతుల ఎదురుచూపులు

ఖరీఫ్ సీజన్ తరుముకొస్తోంది. వచ్చే నెల ప్రారంభం నుంచి రైతులు సాగుకు సమాయత్తమవుతారు. ఈ సమయంలో వారిని ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు వెంటాడుతున్నాయి. వేలాది సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం వందల సంఖ్యలో మాత్రమే మంజూరు చేస్తోంది. క్షేత్రస్థాయిలో వాటిని ఏర్పాటు చేసే క్రమంలో మెటీరియల్ కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకపోతుండడంతో రైతులు మరికొంత మేర ఆర్థిక కష్టాలు పడాల్సి వస్తోంది. అధికారులు, కాంట్రాక్టర్ల చేతివాటం కూడా అదనపు భారమవుతోంది. దీంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒక నెల దాటిన తర్వాత ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేసినా పంటల సాగు ప్రారంభమై వాటిని పొలాల్లోకి తీసుకెళ్లడం కష్టమవుతుంది. సాధ్యమైన మేర ఖరీఫ్ ప్రారంభానికి ముందే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తేనే ఈ సంవత్సరమైనా డీప్‌బోర్ల ద్వారా వ్యవసాయం చేయగలుగుతామని రైతులు అంటున్నారు.

సాధ్యమైనంత త్వరగానే ఏర్పాటు చేస్తున్నాం



పశ్చిమ ప్రకాశంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నది వాస్తవమే. పైనుంచి సరఫరా తక్కువగా ఉంది. ఈ మధ్య జిల్లాకు 300 వరకూ ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయి. ముందుగా డీడీలు తీసిన వారికి ప్రాధాన్యతా క్రమంలో ఏర్పాటు చేస్తాం. డీడీ మినహా ఏస్థాయిలోని వారికీ అదనంగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. మెటీరియల్ కూడా పూర్తిస్థాయిలోనే అందిస్తున్నాం. మెటీరియల్ లేదని ఎవరైనా కాంట్రాక్టర్ చెబితే స్థానిక అధికారులకు రైతులు ఫిర్యాదు చేయాలి..

- కట్టా వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఎస్ఈ

- రెండు వేలకు పైగానే పెండింగ్
- పూర్తిస్థాయిలో మెటీరియల్ ఇవ్వకపోవడంతో మరింత భారం
- శ్రుతిమించుతున్న అధికారులు, కాంట్రాక్టర్ల చేతివాటం
- ఖరీఫ్ ప్రారంభానికి ముందు ఏర్పాటు చేయకుంటే సాగు కష్టమే!

మార్కాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రకాశం.. జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం. రైతులు వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. లేకుంటే పొట్టచేతపట్టుకొని వలసబాట పడతారు. దశాబ్దాల నుంచి ఇదే పరంపర కొనసాగుతోంది. ఇతర వనరులు కూడా ఈ ప్రాంతంలో మృగ్యమే. ముఖ్యంగా వ్యవసాయం చేయాలంటే డీప్‌ బోరు బావులే దిక్కు. అది కూడా ఆరు వందల నుంచి వెయ్యి అడుగుల లోతులో ఉండే భూగర్భ జలాలను డీప్‌బోర్ల ద్వారా ఒడిసిపట్టి ముందుకు సాగాల్సిందే. గిట్టుబాటు ధరల మాట అటుంచితే.. కష్ట, నష్టాల సాగు ఈ ప్రాంత కర్షకులను ఏటా కన్నీరే పెట్టిస్తోంది. ఇన్ని ప్రతికూలతల మధ్య కాడి పడేయలేక సాగు కోసం అష్టకష్టాలు పడుతుంటే.. విద్యుత్ శాఖ పశ్చిమ రైతులపై శీతకన్ను వేస్తోంది. బోరుబావుల ద్వారా వ్యవసాయం చేసుకునేందుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నా కనికరం కరువవుతోంది.

డీడీలు కట్టినా మంజూరుకాని వైనం

గతంలో హెచ్‌వీడీఎస్ పథకంలో 100, 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 16, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ఏర్పాటు చేశారు. కేవలం పాత వ్యవసాయ వినియోగదారులకే ఈ పథకం వర్తించింది. నూతనంగా డీప్‌బోర్లు వేసుకుని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు కావాల్సిన వాళ్లు రూ.9,500 వరకు విద్యుత్‌శాఖకు డీడీ తీయాల్సివుంది. 16 కేవీ కావాలంటే రెండు డీడీలు, 25 కేవీకి మూడు డీడీలు తీయాలి. ఈ లెక్కన ఒక్క పశ్చిమ ప్రకాశంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దాదాపు రెండువేల మందికి వరకూ రైతులు రూ.30 కోట్లకుపైగా డీడీల రూపంలో విద్యుత్‌శాఖకు చెల్లించి ఏడాదిగా

మిగతా 6వ పేజీలో



మహాలక్ష్మికి పుష్పయాగం

సింగరాయకొండలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న చెట్టు మహాలక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. పశ్చిమగోదావరి నుంచి ప్రత్యేకంగా కలువలు, పూలను తెప్పించి అమ్మవారిని సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా పుష్పయాగం చేశారు. రాత్రికి శ్రీనివాస కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తిలకించి తరించారు. అనంతరం నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

- ఆంధ్రజ్యోతి, సింగరాయకొండ



మహానాడు ఏర్పాట్లలో మంత్రులు రవికుమార్, బీసీ జనార్దన్‌రెడ్డితో ఎమ్మెల్యేలు ఉగ్ర, అశోక్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ సత్య

నేటి నుంచి పసుపు పండుగ

కడప వేదికగా మహానాడు

భారీగా తరలివెళ్లిన పార్టీ నేతలు

- మూడు రోజులు ముఖ్యులంతా అక్కడే
- ప్రతినిధుల సభకు జిల్లా నుంచి రెండువేల మంది
- 29న బహిరంగ సభకు పాతికవేల మందికిపైనే!

ఒంగోలు, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే మహానాడు వేడుక మంగళవారం నుంచి ప్రారంభంకానుంది. కడప నగర సమీపంలోని సీకేదిన్నె వేదికగా ఈనెల 29 వరకూ మూడు రోజులపాటు జరగనున్న పసుపు పండుగ కోసం అక్కడ అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలుత రెండు రోజులు ప్రతినిధుల సభలు, మూడో రోజు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ప్రతినిధుల సభలో టీడీపీ రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, విభిన్నవర్గాల ప్రజా సమస్యలు, జాతీయ, రాష్ట్రస్థాయిలో వివిధ అంశాలపై పార్టీ విధివిధానాలు తదితర అంశాలపై చర్చించనున్నారు. ఈ రెండ్రోజులు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి పరిమిత సంఖ్యలో నాయకులు పాల్గొంటారు. ప్రతినిధుల సభకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల నేతృత్వంలో సగటున ఒక్కో నియోజకవర్గం నుంచి 250 మంది వంతున సుమారు 2వేల మంది వరకూ నాయకులు జిల్లా నుంచి హాజరవుతున్నట్లు పార్టీవర్గాల సమాచారం. అలాగే మహానాడు ముగింపు రోజైన 29వతేదీన కడపలో భారీ బహిరంగ సభను టీడీపీ నిర్వహించనుంది. ఆ సభకు కూడా జిల్లా నుంచి వేలాదిగా పార్టీశ్రేణులు తరలివెళ్లనున్నారు. ప్రధానంగా

మిగతా 6వ పేజీలో



కొండపి ప్రాంతంలో నువ్వులు చల్లుతున్న కూలీలు

సాగుకు సానుకూలం

జిల్లాలో మారిన వాతావరణం

జిల్లాలో ఈ ఏడాది వాతావరణం పూర్తిగా మారింది. ప్రధానమైన వేసవి సమయంలోనూ వాన జోరు కనిపించింది. దీంతో సాగుకు సానుకూల వాతావరణం ఏర్పడింది. ఏడాది మొత్తం మీద రోహిణి కార్తెలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. అలాంటిది ఈసారి పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొంది. రోహిణి ఆదివారం ప్రవేశించింది. అయినప్పటికీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37 డిగ్రీలకు మించలేదు.

- వేసవిలోనూ వానలు
- ఈనెలలో ఇప్పటికే రెట్టింపు వర్షపాతం
- రోహిణి కార్తె ఆరంభమైనా చల్లగానే వాతావరణం
- తగ్గిన ఉష్ణోగ్రతలు
- తొలకరి పైర్లు, పశుగ్రాస పంటల సాగుకు అవకాశం

ఒంగోలు, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వార్షిక సగటు వర్షపాతం 841.50 మి.మీ కాగా మేలో 53.0 మి.మీ ఉంటుంది. అందులో ఈనెలలో ఇప్పటి వరకూ 42 మి.మీ కురవాల్సి ఉండగా 80.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ప్రత్యేకించి కొన్ని మండలాల్లో రెట్టింపు కురిసింది. సాధారణంగా ఈ నెలలో నామమాత్రమే జల్లులు మాత్రమే ఈనెలలో పడే గిద్దలూరు, రాచర్ల మండలాల్లో మూడు రెట్లకుపైన అధికంగా పడింది. పెద్దారవీడు, మార్కాపురం, దోర్నాల, కొండపి మండలాల్లో రెండు రెట్లకు పైన కురిసింది. తర్లుబాడు, సింగరాయకొండ, తాళ్లూరు, కనిగిరి, పామూరు, దొనకొండ, ఎన్‌జీ పాడు, త్రిపురాంతకంలలో నూరుశాతం అధికంగా ఉంది. సంతనూతలపాడు, వైపాలెం, పొదిలి, మర్రిపూడి, కురిచేడు, కొత్తపట్నం, జరుగుమల్లి

మిగతా 6వ పేజీలో



సౌభాగ్యమ్మతో మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేసు

సమస్యను పరిష్కరించలేదంటూ మహిళ ఆత్మహత్యాయత్నం

- పురుగుమందు తాగి 'మీకోసం'కు వచ్చిన త్రిపురాంతకం వాసి
- వెంటనే గుర్తించి రిమ్స్‌కు తరలించిన సిబ్బంది
- ఆమె ఇలా చేయడం మూడోసారి

7

పాయింట్లే కీలకం

- టీచర్ల బదిలీల్లో వాటికి ఎంతో ప్రాముఖ్యం
- అప్రమత్తంగా లేకుంటే అర్హులకు అన్యాయమే
- పరిశీలనలో బయటపడుతున్న అక్రమాలు

ఒంగోలు విద్య, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల్లో వారికి కేటాయిస్తున్న ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లు ఎంతో కీలకం. కోరుకున్న స్థానాలు దక్కించుకోవాలంటే అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. న్యాయబద్ధంగా రావాల్సిన పాయింట్ల కోసం రాజీ పడకుండా ప్రయత్నించడంతోపాటు ఇతరులు అక్రమంగా పొందకుండా అడ్డుకోవాలి. లేకపోతే స్థానాలు పొందే విషయంలో అన్యాయం జరగడం ఖాయం. ఉద్దేశపూర్వకంగా కాకపోయినా అర్హత లేని కొందరు అవగాహన లేమితో పాయింట్ల కోసం తమకు వర్తించని అంశాలు దరఖాస్తుల్లో పొందుపర్చి ప్రయతిస్తున్నారన్న ఆరోపణలు

మిగతా 6వ పేజీలో

ఫిర్యాదుల పరిష్కారానికి మూడు బృందాలు

గ్రేడ్-2 హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాపై 40 అభ్యంతరాల పరిష్కారం

6



దేవుడికి దిక్కేది?

- దోర్నాలలో 161 ఎకరాల మాన్యం ఉన్నా ఆలనాపాలన కరువు
- శిథిలావస్థలో నరసింహస్వామి ఆలయం
- పట్టించుకోని దేవదాయ అధికారులు
- పునర్నిర్మాణం చేయాలంటున్న భక్తులు

6





త్రిపురాంతకం వద్ద కాలువలో సాగర్ జలాల ప్రవాహం

సాగర్ జలాలు వచ్చేశాయ్!

తాగునీటి కోసం నాగార్జున సాగర్ కుడికాల్వ నుంచి విడుదల చేసిన జలాలు సోమవారం ఉదయం జిల్లాకు చేరాయి. త్రిపురాంతకం మండలంలోకి ప్రవేశించాయి. వేసవి కావడంతో గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో విడుదలైన సాగర్ జలాలతో తాగునీటి వనరులను నింపనున్నారు. దీంతో నీటి ఇక్కట్ల నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది.

-ఆంధ్రజ్యోతి, ఎర్రగొండపాలెం

జీజీహెచ్‌లో క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరికరం



క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు, హెచ్‌వోడీలు, వైద్యులు

- ప్రారంభించిన ఇన్‌చార్జి సూపరింటెండెంట్
- ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చని వెల్లడి

ఒంగోలు, కార్పొరేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో అధునాతన ఇమ్యునోహిస్టో కెమిస్ట్రీ (ఐహెచ్‌సీ) పరికరాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ నిర్ధారణ, దశ, చికిత్సలో ఈ పరికరం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వైద్య పీజీ కళాశాల నిధులు రూ.40లక్షలు వెచ్చించి దీన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఉచితంగా సేవలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్, హెచ్‌వోడీలు, డాక్టర్లు, సుధాకర్, దుర్గాదేవి, అటానమీ హెచ్‌వోడీ సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

ట్రాన్స్‘ఫార్మర్’ వెతలు

(5వ పేజీ తరువాయి)

నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన మేర ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా కావడం లేదు. సరైన సమయంలో మెటీరియల్ అందకపోవడంతో జిల్లా అధికారులు సైతం రైతులకు న్యాయం చేయలేకపోతున్నారు.

అదనపు వసూళ్లతో మరింత భారం

రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే కేవలం డీడీలు తీస్తేనే సరిపోదు. కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు అందరికీ చేతులు తడపాల్సిందే. రమారమి ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు డీడీలకు చెల్లించింది కాక మరో రూ.20వేల వరకు లంచాలు ఇస్తేనే పొలంలోకి చేరుతుంది. గ్రామస్థాయిలో ఉండే లైన్‌మన్ నుంచి మొదలుకొని అందరికీ అదనపు చెల్లింపుల్లో వాటాలు సర్వసాధారణం. అన్నీ సజావుగా ఉండి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైనా మెటీరియల్ పూర్తిస్థాయిలో రాలేదని కాంట్రాక్టర్లు కొర్రీలు వేస్తున్నారు. కొంత సామగ్రి ప్రైవేటుగా కొనుగోలు చేయాలని రైతులపై అదనపు భారాన్ని వేస్తున్నారు. అదనపు మెటీరియల్ పేరుతో ఎంతలేదన్నా మరో రూ.5వేల వరకు అధికంగా రైతులు ఖర్చు పెట్టాల్సివస్తోంది.

సాగుకు సానుకూలం

(5వ పేజీ తరువాయి)

తదితర మండలాల్లోనూ మంచి వర్షాలు పడ్డాయి. అర్థవీడు, హెచ్‌ఎంపాడు, సీఎస్‌పురం తప్ప అన్ని మండలాల్లోనూ ఎంతో కొంత అధికంగానే వర్షపాతం నమోదైంది.

పంటల సాగుకు సానుకూలం

తాజా వర్షాలతో తొలికరి పైర్ల సాగుకు సానుకూల వాతావరణం ఏర్పడింది. అధికారికంగా ఖరీఫ్ సీజన్ జూన్ 1నుంచి ప్రారంభమవుతున్నా జిల్లాలో ఆ నెల మూడో వారం నుంచి తొలకరి పైర్లు, పశుగ్రాస పంటలు సాగుకు రైతులు ఉపక్రమిస్తారు. రబీ సీజన్‌లో పొగాకు, వరి, శనగ సాగు చేసే భూముల్లో ఖరీఫ్‌లో మూడు నుంచి నాలుగు నెలలోపు చేతికి వచ్చే నువ్వు, సజ్జ, పెసర, అలసంద వంటివి ప్రధానంగా సాగు చేస్తారు. జొన్న ఇతర పశుగ్రాస పంటలు జనుము, పిల్లపెసర, ఇతరత్రా పచ్చిరొట్ట ఎరువులకు ఉపకరించే వాటిని కూడా తొలకరి పైర్లుగా ఈ సమయంలో వేస్తారు. వాటి సాగుకు ప్రస్తుత వాతావరణం అనుకూలంగా రైతులు చెప్తున్నారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం ఈ వారంలోనూ వర్షాలు పడే అవకాశం ఉంది. దీంతో ఎండల తీవ్రత తగ్గడంతోపాటు పంటల సాగుకు సానుకూల వాతావరణం ఏర్పడుతుందని రైతులు భావిస్తున్నారు.

నేటి నుంచి పసుపు పండుగ

(5వ పేజీ తరువాయి)

పశ్చిమప్రాంతం నుంచి అధికంగా పార్టీ కార్యకర్తలు వెళ్లనున్నారు. అక్కడి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ఇందుకోసం బస్సులు, కార్లు, ఇతర వాహనాలను కూడా సిద్ధం చేశారు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లోనూ భారీగానే శ్రేణులు వెళ్లే అవకాశం ఉంది. మొత్తంగా చివరిరోజు బహిరంగ సభకు జిల్లా నుంచి పాతికవేల మంది వరకూ వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతరత్రా కీలక నేతలంతా సోమవారం రాత్రికే కడప చేరుకున్నారు. మూడు రోజులు వారంతా అక్కడే ఉండనున్నారు. యువనేత దామచర్ల సత్య, ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి వంటివారు ముందుగానే వెళ్లి అక్కడ ఏర్పాట్లలో భాగస్వాములయ్యారు.



దేవుడికి దిక్కేది?

- 161 ఎకరాల మాన్యం ఉన్నా ఆలనాపాలన కరువు
- శిథిలావస్థలో నరసింహస్వామి ఆలయం
- పట్టించుకోని దేవదాయ అధికారులు
- పునర్నిర్మాణం చేయాలంటున్న భక్తులు

పెద్దదోర్నాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : కోట్లాది రూపాయలు విలువ చేసే మాన్యాలున్నా.. ఆలనాపాలనా లేక చరిత్రాత్మక దేవాలయం శిథిలావస్థకు చేరింది. ఆలయ కమిటీ ఉందో లేదో కూడా తెలియని పరిస్థితి. పాలకుల అలసత్వం, అధికారుల స్వార్థంతో దశాబ్దాల నాటి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం కునారిల్లుతోంది. దోర్నాలలో క్రీస్తు పూర్వం జయమేజయరాజు శ్రీ లక్ష్మీ నరసింహుని ప్రతిష్ఠించారని, అంత ప్రాముఖ్యత గల దేవాలయాన్ని పట్టించుకోకపోవడం వల్ల శిథిలావస్థకు చేరుకుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయం అభివృద్ధికి దూపదీప నైవేద్యాన్ని అందించేందుకు 18 గ్రామాలకు చెందిన భక్తులు 161.40 ఎకరాల మాన్యాన్ని కేటాయించారు. ప్రస్తుతం ఈ భూముల విలువ రూ.15 కోట్లకుపైనే పలుకుతుందని భక్తుల నమ్మకం. కొన్ని భూములు ఆక్రమణకు గురి కాగా మరికొన్ని భూములను వేలం పాటలు నిర్వహించి వచ్చిన సొమ్మును ఎండోమెంటు అధికారులు బ్యాంకుల్లో జమ చేస్తున్నారే గానీ దేవాలయం అభివృద్ధికి ఎటువంటి కృషి చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

● దేవాలయ మాన్యాలివీ...

దోర్నాల రేగడిచేను 214 సర్వే నెంబరులో 7 ఎకరాలు, 113 సర్వే నెంబరులో 13.41, జమ్మిదోర్నాలలో 622/1 సర్వే నెంబరులో 12.48 ఎకరాలు, 284/2లో 12.21, అయినముక్కలలో రెవెన్యూలోని కడపరాజుపల్లెలో 238/1 సర్వే నెంబరులో 7.90 ఎకరాలు, గణపతిరస్తా వద్ద 3 సర్వే నెంబరులో 6.71 ఎకరాల భూములున్నాయి. ఈ క్రమంలో అర్చకులకు 21 ఎకరాలు కేటాయించగా 113 సర్వే నెంబరులోని 13.41 ఎకరాలు ప్రభుత్వం రూ.8లక్షలకు కొనుగోలు చేసి పేదలకు ఇంటి స్థలాలుగా అందజేసింది. కానీ దేవాలయానికి ఎటువంటి స్థలాన్నీ కేటాయించలేదు. తిమ్మాపురంలో 268/1 సర్వే నెంబరులో 5.06 ఎకరాలు, పెద్దబొమ్మలాపురంలో 465 సర్వే నెంబరులో 7.64 ఎకరాలు, 470 సర్వే నెంబరులో 7.78 ఎకరాలు, చిన్నగుడిపాడులో 36/2 సర్వే నెంబరులో 12.64 ఎకరాలు, చట్టుతాండాలో 485 సర్వే నెంబరులో 7 ఎకరాలు, చిలకచెర్ల 442 సర్వే నెంబరులో 5.21, రామచంద్రకోట 29/1 సర్వే నెంబరులో 9 ఎకరాలు, చిన్నదోర్నాల 26/2 సర్వే నెంబరులో 10.35 ఎకరాలు, సానికవరం రామాయలపాలెం 450 సర్వే నెంబరులో 12.69 ఎకరాలు, తమ్మడపల్లి 715 సర్వే నెంబరులో 5.50, లింగంవానిపల్లె 49 సర్వే నెంబరులో 8.45 ఎకరాలు ఆలయ మాన్యాలుగా ఉన్నాయి. ప్రతి ఏటా వేలం వేస్తూ వచ్చిన డబ్బును బ్యాంకుల్లో వేస్తున్నారో లేక ఏమైపోతున్నాయో కానీ ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా నరసింహ స్వామి జయంతి ఉత్సవాలకు కూడా పీసమెత్తు ఖర్చు చేయడంలేదు. కేవలం భక్తుల తోడ్పాటుతో నామమాత్రంగా ఉత్సవం నిర్వహిస్తున్నారు.

● శిథిలావస్థలో దేవాలయం

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పలుమార్లు దొంగలు పడి వెండి కిరీటాలు, హుండీలోని సొమ్ము, విలువైన వస్తువులు అపహరించుకుపోయాక ఇనుప గేట్లు ఏర్పాటు చేశారు. అలా కాకుండా కోట్ల విలువైన ఆస్తులున్నా నరసింహ స్వామి దేవాలయం పునర్నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.



రోడ్డుపై బోల్తా కొట్టిన కారు

కారును ఢీకొన్న లారీ..

- నలుగురికి స్వల్ప గాయాలు
- కలికివాయి ఫ్లైవోవర్‌పై ప్రమాదం

సింగరాయకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ముందువెళ్తున్న కారును వెనుకవైపు వస్తున్న లారీ ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కలికివాయి ఫ్లైవోవర్‌పై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిలకలూరిపేటకు చెందిన నిమ్మల చంద్రశేఖరరావు-రాజేశ్వరి, కాకుమాని అంజన్‌రావు-చిలకమ్మ దంపతులు తిరుమలకు వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. కారు కలికివాయి ఫ్లైవోవర్ వద్దకు చేరుకునే సరికి వెనుక వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై కారు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఉన్న వారిని బయటకు తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఎస్సై బి.మహేంద్ర హైవే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేయించి క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అనంతరం క్రేన్ సహాయంలో కారును పక్కను తొలగించారు.



సాగు చేసిన పందిరి దొండ



పందిరి దొండ.. రైతుకు అండ!

పెద్ద దోర్నాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఏటా సాగు చేసే వాణిజ్య పంటలు పత్తి, మిరపలో అపార నష్టాల్ని చవిచూస్తున్న రైతులకు పందిరి దొండసాగు అండగా నిలుస్తోంది. ఒకసారి మొక్కలు నాటితే మూడేండ్ల వరకు ఫలాసాయాన్నిచ్చే దొండ సాగు పట్ల రైతులు మొగ్గు చూపుతున్నారు. తెగుళ్ల బెడద పెద్దగా ఉండదు. కొద్దిపాటి నీటి తడులతో నికరాదాయం లభిస్తుంది. కూలీలు కూడా పెద్దగా అవసరం లేకుండానే ఇంటి మనుషులతోనే దిగుబడులు తీయొచ్చు. సీజను బట్టి ధరలు పెరుగుదలతో అధిక లాభాలు కూడా వస్తున్నాయి. దీంతో పందిరి దొండసాగు చిన్న సన్న కారు రైతులకు ఎంతగానో ఊతమిస్తోంది. పైగా ప్రభుత్వం కూడా ప్రోత్సాహాన్నిస్తూ పందిరి ఏర్పాటుకు రాయితీ కల్పిస్తోంది.

● పందిరితో అధిక దిగుబడులు

దొండ సాగుకు పందిరి ఖర్చు రైతులకు కొంచెం కష్టమనిపించినా మున్ముందు సమస్య కాదు. ఎకరంలో దొండ సాగుకు పందిరి వేసేందుకు రూ.4 లక్షలు ఖర్చవుతాయి. ప్రభుత్వం లక్ష రూపాయలు రాయితీ కల్పిస్తోంది. శాశ్వత పందిరి ఏర్పాటు వల్ల పంటలో తెగుళ్ల బెడద ఉండదు. తద్వారా దిగుబడులు పెరుగుతాయి. ఒకసారి నాటితే మూడేళ్ల పంట దిగుబడి తీయొచ్చు. వారం వారం కోతలు అందుబాటులోకి వస్తాయి. కోతకు ఎకరానికి 5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. సీజను బట్టి కిలో రూ.15లు నుంచి రూ.25 వరకు మార్కెట్టులో కొనుగోలు చేసినా మంచి ఆదాయం లభిస్తుందని చెబుతున్నారు. చిన్న, సన్నకారు రైతులకు మరింత ఉపయుక్తంగా ఉంటుందని దొండసాగు రైతులు చెబుతున్నారు. మండలంలోని చిన్నదోర్నాల, తిమ్మాపురం, రామచంద్రకోట, బొమ్మలాపురం గ్రామాల్లో కొందరు రైతులు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.

జిల్లాలో 18.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. యర్రగొండపాలెంలో అత్యధికంగా 78.8 మి.మీ. వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా తాళ్ళూరు మండలంలో 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. పుల్లలచెరువు 76.0, తర్లుబాడు 46.4, దర్శి 41.4, త్రిపురాంతకం 38.4, పెద్దారవీడు 36.4, కంభం 35.4, వెలిగండ్ల 33.0, దొనకొండ 29.8, కురిచేడు 29.0, మార్కాపురం 27.2, అర్థవీడు 20.4, బేస్తవారపేట 20.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. గిద్దలూరు 18.2, జరుగుమల్లి 17.8, హనుమంతునిపాడు 17.6, దర్నాల 16.4, పీసీపల్లి 16.2, పొన్నలూరు 15.2, రాచర్ల 15.0, సీఎస్‌పురం 14.2, కొమరోలు 12.4, టంగుటూరు 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

బకాయిలు చెల్లించకపోతే సంక్షోభంలోకి విద్యాసంస్థలు

- ప్రైవేటు పాఠశాలల సంఘాల సమాఖ్య

అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద చేరిన విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. లేనిపక్షంలో విద్యా సంస్థలు సంక్షోభంలో పడతాయని సోమవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేసింది. విద్యాహక్కు చట్టం కింద ప్రభుత్వం ప్రతిపాదించిన ఫీజులపై అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలిపింది. ప్రైవేటు పాఠశాలలకు ఇబ్బందికరంగా ఫీజులు నిర్ణయించడం సరికాదని పేర్కొంది. ఫీజులపై అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ప్రతిపాదిత ఫీజులను తాము ఆమోదించలేదని తెలిపింది.

చిత్తడి నేల అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యుల నియామకం

అమరావతి, మే26(ఆంధ్రజ్యోతి): స్టేట్ వెట్‌ల్యాండ్(చిత్తడి నేలల) అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులిచ్చింది. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన చిత్తడి నేలల జీవావరణ శాస్త్ర నిపుణుడు ఆర్ రామ సుబ్రహ్మణియన్, ప్రపంచవ్యాప్త ప్రకృతి నిధి(డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా) రాష్ట్ర సంచాలకుడు ఫరీదా తంపాల్, కోయంబత్తూర్‌లోని తడిభూముల జీవావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోల్డిన్ క్వాడ్రోస్, డెహ్రాడూన్‌లోని అంతరించిపోతున్న జాతుల నిర్వహణ సంస్థ శాస్త్రవేత్త ఆర్ సురేష్‌కుమార్ సభ్యులుగా నియమితులయ్యారు. కాగా రాష్ట్రంలో చిత్తడి నేలల పరిరక్షణ కోసం స్టీరింగ్ కమిటీ స్థానంలో ఈ అథారిటీ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటైంది. అధికారులతో పాటు మూడేళ్ల పదవీ కాలానికి అధికారేతర సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేసింది.

పాయింట్లే కీలకం

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయలోకం నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఉదాహరణకు మాజీ సైనికోద్యోగులు స్వయంగా ఉపాధ్యాయులుగా పనిచేస్తుంటే వారికి ఐదు పాయింట్లు కేటాయిస్తారు. అదేవిధంగా ప్రస్తుతం సైనికోద్యోగులుగా పనిచేస్తున్న వారి స్పౌజ్‌కు ఐదు పాయింట్లు కేటాయిస్తారు. మాజీ సైనికోద్యోగుల స్పౌజ్‌కు మాత్రం ఎటువంటి పాయింట్లు రావు. అయితే ఒక మహిళా టీచర్ తన భర్త మాజీ సైనికోద్యోగి అని పేర్కొనడంతో మండల స్థాయిలో ఎంఈవో ఓకే చేసి ఐదు పాయింట్లు ఇచ్చారు. జిల్లాస్థాయిలో దరఖాస్తుల పరిశీలన సమయంలో దీనిపై అభ్యంతరం రావడంతో ఆ టీచర్‌కు ఆ ఐదు పాయింట్లు తొలగించారు. మరికొందరు కూడా అర్హత లేకపోయినా ఇదే విధంగా పాయింట్లు పొందారన్న ఆరోపణలు ఉన్నాయి.

స్పౌజ్‌ల విషయంలో తిరకాసు

స్పౌజ్ పాయింట్లలో కూడా కొంత తిరకాసు జరిగిందన్న విమర్శలు ఉన్నాయి. ఈ పాయింట్ల కోసం ఎటువంటి సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసే అవసరం లేకపోవడంతో కొందరు అర్హత లేకపోయినా పొందారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం భార్యభర్తలిద్దరూ రాష్ట్ర, కేంద్రప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారు, ఎయిడెడ్, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న వారు, ప్రభుత్వ విద్యారంగ సొసైటీల్లో పనిచేసే వారికి మాత్రమే స్పౌజ్ పాయింట్లు కేటాయించమన్నారు. అయితే దరఖాస్తులోని ఇతర కాలమ్‌ను ఆసరా చేసుకొని ఆ కోటాలో కొందరు స్పౌజ్ పాయింట్లు పొందారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు ప్రైవేటు ఉద్యోగులు, టీచర్లు, లెక్చరర్లు స్పౌజ్ పాయిట్లు పొందారన్న ఆరోపణలు ఉన్నాయి. 5/8 సంవత్సరాలు పూర్తయిన హెచ్‌ఎంలు, టీచర్లు మాత్రమే వినియోగించుకోవాల్సి ఉండగా కొందరు ఆ సమయం పూర్తికాకపోయినా వినియోగించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దరఖాస్తు పరిశీలన పక్కాగా నిర్వహించి అక్రమార్కులను ఏరివేసి తమకు న్యాయం చేయాలని టీచర్లు కోరుతున్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి మూడు బృందాలు

ఒంగోలు విద్య, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన ప్రాథమిక సీనియారిటి జాబితాలపై అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారానికి మూడు బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 2వతేదీ వరకు ఈ బృందాలు పనిచేస్తాయి. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు పరిశీలించి పరిష్కరించేందుకు చీరాల ఉప విద్యాధికారి బి.గంగాధరరావు, తెల్లబాడు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఎం.రమేష్, స్కూల్ అసిస్టెంట్ల అభ్యంతరాల పరిశీలనకు పెట్లూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కేసీహెచ్.చలపతి, రుద్రవరం హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, చినగంజాం ఎంఈవో బి.అజయ్‌ను నియమించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ల అభ్యంతరాల పరిశీలన బాధ్యతను తాళ్లూరు హెచ్‌ఎం శ్రీనివాసరావు, తెల్లబాడు హెచ్‌ఎం ఎం.రమేష్, మల్లంపేట హెచ్‌ఎం పీఏ.పద్మనాభరావు, సుంకేశుల హెచ్‌ఎం కృష్ణప్రసాద్‌కు అప్పగించారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన సెక్షన్ అసిస్టెంట్లు వీరికి సహాయకారులుగా వ్యవహరిస్తారు. ఈ మూడు టీంలు బదిలీల ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తారు. ఎడిట్ ఆప్షన్‌ను ఉపయోగించి పాయింట్లలో మార్పులు,చేర్పులు చేస్తారు.

40 అభ్యంతరాలు పరిష్కారం

గ్రేడ్-2 హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాపై 40 మంది హెచ్‌ఎంలు అభ్యంతరాలు తెలిపారు. అవన్నీ ప్రధానంగా పాయింట్లు కలవకపోవడంపైనే వచ్చాయి. వాటిని పరిశీలించి పరిష్కరించి ఆ మేరకు ఆన్‌లైన్‌లో మార్పులు చేశారు. హెచ్‌ఎం బదిలీలకు మొత్తం 111 ఖాళీలను ప్రకటించారు. అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం ముగియడంతో బదిలీల తుది సీనియారిటీ జాబితా సోమవారం రాత్రికి విడుదలవుతుందని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. పీఎస్ హెచ్‌ఎంలు 149 మంది, 149 మంది ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు బదిలీకి దరఖాస్తులు చేశారు. వీటి మొదటిదశ పరిశీలన సంబంధిత ఎంఈవో స్థాయిలో జరిగింది. రెండవ దశ స్థానిక డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్‌లో సోమవారం ముగిసింది.

హెల్త్ అసిస్టెంట్ల బదిలీలు

- చీరాలకు చెందిన యూనియన్ నేత వైద్యశాఖ వద్ద హడావుడి
- మరో యూనియన్ నేతలు అడ్డుకొనే ప్రయత్నం

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో సీజనల్ వ్యాధులు అధికంగా ఉండే ప్రాంతాలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద హెల్త్ అసిస్టెంట్లకు సోమవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల ప్రక్రియ జరిగింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మెరిట్ జాబితా ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి వర్క్‌అడ్జెస్ట్‌మెంట్ బదిలీలు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 97 మంది హెల్త్‌అసిస్టెంట్లకు ఈ ప్రక్రియను చేపట్టారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి క్లారిఫికేషన్ తీసుకున్న అనంతరం ఈ బదిలీలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో డెంగ్యూ, మలేరియా తదితర రకాల వ్యాధులు అధికంగా నమోదయ్యే ప్రాంతాలకు హెల్త్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్ల బదిలీలపై చీరాలకు చెందిన ఒక యూనియన్ నాయకుడు వైద్యశాఖ కార్యాలయం వద్ద హడాహుడి చేశారు. తానే ఈ బదిలీల ప్రక్రియను చేపడుతున్నట్లుగా వ్యవహరించడంతో బాపట్ల ప్రాంతానికి చెందిన మరో యూనియన్ నాయకుడు అడ్డుకొనే ప్రయత్నం చేశారు. దీంతో కొంత సేపు వైద్యశాఖ కార్యాలయం వద్ద గందరగోళం నెలకొంది. చీరాలకు చెందిన యూనియన్ నాయకుడికి వైద్యశాఖ కార్యాలయంలో ఏం పని ఉందని ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. ఆ యూనియన్ నాయకుడి హడాహుడితో హెల్త్ అసిస్టెంట్లకు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో వెంటనే ప్రభుత్వ గుర్తింపు పొందిన బాపట్లకు చెందిన మరో యూనియన్ నాయకుడు అక్కడకు వచ్చి ఈ విషయాన్ని ప్రశ్నించారు. దీంతో అక్కడ కొంత సేపు రగడ నెలకొంది.

అస్తమయం ఎరుగని ఎర్రసూర్యుడు

మాదాల



● విప్లవ, అభ్యుదయ భావాల చిత్రాలతో మంచి గుర్తింపు ● నేడు మాదాల రంగారావు 7వ వర్ధంతి

ఒంగోలు కల్చరల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామంలో 1948 మే 25వ తేదీన కిష్టయ్య, హనుమాయమ్మ దంపతులకు అత్యంత ధనిక కుటుంబంలో జన్మించిన మాదాల రంగారావు తొలిరోజుల నుంచి విప్లవభావాలు కలిగిన వ్యక్తి. ఆయన విద్యాభ్యాసం ఒంగోలులో కొనసాగింది. ఆయన ప్రాథమిక విద్యను ఒంగోలు డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూలులో సాగించారు. అనంతరం కళాశాల విద్యను సిఎస్ఆర్ శర్మ కళాశాలలో పూర్తి చేశారు. ఆ సమయంలోనే అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్), ప్రజానాట్యమండలి సభ్యులుగా ఎంతో చురుకైన పాత్ర పోషించారు. అటు జిల్లాలోని పలుప్రాంతాల్లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో వేదికలపై ఆయన పలు అభ్యుదయ నాటకాల్లో నటించి మెప్పించారు. అనంతరం ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి మాదాల రంగారావు ఎంఏ పట్టా పొందారు. ఆ సమయంలోనే ఆయనకు కమ్యూనిస్టు పార్టీతో అనుబంధం ఏర్పడింది. అది మొదలు ఆయన భారత కమ్యూనిస్టు పార్టీలో ఎంతో చురుకైన పాత్ర పోషించారు. కళాశాలలో తను చదివే రోజుల్లో ఇతర విద్యార్థుల జీవనవిధానం, జీవితమంటే జల్సా చేయటమనుకునే తత్వాన్ని గ్రహించిన మాదాల రంగారావు తన నటించిన చిత్రం స్వరాజ్యంలో ఆ పరిస్థితిని ప్రతిబింబిస్తూ 'కాలేజీ కుర్రవాడ కులాసాగ తిరిగెటోడ, విలాసాల మాట మరువరో.. ఓ విద్యార్థి విప్లవాల బాట నడవరో' అంటూ చిత్రీకరించిన గీతం విద్యార్థి లోకాన్ని ఎంతో ఉత్తేజపరిచింది.

నాలుగు దశాబ్దాల సినీప్రస్థానం

ఎంతో నాటక అనుభవం ఉన్న మాదాల రంగారావు 1974లో గుత్తా రామినీడు దర్శకత్వంలో చలం, విజయలలిత ప్రధాన పాత్రధారులుగా వచ్చిన 'చైర్మన్ చలమయ్య' చిత్రం ద్వారా సినీరంగప్రవేశం చేశారు. ముగ్గురు మూర్ఖురాళ్లు, బంగారు చెల్లెలు, చిలిపి వయసు, మరో కురుక్షేత్రం, మహా ప్రస్థానం, విప్లవ శంఖం, నవోదయం, ప్రజాశక్తి, స్వరాజ్యం, వీరభద్రుడు, జనం మనం, బలిపీఠంపై భారతనారి, తొలిపొద్దు, ఎర్రసూర్యుడు, ఎర్రపావురాలు వంటి ఎన్నో విప్లవాత్మక, అభ్యుదయ చిత్రాల్లో నటించిన మాదాల రంగారావు మంచి అభిరుచి కలిగిన నిర్మాత కూడా. మాదాల రంగారావు ఎంతో సామాజిక ప్రయోజనమైన చిత్రాలను నిర్మించి అటు సినీపరిశ్రమ నుంచి, ఇటు ప్రేక్షకులనుంచి జేజేలందుకున్నారు. ఆయన 'నవతరం పిక్చర్స్' అనే నిర్మాణ సంస్థను ఏర్పాటుచేసి ఆ బ్యానర్‌పై 1980లో ధవళ సత్యం దర్శకత్వంలో 'యువతరం కదిలింది' సినిమాని తొలిసారిగా నిర్మించారు. కేవలం ప్రేమకథా చిత్రాలు, కుటుంబ కథా చిత్రాలు వంటి సినిమాలు మాత్రమే సినీరంగాన్ని ఏలుతున్న రోజుల్లో ఆ సినిమా పెను సంచలనాన్ని సృష్టిస్తూ 100 రోజులకు పైగా దిగ్విజయంగా ప్రదర్శితమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ఆ చిత్రం ఉత్తమ నటుడు, ద్వితీయ ఉత్తమ చిత్రం వంటి నంది బహుమతులను సాధించింది. ఆయన నిర్మించిన రెండవ చిత్రం ఎర్రమల్లెలు 1981 డిశెంబరు 31న విడుదలై బాక్సాఫీసు వద్ద రికార్డులు సృష్టించింది. లాభాలకోసం సినిమా తీసే నిర్మాతగా కాకుండా, కళ సమాజం కోసమేనని నమ్మి, సమసమాజ స్థాపన దిశగా తన చిత్రాలు ఉండాలనుకునే నిర్మాత మాదాల రంగారావు.

మాదాల రంగారావు కుమారుడు మాదాల రవి సైతం నటుడిగా కొద్ది చిత్రాల్లో నటించారు. ఎర్రమల్లెలు చిత్రంలోని సూపర్‌డూపర్ హిట్ పాట 'నాంపల్లి స్టేషను కాడ రాజలింగో'లో బాలనటుడిగా ఆయన నటించి మెప్పించారు. నేనుసైతం చిత్రం ద్వారా హీరోగా వెండితెరకు పరిచయమయ్యారు. ఆయన ఏఐఎస్ఎఫ్ నాయకునిగా, జీఐఎస్ దేశాల తరపున రష్యాలో కల్చరల్ విభాగం కార్యదర్శిగా, కమ్యూనిస్టు ఉద్యమాల్లోను చురుకైన పాత్రపోషించి తండ్రికి తగ్గ తనయునిగా పేరుగాంచి ప్రస్తుతం హైదరాబాదులో ప్రముఖ వైద్యునిగా ఉన్నారు.

● క్రమశిక్షణ, పట్టుదల ఆయన వ్యక్తిత్వం

మాదాల రంగారావు ఒక క్రమశిక్షణ, పట్టుదల కలిగిన గొప్ప కళాకారుడు. కళ కళకోసం కాదు సమాజం కోసమని ప్రగాఢంగా నమ్మి, తను నమ్మిన సిద్ధాంతం కోసం తుది దాకా నిలబడిన గొప్ప అభ్యుదయ, విప్లవ భావజాలం కలిగిన వ్యక్తి మాదాల రంగారావు. తను సినిమా ప్రారంభించేటప్పుడే దాని విడుదల తేదీని ప్రకటించి, కచ్చితంగా ఆ సమయానికి చిత్రాన్ని పూర్తిచేసే నిబద్ధత కలిగిన నటుడు, నిర్మాత మాదాల రంగారావు. ఆయన ఎంతో దానగుణం కలిగిన దానశీలి. తాను సినిమాల్లో ఆర్జించిన దాన్ని ఆయన ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలకు విరాళాలుగా ఇచ్చారు.

> సామాజిక సమస్యలపై కదంతొక్కుతూ 'యువతరం కదిలింది' అని హెచ్చరిస్తూ, 'విప్లవశంఖం' పూరించి బడుగు, బలహీన, అణగారిన వర్గాల బతుకుల్లో 'ఎర్రమల్లెలు' పూయించి, రాజకీయ నాయకుల, సమాజంలోని మృగాళ్ల స్వార్థానికి బలైన 'బలిపీఠంపై భారతనారి' హృదయవిదారక స్థితిని కళ్లకుకట్టి, తన చిత్రాల ద్వారా 'ప్రజాశక్తి'ని మేలుకొలుపుతూ 'ఎర్రపావురాలు' ఎగురవేసిన 'ఎర్రసూర్యుడు', విప్లవ, అభ్యుదయ భావాలకు నిలువెత్తు రూపంగా నిలిచిన నటుడు, నిర్మాత, దర్శకుడు, 'రెడ్‌స్టార్' మాదాల రంగారావు అభిమానుల గుండెల్లో శాశ్వతంగా నిలిచిఉండే ఎర్రసూర్యుడు. తను తీసింది, నటించింది తక్కువ చిత్రాలే అయినా తెలుగు చిత్రసీమలో ఆయన తన చిత్రాల ద్వారా ఒక విప్లవజ్యోతిగా వెలిగారు. అటువంటి మాదాల రంగారావు మరణించి నేటికి 7 సంవత్సరాలు. 2018 మే 27వ తేదీన ఆయన హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు.

ఎందరికో మార్గదర్శి

మాదాల రంగారావు ఎందరో నటులకు మార్గదర్శిగా ఉండటమే కాకుండా వారు సినీరంగంలోకి ప్రవేశించటానికి, అక్కడ రాణించటానికి ఎంతో చేయూతనందించారు. సంచలన దర్శకుడు టి.కృష్ణ, నిర్మాత పోకూరి బాబూరావు, నటులు నర్రా వెంకటేశ్వరరావు, ధర్మవరపు సుబ్రహ్మణ్యం వంటి వారెందరో ఆయన ప్రోత్సాహంతో సినీ పరిశ్రమలో అడుగుపెట్టినవారే. అప్పటివరకు ఎక్కువగా స్టూడియోలకే పరిమితమైన చిత్రనిర్మాణానికి భిన్నంగా ఆయన ఒంగోలు, టంగుటూరు, గుంటూరు, విజయవాడ పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో తన చిత్రాల చిత్రీకరణ చేశారు.

మద్యం స్కాంను పక్కదారి పట్టించేందుకే..

● జగన్ పొదిలి పర్యటనపై ఎమ్మెల్యే కందుల

పొదిలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : మద్యం స్కాంలో ఒక్కొక్కరూ కటకటాల వెనక్కి వెళ్తుండడం చూసి జగన్ రెడ్డికి వెన్నులో వణుకుపుట్టి, దానిని డైవర్ట్ చేసేందుకు పొదిలి పొగాకు బోర్డ్ సందర్శనకు వస్తున్నారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం పొగాకు బోర్డు సందర్శించిన ఎమ్మెల్యే స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో ప్రజలు, రైతులపై ప్రేమ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పుడు ఉన్నట్టుండి రైతుల కోసం రావడం పట్ల ప్రజలు ఆశ్చర్యపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకుల అవాకులు చవాకులు మానుకొని ప్రజలకు, రైతులకు మంచి జరిగే పనులపై సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే కందుల అన్నారు.

కొడుకు మరణాన్ని తట్టుకోలేక

గంటల వ్యవధిలోనే తండ్రి మృతి

● నాగులపాలెంలో విషాదం ● ఇద్దరికీ ఒకేసారి అంత్యక్రియలు



తండ్రీ కొడుకుల అంతిమయాత్ర



హరిబాబు (ఫైల్)



మణికంఠ (ఫైల్)

నాగులపాలెం(పర్చూరు), మే 26 (ఆంధ్రజ్యోతి) : కుమారుడి మరణాన్ని తట్టుకోలేక తండ్రి మృతిచెందిన ఘటన బాపట్ల జిల్లా, పర్చూరు మండలం, నాగులపాలెం గ్రామంలో చోటుచేసుకొంది. కుమారుడు మృతిచెందిన గంటల వ్యవధిలోనే తండ్రి హఠాన్మరణం చెందాడు. ఈ ఘటన కుంటుంబసభ్యులను, గ్రామస్థులను కలచివేసింది. నాగులపాలెం గ్రామానికి చెందిన పోత్రు మణికంఠ (34) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందారు. కుమారుని మృతితో తల్లడిల్లిన హరిబాబు (64) రాత్రంతా దుఃఖంతో కుమిలిపోయాడు. సోమవారం ఉదయం అంత్యక్రియల ఏర్పాటు చేస్తున్న తరుణంలో నీరసించిపోయాడు. స్థానికంగా ఉన్న వైద్యుని ద్వారా చికిత్స అందించేలోపు కన్నుమూశాడు. ఒకే కుటుంబంలో తండ్రీకొడుకులు ఇలా మృతిచెందటంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. కుమారుని అంత్యక్రియలకు వచ్చిన బంధువులకు తండ్రికి అలా జరగడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇద్దరి మృతదేహాలకు ఒకేసారి బంధువులు గ్రామంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రీకొడుకుల దేహాలను ఒకరి వెంట మరొకరిని శ్మశాన వాటికకు తరలిస్తున్న తీరు చూపరులను సైతం కన్నీరు పెట్టించింది. ఇలాంటి ఘటన ఎన్నడూ చూడలేదని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

సమస్యను పరిష్కరించలేదంటూ

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

● ఇలా ఇది మూడోసారి.. ● హుటాహుటిన రిమ్స్‌కు తరలింపు

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): తన సమస్యను పరిష్కరించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని త్రిపురాంతకానికి చెందిన సౌభాగ్యమ్మ వెంట తెచ్చుకున్న డబ్బాలోని ద్రావణాన్ని తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌సెల్‌కు ఆమె ముందుగానే ద్రావణాన్ని కొద్దిగా తాగి లోపలికి వచ్చారు. అయితే ఆమె అక్కడ కూర్చొని ఉండగా విషయాన్ని గుర్తించిన సిబ్బంది జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషుకు సమాచారం అందించారు. దీంతో వెంటనే డీఆర్వో అక్కడకు చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్రిపురాంతకంలో తనకు ఇంటిస్థలం ఉందని, దానిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకొని ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అనేకసార్లు అధికారులను కలిసి సమస్యను తెలిపినా పట్టించుకోవడం లేదని కన్నీరు పెట్టుకుంది. పోలీసుల సహకారంతో ఆమెను వెంటనే 108 అంబులెన్స్‌లో రిమ్స్ వైద్యశాలకు తరలించారు. ఆమె పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సౌభాగ్యమ్మ గతంలో కూడా ఇదేవిధంగా రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసింది. ఒకసారి త్రిపురాంతకంలో, మరోసారి ఎస్పీ కార్యాలయం ఎదుట సౌభాగ్యమ్మ పురుగుమందు తాగడంతో అప్పట్లో కూడా ఇలాగే వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. తాజాగా సోమవారం జరిగిన గ్రీవెన్స్‌సెల్‌కు వస్తూనే ఆమె డబ్బాలో తెచ్చుకున్న ద్రావణాన్ని తాగి లోపలికి వచ్చింది. సకాలంలో అక్కడ ఉన్న సిబ్బంది గుర్తించి ఆమెను కాపాడారు.

హెచ్‌ఎంలకు ప్రమోషన్లు

ఒంగోలు విద్య, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జిల్లాపరిషత్, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. అందుకోసం మంగళ, బుధవారాల్లో స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. హెచ్‌ఎం ఉద్యోగోన్నతులకు అర్హులైన స్కూలు అసిస్టెంట్లు ఒక పోస్టుకు ముగ్గురు చొప్పున సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ యాజమాన్యంలో ఖాళీగా ఉన్న 83 పోస్టులకు 249 మంది జాబితా పెట్టారు. ఈ జాబితాలో మొదట 120 మంది మంగళవారం, మిగిలిన వారు బుధవారం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలి. మునిసిపల్ యాజమాన్యంలోని నాలుగు పోస్టులకు 12 మంది మంగళవారం హాజరు కావాలి. మునిసిపల్ కార్పొరేషన్‌లో ఒక పోస్టుకు ముగ్గురు మంగళవారం హాజరు కావాలి. సర్టిఫికేట్ల పరిశీలనకు హాజరయ్యే వారు తమ సర్వీసు రిజస్టర్లు, విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరు కావాలని డీఈవో కోరారు.

నగర అభివృద్ధి కోసం సమష్టిగా పనిచేయాలి

● ప్రజల నుంచి ఫిర్యాదులొస్తే ఉపేక్షించేది లేదు
● కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులకు ఎమ్మెల్యే దామచర్ల ఆదేశం
● బీవీఎస్ హాల్ రోడ్, ట్రంక్‌రోడ్ విస్తరణకు చర్యలు చేపట్టాలి
● టీడీపీ కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులతో దామచర్ల సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన మేయర్ సుజాత

ఒంగోలు, కార్పొరేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : 'అభిప్రాయబేధాలు వీడాలి. పౌరసేవలు పారదర్శకంగా అందించాలి. పరిశుభ్రమైన నగరం కోసం పారిశుధ్యం మెరుగుపరచడంతోపాటు, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించాలి. ప్రగతి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. పౌర సేవల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదు' అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నగర అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్షన్‌ల వారీగా దామచర్ల సమీక్షించారు. నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. 700కి పైగా కార్మికులు ఉన్నారు. వారిపై పర్యవేక్షకులుగా సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఉన్నా, నగరం కంపు కొడుతుందని ఆసహనం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకుని పనిచేయాలని హెచ్చరించారు. ఇంజనీరింగ్ విభాగంలో తాగునీటి సరఫరాలోనూ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. స్వచ్ఛమైన నీరు అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. నగర అభివృద్ధి కోసం ప్రతిపాదించిన, ప్రారంభించిన, పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులు, నివేదికలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సెక్షన్ పనితీరుపైనా దామచర్ల అసహనం వ్యక్తం చేశారు. పన్నులు విధించడంలోనూ, మదింపుల్లోనూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సిబ్బంది చేతివాటంపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే దామచర్ల అక్రమ కట్టడాల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. అనుమతుల మంజూరులో ఆలస్యం లేకుండా చూడాలని, టౌన్‌ప్లానింగ్‌లోనూ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జితోపాటు, టీడీపీ అడ్మినిస్ట్రేషన్, రెవిన్యూ, శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్‌ల విస్తరణకు త్వరితగతిన మార్కింగ్ చేయాలి

కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి పాతమార్కెట్ వరకు (బీవీఎస్) హాలు రోడ్ 80 అడుగులు విస్తరిస్తున్న నేపథ్యంలో ట్రంక్ రోడ్‌ను 100 అడుగులు విస్తరిస్తున్న నేపథ్యంలో మార్కింగ్ త్వరితగతిన చేసి, పనులు చేపట్టాలన్నారు. ఇదే సమయంలో ఒకవైపు నగర అభివృద్ధి కోసం పలు ఆదేశాలు జారీ చేస్తూనే, విధుల్లో అలసత్వం, అవినీతి ఆరోపణలు ఉన్న ఉద్యోగులను ఎమ్మెల్యే తనదైన శైలిలో మందలించారు. నగర అభివృద్ధి కోసం తాను నిరంతరం కష్టపడుతున్నాని, అందుకు అధికారులు కూడా సహకారం అందిస్తుండగా, క్షేత్రస్థాయిలో సిబ్బంది మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దామచర్ల సీరియస్ అయ్యారు.

● అభిప్రాయ భేదాలు వీడాలి

అటు పాలకవర్గం సభ్యులు, ఇటు అధికారులు, ఉద్యోగులు అందరు సమష్టిగా కష్టపడి పనిచేస్తేనే ప్రగతి సాధ్యపడుతుందని పేర్కొన్న దామచర్ల ప్రజలు మెచ్చుకునేలా ప్రతిఒక్కరు పనిచేయాలన్నారు. ఎన్ని అభిప్రాయ విబేధాలు ఉన్నా, వాటిని అన్నింటిని పక్కన పెట్టాలని నగర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే దామచర్ల ఆదేశించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాలకవర్గంలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపైనా దామచర్ల చక్కదిద్దే ప్రయత్నం చేశారు. సమీక్ష సమావేశానికి ముందు మేయర్ చాంబర్‌లో మేయర్, టీడీపీ కార్పొరేటర్లతో సమావేశం అయిన ఎమ్మెల్యే అంతర్గతంగా ఉన్న అభిప్రాయబేధాలను వదలిలేయాలన్నారు. సమన్వయంతో పనిచేయాలని మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లకు సూచించారు.

ఆదర్శ హెచ్‌ఎంలుగా 375 మంది స్కూలు అసిస్టెంట్లు

● 134 కొత్త పీఎస్ హెచ్‌ఎం పోస్టులు

ఒంగోలు విద్య, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని 375 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా స్కూలు అసిస్టెంట్లు (సబ్జెక్టు టీచర్లు) నియమితులుకానున్నారు. మొత్తం 805 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఊపిరిపోసుకోనున్నాయి. ఈ పాఠశాలలకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులతో పాటు తరగతికి ఒక టీచర్‌ను నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 805 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేశారు. అయితే జిల్లాలో 296 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు మాత్రమే ఉన్నాయి. దీంతో మిగిలిన 509 మంది ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంలుగా మిగులుగా తేలిన స్కూలు అసిస్టెంట్లను నియమించాలని నిర్ణయించారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మారిన పరిణామాల నేపథ్యంలో జిల్లాలో మిగులు స్కూలు అసిస్టెంట్ల సంఖ్య తగ్గింది. హైస్కూళ్లలో 49 మందికి మించితే రెండవ సెక్షన్‌గా పరిగణించడంతో పాటు జిల్లాలో మిగులు స్కూలు అసిస్టెంట్లు తగ్గింది. ఈ నేపథ్యంలో 375 మంది స్కూలు అసిస్టెంట్లనే ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమిస్తున్నారు. వీరిలో స్కూలు అసిస్టెంట్‌గా ఇంగ్లీషు 126 మంది, గణితం 110 మంది, తెలుగు 80 మంది, సోషల్ 30 మంది, హిందీ 12 మంది, ఫిజికల్‌సైన్స్ 11 మంది, ఉర్దు నలుగురు, సంస్కృతం ఇద్దరు స్కూలు అసిస్టెంట్లను పీఎస్ హెచ్‌ఎంలుగా నియమిస్తున్నారు.

● 134 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు మంజూరు

జిల్లాకు కొత్తగా 134 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు మంజూరు కానున్నాయి. 805 పోస్టులకుగాను 296 గతంలో మంజూరైనవే. ప్రస్తుతం 375 స్కూలు అసిస్టెంట్లు పోను మిగిలిన 134 పోస్టులను కొత్తగా మంజూరు చేసి సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఉద్యోగోన్నతుల ద్వారా ఈ పోస్టులు భర్తీ చేయనున్నారు.

యోగాతోనే ఉత్తమ ఆరోగ్యం

● కలెక్టర్ అన్సారియా



మద్దిపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి) : యోగా సాధనతోనే ఉత్తమమైన ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. సోమవారం గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద యోగాభ్యాసం కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్వాసమీద ధ్యాస ఉంచి మనసును, శరీరాన్ని ఏకంచేసే ప్రక్రియే యోగాభ్యాసం అన్నారు. నేటి ఒత్తిడి జీవనవిధానంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేస్తూ ప్రజల్లో మరింత ఆసక్తి పెంచేలా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల రోజులు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు శిక్షణనిచ్చేందుకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించి వారికి కూడా ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్థానిక శాసనసభ్యుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ సంతోషం, ఆరోగ్యం సంపన్నవంతమైన సమాజ ఆవిష్కరణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఇందులో భాగంగా ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టిందని అన్నారు. యోగాను ప్రతిఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా నిర్వహించే కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని, జూన్ 21న జిల్లాలో 10 లక్షల మంది యోగాసనాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో కిరణ్ కుమార్, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా ఆయుష్ అధికారి బైద్యనాథ్, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు పద్మజ పాల్గొన్నారు.

అవీ..ఇవీ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకొనేది లేదు

● కార్మిక సంఘాల నాయకుల హెచ్చరిక

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకొనేది లేదని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్‌టీయూ న్యూ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌సాయిలు అధ్యక్షత వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంయుక్తకిసాన్ మోర్చా జిల్లాకన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. ఒక పక్క విశాఖ ఉక్కును ప్రైవేటీకరించమని చెప్తూనే మరో వైపు దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే ఆంజనేయులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును రక్షించుకొనేందుకు వ్యవసాయకార్మికులందరూ ఏకమై పోరాడతామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డెహను మారెడ్డి మాట్లాడుతూ కేంద్రానికి మద్దతు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కే వీరారెడ్డి, ఎస్‌డీ సర్దార్, శ్రీరామ్ శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, బీవీ రావు, సీహెచ్ రాంబాబు, పేరయ్య, దామా శ్రీనివాసులు, జి. రమేష్ తదితరులు ఉన్నారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు.



కొప్పోలు ఎస్సీ కాలనీ లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు

ప్రజల సహకారంతో పారిశుధ్య పనులు

● కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(రూరల్),మే26(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో జరిగే పారిశుధ్య కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఒంగోలు నగరం 10వ డివిజన్ కొప్పోలు ఎస్సీకాలనీలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమాలలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ కాలువల్లో చెత్తా చెదారం వేయటం ,పూడ్చటం లాంటివి చేవద్దు అని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతివార్డులో 5నుంచి 6రోజులు పారిశుధ్య కార్యక్రమాలను ప్రత్యేకంగా చేపడతామన్నారు. ఈకార్యక్రమాలలో కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ గంగాడ సుజాత, నగర సహాయ కమిషనర్ కొండయ్య, అధికారులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలను విక్రయిస్తున్న సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయల విక్రయం

కొండపి, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలను స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేసి సోమవారం విక్రయించారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జిలు రంజిత్, మాధవ మాట్లాడుతూ ఈ కూరగాయలు వినియోగించుకోవడం వలన ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వెలుగు ఏపీఎం గోపీనాథ్ మాట్లాడుతూ పెరట్లో, ఖాళీ స్థలాల్లో డ్వాక్రా మహిళలు ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయలు పండించుకోవచ్చన్నారు. ఐసీఆర్పీలు జ్యోత్స్న, గౌతమి, విజయలక్ష్మి తిరుమల, కొండయ్య పాల్గొన్నారు.

నేడు పాలస్తీనా ముఖచిత్రం పుస్తకావిష్కరణ

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : రైతు కూలీ సంఘం ప్రచురించిన పాలస్తీనా ముఖచిత్రం పుస్తక ఆవిష్కరణ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో జరుగుతుందని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తకావిష్కరణలో సంఘం జిల్లా అధ్యక్షుడు వేజండ్ల రామారావు, జనసాహితీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ కృష్ణయ్య, రిటైర్డ్ అధ్యాపకుడు ఎం. విజయభాస్కర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్‌కే ఖాదర్‌బాషా, సీపీఐ ఎంఎల్ నాయకుడు డీవీ ఎస్‌స్వామిలు పాల్గొంటారని తెలిపారు.

కాకాణి అరెస్టును ఖండించిన బూచేపల్లి

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. అధికార పార్టీ ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తున్నారన్న కారణంతోనే అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిస్తున్నారని ఆయన ఆరోపించారు.

అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

కలెక్టర్ తమీమ్ అన్సారియా



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను తరచూ కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటుంటే సహించేది లేదని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణతో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటికి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు పెండింగ్‌లో ఉండరాదన్నారు. అధికారులు ప్రతిరోజూ లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని, రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేశు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్, వరకుమార్, జాన్సన్, విజయ జ్యోతి, డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి తదితరులు ఉన్నారు.

● ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటలకు 90శాతం సబ్సిడీతో విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, సూక్ష్మపోషకాలు అందించే పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేవీరారెడ్డి, వడ్డె హనుమారెడ్డిలు కోరారు. చిన్న, సన్నకారు రైతులతో పాటు కౌలు రైతులకు కూడా 90శాతం సబ్సిడీతో అందివాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ ఖరీఫ్ సీజన్‌కే రైతులకు అందించే విధంగా చర్యలు తీసు కోవాలని, ఉత్పత్తి ఖర్చులు పెరిగినందున స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు అందించాలని కలెక్టర్‌ను కోరారు.

● మద్దిపూడి తహసీల్దార్ అక్రమాలు, అధికార దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మద్దిపూడి మండలం చిలంకూరు పాత మాదిగపల్లెకు చెందిన కొనికపోగు ఇజ్రాయిల్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు.

రేషన్ కార్డుల సమస్యను పరిష్కరించాలి

ఒంగోలు(రూరల్): రేషన్‌కార్డుల సమస్యలను పరిష్కరించాలని పలువురు అర్జీదారులు ఒంగోలు అర్బన్ తహసీల్దార్ పి.మధుసూదనరావుకి సోమవారం వినతిపత్రం సమర్పించారు. కొందరు అర్జీదారులు రేషన్ కార్డులో పేరు నమోదుకు కంప్యూటర్‌లు తీసుకోవడం లేదని, మరి కొందరు భూములు ఆన్‌లైన్ చేయాలని, తప్పులు సరిదిద్దాలని రూరల్ తహసీల్దార్ నాయబ్‌రసూల్‌కి రైతులు అర్జీలు సమర్పించారు.

మోసాలపై ఎస్పీకి ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలను వింటున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం,మే 26(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన మహిళ సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. తమ వాట్సాప్ నంబర్‌కు ఒక మెసేజ్ వచ్చిందని, కొంత మొత్తం పెట్టుబడితో గేమ్ ఆడితే మనీ గెలవచ్చనీ ఆశ చూపించడంతో విడతల వారీగా రూ. 1.15 లక్షలు చెల్లించానని కనిగిరికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది. అయితే ఇంకా ఎక్కువ నగదు చెల్లిస్తే మొత్తం నగదు వస్తుందని తనకు మెసెజ్ చేసారని, దీతో తాను మోసపోయానని గ్రహించి ఫిర్యాదు ఇస్తున్నానని అందులో పేర్కొన్నారు.

- క్రెడిట్ సొసైటీ పేరుతో రుణం మంజూరు చేయిస్తానని ఆశ చూపించి రూ. 57 లక్షలు గుంటూరుకు చెందిన వ్యక్తి ఆశ చూపించి తీసుకున్నాడని ఒంగోలు వాసి ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

అంతే కాదు 50శాతం సబ్సిడీ కూడా వస్తుందని చెప్పడంతో తాను రూ. 50 లక్షలు డిపాజిట్ చేశానని పేర్కొన్నాడు. అనంతరం విచారించగా అలాంటి క్రెడిట్ సొసైటీ ఏదీ లేదని తెలిసి తాను మోసపోయినట్లు గుర్తించి ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు.

- తన కుమారుడికి విజయవాడ రైల్వే స్టేషన్ లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.25 వేలు ఫోన్ పే ద్వారా అమౌంట్ తీసుకున్నారని సంతనూతలపాడు మండలానికి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశాడు. పేర్నమిట్టకు చెందని ఒకరు, విజయవాడకు చెందిన ఇరువురు వ్యక్తులు కలిసి తనను మోసం చేశారని వాపోయారు.

గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై ఎస్పీ స్పందించి సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ సురేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు పాండురంగారావు, జగదీష్ ,షమీముల్లా, ఎస్సై రజియా సుల్తాన్ పాల్గొన్నారు.

టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తా

దివంగత నేత వీరయ్య చౌదరి సతీమణి సుచిత్ర



అమ్మనబ్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న వీరయ్యచౌదరి సతీమణి సుచిత్ర

నాగులుప్పలపాడు, మే 26 : తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని దివంగత నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి సతీమణి, చవటపాలెం ఎంపీటీసీ ముప్పవరపు సుచిత్ర వెల్లడించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలతో ఆమె రాజకీయ ప్రవేశ పరిచయ కార్యక్రమం, మహానాడు కార్యక్రమానికి పార్టీ శ్రేణుల సమాయాత్త సమావేశం అమ్మనబ్రోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు తేళ్ల మనోజ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుచిత్ర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అంటే వీరయ్య చౌదరికి ఎనలేని అభిమానమన్నారు. నిరంతరం పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేశాడన్నారు. ఆయన హత్యతో పార్టీ నాయకులు, కార్యకర్తలు దిగ్భ్రాంతికి గురయ్యారన్నారు. ఆయన లేని లోటును కనబడకుండా తాను ముందుండి కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. వీరయ్య చౌదరి ఆశయాలను కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులకు నిరంతరం అందుబాటులో ఉండి స్థానిక ఎంఎల్‌ఏ బీఎన్ విజయ్ కుమార్ సూచనలతో పనిచేయనున్నట్లు వెల్లడించారు. గతంలో వీరయ్య చౌదరికి అందించిన సహకారం తనకు అందించి కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. తొలుత అమ్మనబ్రోలులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, వలేటి పాండురంగారావు, ఈదర వెంకట కృష్ణారావు, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాంధ్రలో ప్రజలు భారీగా పాల్గొనేలా చూడాలి

ఒంగోలు(రూరల్),మే26(ఆంధ్రజ్యోతి) : యోగాంధ్రలో ప్రజలు భారీగా పాల్గొనేలా చూడాలని కలెక్టర్ అన్సారియా పిలుపునిచ్చారు. యోగా దినోత్సవాలపై సోమవారం ప్రకాశం భవనంలో మండల స్థాయి అధికారులతో కలెక్టర్ ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సంలో జిల్లాలో పదిలక్షలు మంది పాల్గొనేలా రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం .వెంకటేశ్వరరావు,హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాదు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీపీవో వెంకటనాయుడు, సీపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత

జరుగుమల్లి: యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీడీవో రమణ మూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం వివిధ శాఖల అధికారులు, సిబ్బంది యోగా సాధన చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బి.నాగేంద్రవదన్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు



మద్దిపాడు నుంచి మహానాడుకు తరలుతున్న టీడీపీ శ్రేణులు

మద్దిపాడు, మే 26(ఆంధ్రజ్యోతి):కడపలో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి సోమవారం సంతనూతలపాడు శాసనసభ్యుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండవ జయంతి బాబు నేతృత్వంలో 18 కార్లలో తెలుగుతమ్ముళ్లు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జయంతి బాబు మాట్లాడుతూ మహానాడు నిర్వహించటం సంతోషదాయకమని అన్నారు. మండవ గోపీనాథ్, చుండూరి రఘురాం, కొప్పోలు విశ్వనాథం, రావి ఉమామహేశ్వర రావు, రావి నరసింహారావు, ముత్తనపల్లి రామలింగం, దేవబత్తిన ప్రసాద్, పోకూరి శ్రీనివాసరావు తదితర నాయకులు ఉన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

మద్దిపాడు, మే 26(ఆంధ్రజ్యోతి):రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ ఎస్. నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ నెల నుంచి రేషన్ డీలర్లు నేరుగా కార్డుదారులకు రేషన్ అందించాలని 1వ తేదీ నుంచి 15వ తేదీ లోపు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు షాపుల వద్దనే రేషన్ అందజేయాలన్నారు. వికలాంగులకు, వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ సరఫరా చేయాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి డీలరు స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని, బోర్డులు ఏర్పాటు చేసి నిల్వ సరుకు నమోదు చేయాలని సూచించారు. 1వ తేదీన ప్రజాప్రతినిధుల ద్వారా పండుగ వాతావరణంలో రేషన్ సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వంశీ, ఆర్ఐ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

'దీపం' పక్కదారి పడితే చర్యలు

ఒంగోలు(రూరల్),మే26(ఆంధ్రజ్యోతి): దీపం పథకం-2 పక్కదారి పడితే చర్యలు తప్పవని జేసీ ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్యాస్ సిలిండర్‌లు అధిక ధరలకు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో డీఎస్‌వో పద్మశ్రీ, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు

నిందితులను అరెస్టు చేయాలి

దళిత సంఘాల నిరసన ర్యాలీ

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి మండలం కే బిట్రగుంటలో డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ ఊరేగింపును అడ్డుకున్న నిందితులను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.కేవీపీఎస్, మాల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఊరేగింపును అడ్డుకున్న ఘటనపై జాయింట్ కలెక్టర్‌తో సమగ్ర విచారణ చేయించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు..అనంతరం కలెక్టర్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఈ ఘటనపై డీఆర్వో, ఆర్డీవోలతో జాయింట్ విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

పొన్నలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది.



దొంగలు పగులగొట్టిన హుండీని పరిశీలిస్తున్న ఎస్సై అనూక్

తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు గర్భగుడిలో ఉన్న రూ.40 వేల విలువైన ఆభరణాలు, హుండీలో ఉన్న రూ.10 వేల నగదును అపహరించుకెళ్లారు. ఈమేరకు గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాసరావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అనూక్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీష్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్‌చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 21న నారాయణ్‌పూర్‌లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, మిలటరీ పత్రిక ఎడిటర్ నాగేశ్వరరావు, తెలంగాణాకు చెందిన విజయలక్ష్మి, సంగీత, రాకేష్‌తో పాటు మరో 22 మంది మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా మార్చురీలో పెట్టడం దుర్మార్గంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయిస్తే అక్కడి పోలీసులను కలవాలని చెప్పినా ఇంత వరకు మృతదేహాలను అప్పగించలేదన్నారు. ఇప్పటికైనా మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వీరాంజనేయులు, వెంకటేష్, క్రాంతి, చావలి సుధాకర్, జార్జి, పద్మ, రాజా, లింగయ్య, దాసరి సుందరం తదితరులు ఉన్నారు.



ప్రతిభచాటిన విద్యార్థులతో ముఖ్యఅతిథులు, ప్రతినిధులు

విద్యతోనే విలువలు

● ప్రతిభచాటిన పద్మశాలీ విద్యార్థులకు సత్కారం

చీమకుర్తి,మే26(ఆంధ్రజ్యోతి): విద్య నేర్చుకోవటం ద్వారా విలువను పొందవచ్చని ఆర్‌డబ్ల్యూడీ జిల్లా పీడీ పి.విద్యాసాగర్ తెలిపారు.పట్టణంలోని భద్రావతి సమేత భావనారుషి కల్యాణమండపంలో గత విద్యాసంవత్సరంలో పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభచాటిన పద్మశాలీ విద్యార్థులకు పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభాపురస్కారాలు అందచేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విద్యాసాగర్ మాట్లాడుతూ చదువుతో జీవన స్థితిగతులు మారిపోతాయన్నారు.ప్రతి ఒక్కరూ ఉన్నతవిద్యను అభ్యసించి అత్యున్నతస్థాయికి ఎదగాలని అకాంక్షించారు. ప్రముఖ న్యూరాలజిస్టు వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులు టెక్నాలజీతో కూడిన విద్యను అభ్యసించాలని కోరారు. గుండె వైద్యనిపుణుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యవిద్యను అభ్యసించటానికి విద్యార్థులు ఆసక్తి చూపాలన్నారు. అనంతరం విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా ప్రతిభాపురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి,కౌన్సిలర్ సోమా శేషాద్రి, సంఘనాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



చదువుచెప్పిన గురువులతో పీవీఆర్ స్నేహ 1983 బ్యాచ్

చదువు నేర్పిన గురువులకు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : తమకు 42 ఏళ్ల క్రితం చదువు నేర్పిన గురువులను ఒంగోలులోని పీవీఆర్ స్నేహ 1983 పదవ తరగతి బ్యాచ్ సోమవారం ఘనంగా సత్కరించింది. స్థానిక కర్నూలు రోడ్డులోని ఏ గ్రాండ్ ఫంక్షన్‌హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొప్పోలు హనుమంతరావు, ఉపాధ్యాయులు కేకేఆర్, శాస్త్రి, రామ్మోహనరావు, కేవీఎస్, రామచంద్రరావు, డ్రిల్ మాస్టర్ విజయలక్ష్మిలను పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పీవీఆర్ స్నేహ అధ్యక్షుడు దుగ్గిశెట్టి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రమశిక్షణగా మసలుకోవడం ఇతరులకు సహాయంచేసే గుణాన్ని గురువులు నేర్పించారన్నారు. మేమంతా ఈ హోదాలో మా కుటుంబాలతో సంతోషంగా ఉండేందుకు గురువులు ఎంతో సహాయపడ్డారన్నారు. కార్యదర్శి ఎస్‌ఎస్ అరుణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చదువుతో పాటు కుటుంబాన్ని ఏ విధంగా చక్కదిద్దుకోవాలి,పిల్లలను ఏ విధంగా చదివించుకోవాలి, ఇతరులతో ఏవిధంగా మసలుకోవాలో నేర్పించినందున వల్లనే తాము హాయిగా జీవిస్తున్నామని తెలిపారు. గౌరవాధ్యక్షుడు అయినాబత్తిన ఘనశ్యాం ఈ కార్యక్రమాన్ని దగ్గర ఉండి పర్యవేక్షించారు. వ్యాఖ్యాతగా గంజాం రంగనాథ్ వ్యవహరించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వంద కుటుంబాలతో హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని అహ్లాదవాతావరణంలో నిర్వహించారు.



సీపీఎం నగర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మాబు

జాతీయ సమైక్యతను కాపాడుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు సూచించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం జరిగిన నగర కమిటీ స మావేశానికి జి. రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాబు మాట్లడుతూ గతనెల 22న జరిగిన పెహల్గామ్ ఘటనను ప్రధానమంత్రి మోదీ మత రాజకీయం చేస్తున్నారన్నారు. ఉగ్రవాద చర్యలను మతాలకు ఆపాదించడం హేయమైన చర్య అని అన్నారు. జూన్ 1న సుందరయ్య భవన్‌లో జరిగే జాతీయ సమైక్యత సదస్సులో పీడీఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ కేఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నాయకులు తంబి శ్రీనివాసులు, బీవీ రావు, కే శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వైసీపీ మహిళా కార్యదర్శిగా రమణమ్మ

మద్దిపాడు, మే 26(ఆంధ్రజ్యోతి):వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా నన్నపురెడ్డి రమణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు ఆపార్టీ ఎస్‌ఎన్‌పాడు ఇన్‌చార్జి మేరుగ నాగార్జున నియామక పత్రాన్ని అందజేశారు.

భూసార పరీక్షలతో మేలు

- మట్టి నమూనాకు అనువైన సమయమంటున్న అధికారులు
- ఫలితాలపై రైతులకు అవగాహన
- ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలి : ఏడీఏ

ఎర్రగొండపాలెం రూరల్ మే 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు చేస్తున్న పంటలకు రసాయనిక ఎరువులు ఇష్టారాజ్యంగా వినియోగించడంతో భూములు సారాన్ని కోల్పోతున్నాయి. దిగుబడులు తగ్గిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎరువులు అధికంగా వాడకుండా భూసారం మేరకు వినియోగం ప్రకృతి వ్యవసాయం చేసేలా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్న రైతుల్లో మార్పు రావడం లేదు. దీంతో ప్రభుత్వం రైతుల భూములను బట్టి ఏ పంట వేస్తే బాగుంటుంది దిగుబడి ఎంత వస్తుందో తెలిపేలా మట్టి నమూనా సేకరణ కార్యక్రమం చేపట్టింది. ఈ మట్టి నమూనా సేకరించి పరీక్షలు చేసి ఆయా భూములలో ఏ పంట సాగు చేయాలో ఎంత మేర మందులు తదితర వాడాలో రైతులకు వ్యవసాయాశాఖ అధికారులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది వివరిస్తారు.


మట్టిని వేరు చేస్తున్న రైతు


మట్టిని జల్లెడ పడుతున్న రైతు సేవా కేంద్రం సిబ్బంది

సేకరణకు ఇది అనువైన సమయం

వేసవి కాలంలో భూములు దున్నకాలు చేసి జూన్‌లో పంటలు ఖరీఫ్ సాగు చేసేందుకు సిద్ధంగా ఉంచుకుంటారు. ఆ సమయంలో పొలంలోని భూ నమూనా పరీక్షలు చేయించేందుకు అనువైన సమయమని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు. భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పోటాష్ పరిమాణాల్లో మార్పులను భూసారా పరీక్షల ద్వారా గుర్తించవచ్చునని అంటున్నారు.

ఇప్పటివరకు సేకరించిన వివరాలు మండలాలవారీగా

ఎర్రగొండపాలెం వ్యవసాయ శాఖ పరిధిలోని ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు, దోర్నాల మండలాల్లో శనివారం వరకు సేకరించిన నమూన వివరాలు ఇలా ఉన్నాయి.

ఎర్రగొండపాలెం	1169 - 637
త్రిపురాంతకం	1169 - 586
పుల్లలచెరువు	1002 - 530
దోర్నాల	673 - 284

నమూనాలు చేకరించి పరీక్షలకు పంపారు.


వైపాలెంలో రైతులకు మట్టి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మట్టిని సేకరించేదిలా

జిగ్ జాగ్ పద్ధతిలో ఎకరం భూమిలో 8 నుంచి 10 చోట్ల రెండు కేజీల మట్టిని సేకరించాలి. సేకరించిన మట్టిన గడ్డలుగా కాకండా నాలుగైదు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో కొంత మట్టిని తీసుకొని కిలో మట్టిని నమూనాకు పంపాలి. చౌడు, ఆమ్ల నేలల్లో ఇతర ఏ సమస్యాత్మక నేలల్లోనైనా వేర్వేరుగా మట్టి నమూనాలను సేకరించాలి. 15 - 30 సెంటీ మీటర్ల లోతులో మట్టిని సేకరించాలి.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

భూసార పరీక్షలు చేయించుకోవడం రైతులకు చాలా అవసరం. ప్రతి మండలంలోని రైతులు తప్పనిసరిగా వారి భూముల్లో మట్టి నమూనాలను రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సహకరించి పరీక్షలు చేయించుకోవాలి. అలాగే మండలాల వారీగా ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆయా మండలాల ఏవోలు, సిబ్బందికి సూచించారు.

- కే.నీరజ, వ్యవసాయాసంచాలకురాలు


డాక్టర్ మన్నెను సన్మానిస్తున్న కాకతీయ సేవా సంఘం నాయకులు

డాక్టర్ రవీంద్రకు సన్మానం

ఎర్రగొండపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన ఎర్రగొండపాలెం ఏరియాలో పేద ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించిన డాక్టర్ మన్నె రవీంద్రకు వీసా హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డు వచ్చిన సందర్భంగా నియోజకవర్గ కాకతీయ కమ్మ సేవా సంఘం తరపున అభినందిస్తున్నామని అధ్యక్షుడు కూచిపూడి కోటయ్య అన్నారు. ఎర్రగొండపాలెం కాకతీయ సేవా సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన డాక్టర్ రవీంద్ర సన్మాన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ మన్నెకు దుశ్శాలవా, పూలమాలతో సన్మానించారు. ఆయనకు వచ్చిన అవార్డు, ప్రశంసాపత్రం ఫొటో ఫ్రేంను బహూకరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు, కాకతీయ కమ్మ సేవా సంఘం నాయకులు ఏ రామచంద్రరావు, వడ్లమూడి లింగయ్య, కందిమళ్ల శ్రీనివాసరావు, మల్లిపెద్ది రవీంద్రబాబు, మల్లికార్జున, మాదాల శేషయ్య, కాకర్ల కోటయ్య, కోంద్రు ఆంజనేయులు, పూట్ల సీతారామయ్య, సాంబశివరావు, సత్యనారాయణ, కోటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

గాడి తప్పుతున్న పాలన

- కంభం, అర్ధవీడు మండలాల్లో సమయపాలన పాటించని అధికారులు
- కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో ప్రజలకు తెలియని దుస్థితి



కంభం ఎంపీడీవో కార్యాలయం

కంభం, మే 26 (ఆంధ్రజ్యోతి) : కంభం, అర్ధవీడు మండలాల్లోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పాలన గాడి తప్పుతున్నది. అధికారులు, సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉంటారో, ఎప్పుడు ఉండరో అర్థంకాక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా ఉన్న పంచాయతీరాజ్ కార్యాలయంలో అధికారులు ఎవరూ ఉండరు. ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం కల్కిభగవాన్ వీధిలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న విషయం ప్రజలకు ఎవరికీ తెలియదు. ఉద్యానవన, మత్స్యశాఖ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. గోడౌన్ లాంటి ఒకే గదిని రెండు భాగాలు చేసి ఉద్యాన, మత్స్యశాఖ కార్యాలయాలు ఏర్పాటు చేసినా సంబంధిత అధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి. ఒంగోలు ఆక్వా శాఖ అధికారి కంభం మత్స్యశాఖ ఇన్‌చార్జిగా వ్యవహరించడంతో ఆ కార్యాలయానికి ఎప్పుడూ తాళం వేసి ఉంటుంది. వ్యవసాయశాఖ కార్యాలయ పరిస్థితి కూడా అంతే. ఉపఖజానా కార్యాలయ అధికారి ఒంగోలులో ఉంటాడు కావున వారంలో రెండు రోజులు వచ్చి వెలుతుంటాడు. ఉపాధి హామీ ఏపీవో మార్కాపురం, ఎంపీడీవో, ఎమ్మార్వోలు మార్కాపురం నుంచి వస్తుంటారు. ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండరనే విమర్శ ఉన్నది. ఎంపీడీవో కార్యాలయంలోని అధికారులు ప్రభుత్వ పథకాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన సమాచారం అటు ప్రజాప్రతినిధులకు గాని, విలేకరులకు గాని సమాచారం ఇవ్వకపోవడంతో ప్రభుత్వ పథకాల వినియోగం ప్రజలకు చేరడం లేదు. అర్ధవీడు మండలం భౌగోళికంగా రెండు పాయలుగా చీలి ఉండడంతో అర్ధవీడులో ఉండే ప్రభుత్వ కార్యాలయాలకు వెలగలపాయ నుంచి ప్రజలు రావాలంటే 70 కిలో మీటర్ల చుట్టూ తిరిగి రావలసి ఉంటుంది. అంతతా శ్రమపడి కార్యాలయాలకు వస్తే అధికారులు లేకపోవడంతో తీరని ఆవేదనకు గురికావలసి వస్తుంది. ఈ ప్రభుత్వంలోనైనా సంబంధిత ప్రభుత్వ అధికారుల పనితీరు మారుతుందేమోనని ప్రజలు ఆశిస్తున్నారు.

29 నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు

గిద్దలూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం యడవల్లి గ్రామంలోని శ్రీపట్టాభి రామస్వామి దేవాలయంలో ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 29న ప్రత్యేక పూజలు, హోమాలు, 30న కలశ స్థాపన, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, 31న ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శాంతి కల్యాణం, గ్రామోత్సవం, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మార్కాపురం చిన్నవెంకటరెడ్డి కుటుంబీకులు తెలిపారు. అలాగే 31వ తేది యడవల్లి గ్రామంలోని శ్రీఉమామహేశ్వర దేవాలయ ప్రాంగణంలో సైతం ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జరిమానా

మార్కాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి స్థానిక అడిషినల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎమ్.బాలాజీ జరిమానా విధించారు. పట్టణ పరిధిలో గత కొద్దిరోజులుగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై టౌన్ ఎం.సైదుబాబు డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వారితోపాటు ఓవర్ లోడ్‌తో వెళుతున్న ఒక ఆటోను సీజ్‌చేసి కోర్టులో హాజరుపర్చగా డ్రైవర్‌కు న్యాయాధికారి రూ.2,500 జరిమానా విధించారు.

పొగాకు రైతులకు అండగా ఉంటాం

- వైసీపీలా కంపెనీలు పారిపోయేలా చేయం
- వారికి భరోసా ఇస్తాం
- ఎమ్మెల్యే నారాయణరెడ్డి


పొగాకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పొదిలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పొగాకు బోర్డ్‌ను సందర్శించి పొగాకు ధరలు గతంలో ఎలా ఉన్నాయి. పొగాకు నాణ్యత ఎలా ఉందనే విషయాలను అధికారులు, రైతుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులతో మాట్లాడారు. ఆరోజు కంపెనీ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. దీంతో సోమవారం కొనుగోళ్లు ప్రారంభించి నోబిడ్‌లు లేకుండా వేలం నిర్వహించారు. సాధ్యమైనంత వరకు కొనుగోళ్లు చేయించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. లోగ్రేడ్ గతంలో తీసుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎట్టిపరిస్థితితుల్లో లోగ్రేడ్‌ను కొనుగోలు చేయాలని సమస్యలుంటే పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు కందుల కంపెనీలకు సూచించారు. నోబిడ్‌లలో 20 నుంచి 24వ తేదీ వరకు 30శాతం నోబిడ్‌లు ఉంటే ప్రభుత్వ సూచనల మేరకు రంగలోకి దిగి 24 నుంచి 26 వరకు కేవలం 5శాతం నోబిడ్‌లు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. కంపెనీలను సమన్వయం చేసుకుంటూ రోజురోజుకు కొనుగోలు శాతం పెంచుకుంటూ వచ్చామన్నారు. దాన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్షం కడుపుమంటగా ప్రభుత్వంపై విమర్శలు చేస్తోందన్నారు. వైసీపీలా కంపెనీలు పారిపోయే విధంగా మా ప్రభుత్వం భయాందోళనకు గురిచేయదని కందుల స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో కంపెనీలు పరారైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అనంతరం రైతులతో సమావేశమై సూచనలు సలహాలు తీసుకున్నారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ లోగ్రేడ్ కొనుగోలు చేసే విధంగా సహకరిస్తే రైతులు నష్టాల నుంచి బైటపడేందుకు వీలుంటుందన్నారు. రైతులు అధైర్యపడవద్దని మంచి ధర కల్పించి, అన్ని బేళ్లు కొనుగోలు చేసేలా చూస్తామన్నారు. ఆయన వెంట వేలం నిర్వహనాధికారి గిరిరాజ్ కుమార్, రైతు సంఘ నాయకులు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైపాలెంలో దంచి కొట్టిన వాన

- దుక్కి దున్నిన పొలాలకు పదును
- ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులు
- సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూపులు


బోయలపల్లిలో కురిసిన వర్షంతో పదునైన పొలం

ఎర్రగొండపాలెం రూరల్ మే 26 (ఆంధ్రజ్యోతి) : తుపాన్ ప్రభావతంతో వాతావారణంలో ఒక్కసారిగా మార్పు ఏర్పడింది. ఎండల తీవ్రత పెరుగుతున్న క్రమంలో వాతావారణం చల్లబడింది. దీంతో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వేసవిలో దుక్కి దున్ని సిద్ధంగా ఉంచుకున్న పొలాలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని మండలంలోని బోయలపల్లి, గురిజేపల్లి, వాదంపల్లి, గోళ్లవిడిపి, అయ్యంబొట్లపల్లి తదితర గ్రామాల రైతులు చెబుతున్నారు. పదునైన వాన కురవడంతో పంట సాగుకు అనుకూలంగా ఉంటుందని అంటున్నారు. అలాగే ఇటీవల సాగు చేసిన పత్తి పంటకు జీవం పోసినట్లు ఉందని అన్నారు.

78.8 మి.మీ వర్ష పాతం నమోదు

ఆదివారం రాత్రి ఎర్రగొండపాలెం మండలంలో 78.8 మిల్లి మీటర్ల వర్ష పాతం నమోదు అయినట్లు ఇన్‌చార్జి ఏఎస్‌వో ఎం.బ్రహ్మయ్య సోమవారం తెలిపారు. ముఖ్యంగా ఎర్రగొండపాలెం, మురారిపల్లి, చెర్లోతాండ, గంగపాలెం, మురారిపల్లి, అమానిగుడిపాడులతో పాటు ఆ చుట్టూ ప్రక్కల గ్రామాలలో భారి వర్షం పడినట్లు తెలుస్తుంది. అయితే ఇదే వాన మరో రెండు రోజులు పడితే మండలంలోని చెరువులు కళకళాడుతాయని ప్రజలు, రైతులు అంటున్నారు.

సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూపులు

మండలంలోని ఇప్పటికే 70 నుంచి 80 శాతం మంది రైతులు భూములను దుక్కి దున్ని సాగు చేసుకునేందుకు సిద్ధంగా ఉంచారు. అయితే కొంత మంది రైతులు ప్రభుత్వ సబ్సిడీపై వచ్చే విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం త్వరితగతిన సబ్సిడీ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. సబ్సిడీపై వచ్చే విత్తనాల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు వ్యవసాయాధికారులు చెప్తున్నారు. జూన్ మొదటి వారంలో సబ్సిడీపై వచ్చే విత్తనాలు అందుబాటులో ఉంటాయంటున్నారు.

ఆరోగ్య నేరేడు

- ఔషధ గుణాలు అధికం
- రోగాల నివారణకు ఉపయుక్తం


అమ్మకానికి సిద్ధంగా ఉన్న నేరేడు పండ్లు

కంభం, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం మామిడి పండ్లతోపాటు నేరేడు పండ్లు కూడా మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. నేరేడులో పోషకాలతోపాటు ఔషధ గుణాలు మెండుగా ఉంటాయి. ఆయుర్వేద వైద్యంలో నేరేడును అమర సంజీవనిగా పేర్కొంటారు. ఈ పండులో ఏ - సీ విటమిన్లతోపాటు ఆగ్జాలిక్ ఆమ్లం ఉండడంతో ఆరోగ్యాన్ని ఇస్తుంది. నేరేడు తింటే శరీరంలో ఉండే విష పదార్థాలను హరించి వేస్తుంది. అందుకోసం నేరేడును పురాతన వైద్యంలో విస్తృతంగా వాడేవారు. ఈ పండు కడుపులోని నులిపురుగులను చంపివేస్తుంది. నోటి క్యాన్సర్‌కు మంచి మందులా పని చేస్తుంది. షుగర్ వ్యాధిగ్రస్తులకు ఈపండు వరప్రసాదిని. నేరేడు పండ్ల గింజలను కాల్చి పొడి చేసి నీటిలో కలిపి తాగితే చక్కెర శాతం అదుపులో ఉంటుంది. మూత్రాశయ సమస్యలు ఉన్న వారికి ఇది మంచి టానిక్‌లా పని చేస్తుంది. అతిసారను కూడా నివారిస్తుంది. పండుతోపాటు ఆకులు కూడా ఔషధ గుణాలు కలిగినవే. శరీరంలో గాయం అయితే నేరేడు ఆకులు ఉంచి కట్టుకడితే నయం అవుతుంది. నోటిపూత, చిగుళ్ల వ్యాధులు, దంతక్షయం ఉంటే నేరేడు ఆకుల రసాన్ని పుక్కిలిస్తే వాటి నుంచి ఉపశమనం పొందవచ్చన్న నానుడి. ప్రస్తుతం మదనపల్లి, రాజమండ్రి, బెంగళూరు ప్రాంతాల నుంచి హైబ్రిడ్ నేరేడు పండ్లు దిగుమతి అవుతున్నాయి. హైబ్రిడ్ కంటే నాటు పండ్లే శ్రేష్టం. నాటుపండ్లతో పాటు హైబ్రిడ్ నేరేడుకు మంచి గిరాకీ ఉంది. వాటి ధరలు కూడా అధికంగా ఉన్నాయి.


అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్ శిరీష

వేసవి సెలవులను వృథా చేసుకోవద్దు

మార్కాపురం వన్‌టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేయవద్దని సచివాలయ మహిళా పోలీస్ వై.శిరీష అన్నారు. శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులను సోమవారం ఆమె పరిశీలించి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, సైన్సు, వాతావరణం, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. రోజు పేపర్, పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. మూడనమ్మకాలు వదిలి సైన్సుపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పచ్చదనం కోసం మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు వివిధ అంశాలు వివరించారు. అనంతరం చిత్రలేఖనం, చదరంగం తదితర అంశాలపై శిక్షణ పొందారు.

విద్యతోపాటు క్రీడల్లో ముందుండాలి

గిద్దలూరు : చదువుతోపాటు ఆటపాటలు, క్రీడల్లో ముందుండాలని యువ ప్రగతి పథం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ ఫరూక్ అన్నారు. శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చదువుతోపాటు ఖాళీ సమయాలలో లైబ్రరీకి వచ్చి అన్ని రకాల పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆటపాటల్లో కూడా శిక్షణ పొందుతూ నైపుణ్యాన్ని పెంచుకోవాలని, ఆటపాటల ద్వారా శారీరక, మానసిక ఆనందం పొందడమే కాకుండా క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, ఫ్యాకల్టీ బి.రామిరెడ్డి పాల్గొన్నారు.

మోక్షగుండం బీసీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలి

బేస్తవారపేట, మే 26 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలోని మోక్షగుండం బీసీ కాలనీలో సిమెంట్ రోడ్లను నిర్మించి, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇక్కడ జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మోక్షగుండంలో బీసీ కాలనీ ఏర్పాటు 36 ఏళ్లు అయినా నేటికీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సమావేశంలో నాయకులు పుల్లయ్య, కేవీ రమణ, జోసఫ్, రంగారెడ్డి పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు


పట్టుబడిన నిందితుడితో పోలీసులు

కంభం, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన సోమవారం జరిగింది. కంభం ఎస్సై నరసింహారావు కథనం ప్రకారం.. కంభం మండలం జంగంగుంట్ల గ్రామానికి చెందిన మునిగేటి శవరయ్య అలియాస్ సౌరయ్య అనే 65 సంవత్సరాల వృద్ధుడు అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికకు ఈనెల 23న ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడడమేకాక బాలిక ఒక్కతే ఇంట్లో ఉన్న విషయం తెలుసుకొని అత్యాచారయత్నం చేయబోయాడు. బాలిక కేకలు వేయడంతో పారిపోయాడు. పరారీలో ఉన్న సౌరయ్యను సోమవారం కందులాపురం సెంటర్‌లో ఉండగా అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన ఎస్సై నరసింహారావు, సిబ్బందిని ఎస్పీ దామోదర్ అభినందించారు.

ఆహ్లాదం కరువు

- సేదతీరే అవకాశం లేక చిన్నారులు, విశ్రాంత ఉద్యోగుల నిరాశ
- దర్శి రోడ్డులో గత టీడీపీ పాలనలో పార్క్ ప్రారంభం
- నగరపంచాయతీగా మారినా ఉద్యానవనం లేక అవస్థలు

పొదిలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : పొదిలి పేరుకే నగరపంచాయతీ. ఇక్కడ వసతుల కల్పన లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీగా విస్తరించినా ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు ఉద్యానవనాలు (పార్కులు) లేవు. దీంతో ప్రజలు ఆనందానికి కరువవుతున్నారు.

నగరపంచాయతీలో మొత్తం 20 వార్డులు ఉన్నాయి. అందుకు అనుకూలంగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో నగరపంచాయతీ వెనుకబడుతోంది. 38వేలకు పైగా జనాభా ఉన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా ఆహ్లాద ప్రదేశాల్లో గడిపేందుకు అవసరమైన సదుపాయాలు లేవు. అన్ని ప్రాంతాలకు అనువుగా ఉంటుందని అధికారులు, ఉద్యోగులు కూడా పొదిలిలో నివాసం ఉండేందుకు ఇష్టపడతారు. అంతే కాకుండా వ్యాపారులు, ఉద్యోగులు వారాంతంలో కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు ప్రత్యేకమైన ప్రాంతాలు లేక అసహనం వ్యక్తపరుస్తున్నారు. అందరూ ఇళ్లల్లోనే గడపాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల నుంచి వివిధ పనులమీద పొదిలికి వస్తుంటారు. వచ్చిన వారు కొంతసేపు సేద తీరేందుకు వసతులు లేకపోవడంతో ఎక్కడో ఒక చోట చెట్ల కింద సేదతీరుతుంటారు. గుడ్డిలో మెల్లగా జూనియర్ కళాశాల ఆవరణంలో చిన్నారులు, విద్యార్థులు, వాకర్స్ విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగులు సాయంత్రం పూట కొంతసేపు ఆటవిడుపుగా విశ్రాంతి తీసుకుంటుంటారు. అక్కడే కొందరు నడక, మరికొందరు ఆటలు ఆడుతూ సేదతీరుతున్నారు.

ఇదిలావుండగా ప్రభుత్వ స్థలం లేదనే వంకతో అధికారులు, నాయకులు ఉద్యానవనాల ఏర్పాటువైపు దృష్టి సారించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 60శాతం ప్రభుత్వ స్థలాలున్నా వాటిని ఆక్రమించుకుంటుంటే కాసులకు కక్కుర్తిపడి చూస్తూ ఉంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఆక్రమణలపై కన్నేస్తే ఎన్నో స్థలాలు ప్రభుత్వపరమై పార్కులు, ఉద్యానవనాల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని పట్టణ ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పొదిలిలో ప్రజలకు ఉపయోగపడే పార్కులు, ఆహ్లాదాన్ని పంచే వసతులను ఏర్పాటు చేస్తారని ఆశిద్దాం.


జూనియర్ కళాశాల ఆవరణలో సేదతీరుతున్న విశ్రాంత ఉద్యోగులు, ప్రజలు

హుండీ ఆదాయం రూ. 2,38,162

సీఎస్‌పురం(పామూరు) మే 26 (ఆంధ్రజ్యోతి) : మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం హుండీ ఆదాయం రూ, 2,38,162 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,16,718. లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,120. శాశ్వత అన్నదానం, విరాళాలు ద్వారా రూ.59,260, పంచామృతాభిషేకం ద్వారా రూ.22,064, స్వామివారి శ్రీపాద కానుకల ద్వారా రూ.3వేలు ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లకు బ్యాంకర్ల నుంచి కొటేషన్ స్వీకరణ

సీఎస్‌పురం(పామూరు) మే 26 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం మండలంలో పుణ్యక్షేత్రాలైన భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానాలకు సంబంధించి ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించి అత్యధిక వడ్డీ రేటుకు బ్యాంకర్ల నుంచి కొటేషన్లు కోరుతున్నట్లు దేవస్థాన ఈవోలు వంశీకృష్ణరెడ్డి, నరసింహాబాబు, తెలిపారు. జూన్ నెల 2వ తేదీన దరఖాస్తులు స్వీకరిస్తామని, వివరాలకు 8247714889 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలకు నేమ్ బోర్డు బహూకరణ

పామూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించి నేమ్ బోర్డును విద్యా కమిటీ చైర్మన్ గుత్తి కొండయ్య సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా సోమవారం పేయింట్ వేయించిన పాఠశాల నేమ్ బోర్డును హెచ్‌ఎం ఎం రామస్వామికి సమక్ష్యంలోపాఠశాల ప్రధాన గేటు పై ఏర్పాటు చేశారు. దాత ఎస్ఎంసీ ఛైర్మన్ ను పలువురు అభినందించారు.

రామాలయానికి ఉత్సవ రథం బహూకరణ


కొత్త రథం

పామూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేగిచెట్లపల్లి గ్రామంలో శ్రీసీతారామచంద్ర దేవస్థానానికి నూతన ఉత్సవ ఊరేగింపు రథాన్ని గ్రామానికి చెందిన తవ్వా మాల్యాద్రి రెడ్డి, తిరుపతమ్మ, దంపతులు తవ్వా విద్యాసాగర్‌రెడ్డి సంధ్యారెడ్డి దంపతులు, తవ్వా కృష్ణారెడ్డి, సౌమ్యరెడ్డి సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా దేవస్థాన నిర్వాహకులు దాతలను అభినందించారు.

నేటి నుంచి యోగాంధ్ర కార్యక్రమాలు

తాళ్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు మండల స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమాలు ఈ నెల 27నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దారా హనుమంతరావు తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు ఆ మేరకు ఉదయం ఆరు గంటల నుంచి 9 గంటల వరకు మండలప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో జరుగు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఖరీఫ్ సాగుకు అనువైన వంగడాలు ఎంచుకోవాలి

తాళ్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సాగుకు రైతులు అనువైన వరి వంగడాలను ఎంచుకుని విత్తుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్ రావు తెలిపారు. కొర్రపాటివారిపాలెం లోని వరిపంట సాగును ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. రైతాంగం నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. విత్తన కొనుగోలు సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి

పీసీపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను అర్హులైన స్థానిక పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా నాయకులు శేషయ్య తహసీల్దార్‌కు విన్నవించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్ ఉషకు ఆయన విజ్ఞాపన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో మాట్లాడుతూ మండలంలోని చింతగుంపల్లి రెవెన్యూలో కొంతమంది గత అధికారులతో కుమ్మక్కై అడవి, పోరంబోకు భూముల్లో పట్టాదారు పాసుపుస్తకాలు పొంది ఉన్నారన్నారు. వాటిని రద్దుచేసి అర్హులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చినకోటయ్య, చిన గంగయ్య, ఇర్మియా పాల్గొన్నారు.

ఆధిపైత్యం..!



సాధారణంగా ఎవరైనా మా ఊరికి రాష్ట్ర ప్రభుత్వం ఏమీ ఇవ్వలేదు.. ఏమీ చేయలేదని విసుర్లు విసురుతుంటారు. కానీ తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం తీరు అలా లేదు. ఆ గ్రామానికి స్వచ్ఛభారత్ కింద రూ.8 లక్షల విలువైన ట్రాక్టర్‌ను ప్రభుత్వం ఇచ్చింది. దానిని ఈ నెల 4న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి మండల కార్యాలయంలో అందజేశారు. ఆ ఊరిలోని అధికార పార్టీలో నెలకొన్న ఆధిపత్య పోరు వల్ల ఆ ట్రాక్టర్ కు డ్రైవర్ నియామకంలో ఏకాభిప్రాయం రాలేదు. దీంతో ఆ ట్రాక్టర్ ను మండల కార్యాలయంలో అలానే వదిలేశారు. ఇరవై రోజులకు పైగా ట్రాక్టర్ ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్నా ఏ ఒక్కరిలోనూ చలనం లేదు. -తాళ్లూరు, ఆంధ్రజ్యోతి

దర్శి బ్రాంచ్ కాలువకు చేరిన సాగర్ జలాలు

దర్శి, మే 26(ఆంధ్రజ్యోతి) : తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు సోమవారం దర్శి బ్రాంచ్ కాలువకు చేరాయి. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు మంచినీటి చెరువులకు నీరు నింపేందుకు ప్రభుత్వం సాగర్ జలాలను విడుదల చేసింది. సాగర్ డ్యాం నుంచి కుడి కాలువకు 5598 క్యూసెక్కుల నీరు విడుదల చేయగా ఆ నీరు బుగ్గవాగుకు చేరుతోంది. బుగ్గవాగు నుంచి సాగర్ ప్రధాన కాలువకు 5100 క్యూసెక్కుల నీరు ప్రధాన కాలువకు విడుదల చేస్తున్నారు. జిల్లా సరిహద్దులోని 85/3 మైలుకు చేరే


డీబీసీలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎన్ఎస్‌పీ డీఈ అక్బర్‌బాష

సరికి 1793 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. అక్కడ నుంచి దర్శి బ్రాంచ్ కాలువకు ప్రస్తుతం 803 క్యూసెక్కుల నీరు పంపిణీ అవుతోంది. ఒంగోలు బ్రాంచ్ కాలువకు మంగళవారం నీరు చేరుతోంది. ఈ సందర్భంగా డీఈ అక్బర్‌బాష మాట్లాడుతూ ప్రస్తుతం మంచినీటి చెరువులకు నీరు నింపేందుకు మాత్రమే నీరు విడుదల చేశామన్నారు. రైతులు తొందరపడి మేజర్లు ఎత్తవద్దని సూచించారు. ఎక్కడైనా ట్యాంపరింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం విడుదల అవుతున్న నీటితో రామతీర్థం జలాశయంతో పాటు మంచినీటి చెరువులకు నీరు నింపుతామన్నారు.

మహానాడు విజయవంతానికి సమాయత్తం కావాలి

నియోజకవర్గ జనసమీకరణ పరిశీలకులు దేవదత్

కనిగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరిగే టీడీపీ మహానాడు విజయవంతానికి కార్యకర్తలు, నాయకులు సమాయత్తం కావాలని రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్, నియోజకవర్గ జనసమీకరణ పరిశీలకులు శావల దేవదత్ చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం టీడీపీ నాయకులతో మహానాడు జనసమీకరణపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు మహాపండుగ వంటిదన్నారు. మూడు రోజులపాటు


మాట్లాడుతున్న శావల దేవదత్

కడపలో జరగనున్న కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి పల్లె నుంచి శ్రేణులు తరలిరావాలని కోరారు. మహానాడుకు తరలి వెళ్ళే అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణ సౌకర్యాలు, భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆరు మండల పార్టీ అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), పువ్వాడి వెంకటేశ్వర్లు, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, బొమ్మనబోయిన వెంగయ్య, వేమూరి రామయ్య, కనిగిరి మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులు రెడ్డి, కనిగిరి క్లస్టర్ ఇంచార్జి నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసు లురెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, జంషీర్, ఎస్సీ సెల్ నాయకులు బుల్లా బాలబాబు, బ్రహ్మంగౌడ్, అడుసుమిల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

పామూరులో...

పామూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలో నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న టీడీపీ మహానాడు వేడుకలను టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక మండల పార్టీ కార్యాలయంలో అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి అధ్యక్షతన సోమవారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాల మేరకు మండలంల నుంచి వెయ్యి మందికి తగ్గకుండా జనసమీకరణ చేపట్టాలన్నారు. సమావేశంలో ఉప్పలపాటి హరిబాబు, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, నొస్సం నాగేంద్రచారి, మెంటా నాగేంద్రచారి, షేక్ ఖాజారహంతుల్లా, ఎం రమణయ్య, కౌలూరి రహంతుల్లా, కొండా నరసింహులు, తోట రవికుమార్ పాల్గొన్నారు.

మహానాడుకు తరలివెళ్లిన నాయకులు

దర్శి, మే 26 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న మహానాడుకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులతో పాటు నాయకులు సోమవారం రాత్రి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం నుండి వచ్చిన వారికి అక్కడ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారివెంట ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పుల్లచెరువు చిన్నా, దర్శి మండల రూరల్ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కె వెలుగొండారెడ్డి, నాయకులు కిలారి కొండయ్య, బడేసాహెబ్, వేణుబాబు, తెల్లయ్య తరలివెళ్లారు.


తరలివెళ్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, లలిత్‌సాగర్, నాయకులు

హోరాహోరీగా రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

దొనకొండ, మే 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలివెలపల్లిలో వీరాంజనేయస్వామి 33వ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. పోటీలకు ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన నాలుగు జతల ఎడ్లు పాల్గొన్నాయి. బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామికి చెందిన ఎడ్లజత 3316 అడుగులు లాగి మొదటిస్థానంలో, బేస్తవారిపేట మండలం, జెజె అగ్రహారానికి చెందిన


పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

లక్కు నాగశివశంకర్ ఎడ్లజత 3068 అడుగులు లాగి రెండవ స్థానంలో, బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లజత 1786.5 అడుగులు లాగి మూడవస్థానంలో, దొనకొండ మండలం, కలివెలపల్లి గ్రామానికి చెందిన చిరుగురి ఇర్మియా ఎడ్లజత 550 అడుగులు లాగి నాల్గో స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్లజతలకు బహుమతులు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.5వేలు నగదును అందజేశారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గెలుపోటములను హుందాగా స్వీకరించాలి

ముండ్లమూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు గెలుపోటములను సమాన దృష్టితో చూడాలని ముండ్లమూరు మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు చెప్పారు. ముండ్లమూరులో ఈ నెల 5వ తేదీ నుంచి ముండ్లమూరు మెగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. మొత్తం 60 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో మెగా ఫ్రెండ్‌షిప్ ముండ్లమూరు ప్రథమ స్థానం సాధించింది. ద్వితీయ స్థానం తాళ్లూరు మండలం రమణాలవారిపాలెం కైవసంచేసుకుంది. తృతీయ స్థానం మండలంలోని నాయుడుపాలెం జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతిని గ్రామ టీడీపీ యువ నాయకులు బేతపూడి రామారావు, రెండో బహుమతి మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు, తృతీయ బహుమతి ఆనెం నాగేశ్వరరావు రూ.10వేలను అందజేశారు. మేదరమట్ల వీర నారాయణ, అచ్చయ్య, కొండలరావు, నాగేశ్వరరావు, పేరారెడ్డి, నంబూరి డానేలు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న మేదరమెట్ల వెంకటరావు, బేతపూడి రామారావు

ఖరీఫ్ జోష్

సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు

సాగర్ నీరొచ్చేలోపు ఒక పంటను తీసేలా పనులు

దర్శి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ముందస్తు వర్షాలు రైతుల్లో జోష్‌ను నింపాయి. సాగుకు ఉత్సాహంగా సన్నద్ధం చేస్తున్నాయి. దర్శి ప్రాంతంలో కొన్ని రోజులుగా మంచి వర్షాలు కురుస్తుండడంతో భూములు బాగా పదునెక్కాయి. వర్షం విరామ సమయంలో కొంత మంది రైతులు భూములు దున్ని చదును చేశారు. ఇంకొందరు ప్రస్తుతం దుక్కులు దున్నేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అదునుకంటే ముందుగానే రావటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ ఆయకట్టు భూముల్లో ప్రస్తుతం పెసర, మినుము, కంది, సజ్జ పైర్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మెట్ట ప్రాంతాల్లోని భూముల్లో కంది, సజ్జ, పైర్లు వేయబోతున్నారు. సాగర్ ఆయకట్టు భూముల్లో ప్రస్తుతం కంది, పెసర తదితర పైర్లు సాగుచేస్తే వరి సాగుకు నీరు విడుదల అయ్యేలోపు ఈ పంట చేతికందుతుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది అన్నీ రకాలుగా అనుకూలంగా ఉండటంతో రైతులు ఆనందంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు వెంటనే అందించాలని కోరుతున్నారు.

దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసిన భూములు


బాధితులకు ఆసరా.. సీఎం రిలీఫ్ ఫండ్

పామూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడే బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక ఆసరా లాంటిదని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలోని రావిగుంట పల్లిలో ఇద్దరికి, దాదిరెడ్డి పల్లి, పామూరు పట్టణంలో ఒక్కరి వంతున మంజూరైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను సోమవారం అందచేశారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

పామూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 5 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ మదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని దేవస్థాన ఈవో నరసింహబాబు కోరారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో ఉభయదాతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ 17 ఏళ్ల అనంతరం జరగనున్న స్వామి బ్రహ్మోత్సవాలను ఈసారి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కేవీ రమణయ్య, బీ జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్ ఎస్వీ నారాయణ, పీ రఘునాథరెడ్డిపాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఇరువురికి గాయాలు

అవీఇవీ


ఘటనాస్థలంలో ఆటో, ద్విచక్రవాహనం

పీసీపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న ఆటో బైకు ఢీకొన్న ప్రమాదంలో ఇరువురు గాయపడిన సంఘటన మండలంలోని పంచలింగాలకొండ సమీపంలో సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు బేస్తవారిపేట మండలం సోమవరపుపేటకు చెందిన సీహెచ్ బ్రహ్మయ్య తన ద్విచక్రవాహనంపై పెదఅలవలపాడు మీదుగా నెల్లూరు వెళ్తున్నాడు. పెదఅలవపాడు గ్రామానికి చెందిన కుందుర్తి రాము తన కుటుంబసభ్యులతో కలిసి తన ఆటోలో వలేటివారిపాలెం నుంచి పెదఅలవలపాడు వస్తున్నాడు. పాలేటిగంగ సమీపంలోని పంచలింగాలకొండ వద్దకు వచ్చేసరికి ఎదురెదురుగా వస్తున్న ఆటో బైకు రెండూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న బ్రహ్మయ్యతోపాటు ఆటోలో ఉన్న రాము, పెదవెంకటేశ్వర్లు, విజయలకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి వచ్చిన 108 బృందం ప్రథమ చికిత్స చేసిన అనంతరం వారిని కనిగిరిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి తీవ్రగాయాలు

దొనకొండ, మే 26(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాకొట్టడంతో ముగ్గురు తీవ్రగాయాలపాలైన సంఘటన మండలంలోని యర్రబాలెం సమీపంలో సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు... పల్నాడు జిల్లా కారంపూడి గ్రామానికి చెందిన కొందరు, కనిగిరి సమీపంలోని పోలేరమ్మ దేవాలయం వద్ద మొక్కులు తీర్చుకునేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో యర్రబాలెం సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న నాగార్జున, నాగరాజు, సిద్ధేశ్వరరావులు తీవ్ర గాయాలపాలవ్వగా మిగిలిన వారు స్వల్పగాయాలకు గురయ్యారు. సమీపంలో ఉన్న స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకొని బోల్తాకొట్టిన ఆటోను లేపి 108 వాహనం అందుబాటులో లేకపోవటంతో అదే ఆటోలో కురిచేడు వైద్యశాలకు పంపినట్లు సమాచారం.

నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు


పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

పామూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు యోగా కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బ్రహ్మయ్య, తహసీల్దార్ బీవీ రమణారావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 200 మందికి విడతల వారిగా ఒంగోలు నుంచి వచ్చే ట్రైనర్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జూన్ నెల 21న జరుగు అంతర్జాతీయ యోగా కార్యక్రమాల్లో మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, ఆశా, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ డిప్యూటి ఎంపీడీవో జీవీ అరవిందారెడ్డి, పీఆర్ ఏఈ షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పొగాకు నిల్వలను నమోదు చేయించుకోవాలి


పొగాకు నిల్వలను పరిశీలిస్తున్న ఏవో

దొనకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): నిల్వ ఉన్న నల్లబర్లీ పొగాకు వివరాలను రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని రైతుల వద్ద ఉన్న పొగాకు నిల్వలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్లచెరువు గ్రామంలో వ్యవసాయ సహాయకులు యాప్‌లో పొగాకు నిల్వలను చేస్తున్న నమోదును తనిఖీ చేశారు. ఇప్పటి వరకు 87 మంది రైతులు 1700 క్వింటాళ్ల పొగాకు వివరాలను నమోదు చేసినట్లు సిబ్బంది వివరించారు.

నామమాత్రంగా వెలిగండ్ల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు గుంటక తిరుపతి రెడ్డి

వెలిగండ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మూడునెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా ముగిసింది. సోమవారం వెలిగండ్ల ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ ఎర్రబోయిన భారతి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశానికి కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మాకొట్టారు. గైర్హాజరైనా అధికారులకు నోటీసులు అందిస్తామని ఎంపీడీవో చెప్పారు. జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, నీరు, విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో అంగన్వాడీ కేంద్రాలు అధ్వానంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ బాషా, వైస్ ఎంపీపీ తాతపూడి మేరిపుష్ప, ఏవో రంగాకృష్ణ పాల్గొన్నారు.

మారెళ్లలో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమం


వ్యర్థాలను తొలగిస్తున్న పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ

ముండ్లమూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ల గ్రామంలో రహదారుల పక్కన పారబోసిన వ్యర్థ పదార్థాలను గ్రామ సర్పంచ్ గోపబోయిన వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ దగ్గరుండి సోమవారం ఎక్స్‌కవేటర్లతో వ్యర్థాలను ట్రాక్టర్‌కు ఎక్కించి డంపింగ్ యార్డులో పడవేశారు. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రహదారుల పక్కన పడవేసిన వ్యర్థాలు కుళ్లి గ్రామస్థులు దుర్వాసనతో అల్లాడిపోయారు.

నూతన కార్యవర్గానికి సన్మానం

పామూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : పామూరు టీడీపీ నూతన కార్యవర్గాన్ని ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ సోమవారం అభినందించారు. స్థానిక ఆకుపాటి క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎస్డీ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్ నాగేంద్రాచారి, తెలుగ యువత అధ్యక్షులు మెంటా నరసింహారావు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత (అంచనా)

27-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	27
తెనాలి	35	27
నరసరావుపేట	35	26
బాపట్ల	34	27
రెంటచింతల	36	27
చీరాల	34	27



మేజర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

కాసుల పారుదల కనిపించడం లేదు!

- నిలిచిపోయిన కాల్వల మరమ్మతులు, పూడిక తీత
- ప్రభుత్వం నుంచి విడుదల కాని నిధులు
- రూ 19.28 కోట్ల ప్రతిపాదనలపై మీనమేషాలు
- బిల్లులపై నమ్మకం ఉంటే పనులు చేయండి
- చేతులెత్తేసిన జలవనరుల శాఖ అధికారులు
- పనులకు ధైర్యం చేయని సాగునీటి సంఘాలు



షట్టరు లేని తూము

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలోని మేజర్లు.. మైనర్లు.. సబ్ మైనర్ కాలువలు అధ్వానంగా మారాయి. కాల్వల చివరి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగు నీటి పారుదల పరిస్థితులు కనిపించడం లేదు. విత్తు సమయం అసన్నమయ్యే లోగా కాల్వల్లో పూడికతీతతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అత్యవసర మరమ్మతులు చేపట్టి పూర్తి చేయాల్సి ఉంది. ఈ దిశగా జలవనరుల శాఖ ఇంకా స్పందించడం లేదు. ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో కాల్వల పనుల నిర్వహణ సందిగ్ధంలో పడింది. ఈ ఏడాదికి మరమ్మతులు లేనట్లేనా అన్న



రూపురేఖలు కోల్పోయిన మైనర్ కాలువ

ప్రశ్న అన్నదాతల నుంచి వ్యక్తమవుతోంది. నీటి సంఘాలు పనులు చేయవచ్చని ప్రభుత్వం సూచించినా.. నిర్వాహకులు ముందుకు రావడం లేదు. నిధులు మంజూరు చేయకుండా పనులు చేపట్టలేమని వారు చెబుతున్నారు.

వర్షాలతో పనులకు ఆటంకం

రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. రెండు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో కాలువల పనుల నిర్వహణకు ఆటంకం ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికే పనుల విషయంలో కాలయాపన జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు చేపట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నదాతల మొర ఆలకించే పరిస్థితి కానరావడం లేదు.

ప్రతిపాదనలకు స్పందన లేదు

కాలువల్లో చేపట్టాల్సిన అత్యవసర పనులు గుర్తించిన జలవనరుల శాఖ ప్రభుత్వానికి రూ 19.28 కోట్లు వ్యయం అంచనాలతో ప్రతి పాదనలు పంపింది. నిధుల విడుదలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో పనుల నిర్వహణ సందిగ్ధంలో పడింది. వైసీపీ పాలనలో ఐదేళ్ల కాల్వల మరమ్మతులు చేపట్టక వాటిని అధ్వానంగా మార్చేసింది. కాల్వల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటు కాడ, రబ్బరు మొక్కలు నిండా అల్లుకుపోయాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు కూడా దెబ్బతిన్నాయి, కాల్వలకు నీరు విడుదల చేసేందుకు షట్టర్లు లేవు. దీంతో సాగు నీరు వృథాగా వాగుల్లో పారుతోంది.

355 పనులు.. రూ.19.28 కోట్లు

వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి, మాచర్ల డివిజన్‌లలో అత్యవసర మరమ్మతులకు సంబంధించి 355 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ 19.28 కోట్లు వ్యయం అంచనా వేశారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని కాలువల మర్మతులకు సంబంధించి 38 పనులు గుర్తించారు. ఈ పనుల నిర్వహణకు రూ.2.17 కోట్లు వ్యయం అంచనా రూపొందించారు. గురజాల నియోజకవర్గం పరిధిలో 31 పనులకు రూ.2.17 కోట్లు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 46 పనులకు రూ.2.34 కోట్లు, పెదకూరపాడు నియోజకవర్గంలో 36 పనులకు రూ.2.16 కోట్లు, తాడికొండ నియోజకవర్గంలో 34 పనులకు రూ.2 కోట్లు, నరసరావుపేట నియోజకవర్గంలో 51 పనులకు రూ.2.30 కోట్లు, చిలకలూరిపేట నియోజకవర్గంలో 29 పనులకు రూ.1.45 కోట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 25 పనులకు రూ.1.49 కోట్లు, వినుకొండ నియోజకవర్గం పరిధిలో 54 పనులకు రూ.2.70 కోట్లు, దర్శి నియోజకవర్గంలో 5 పనులకు రూ.20.48 లక్షలు, అద్దంకి నియోజకవర్గం పరిధిలో 6 పనులకు రూ.26.56 లక్షలుగా అంచనా రూపొందించారు. ఈ మేరకు జలవనరుల శాఖ నిధులు విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

చేతులెత్తేసిన జలవనరుల శాఖ

కాలువల మరమ్మతులు నెలాఖరులోగా పూర్తి చేయాలి.. యుద్ధ ప్రాతిపదికన కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటన చేశారు. ఇది ఆచరణలో సాధ్యం కాదనే చెప్పాలి. మరమ్మతులకు నిధులు విడుదల చేయకుండా నెలాఖరుకు పనులు ఎలా పూర్తవుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. 'పనులు చేశాక డబ్బు వస్తుందనే ధైర్యం ఉంటే కాల్వల పనులు చేయండి. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే వరకు ఒక వేళ పనులు చేసినా.. మేము నమోదు చేసేది ఏమీ లేదు.' అని జలవనరుల శాఖ అధికారులు సాగునీటి సంఘాలకు చెప్పి.. చేతులెత్తేశారు. దీంతో పనులు చేసేందుకు నీటి సంఘాలు జంకుతున్నాయి.

వర్రీ తీరింది!

- రబీ ధాన్యం సేకరణలో లక్ష్యం పూర్తి
- అదనంగా 25 వేల టన్నులకు ప్రభుత్వం అనుమతి
- రైతుల ఖాతాల్లో రూ.62 కోట్లు జమ
- కొత్తగొల్లపాలెం రైతులకూ త్వరలోనే ధాన్యం డబ్బులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో 92 వేల టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించిన ప్రభుత్వం.. రబీలోనూ రైతులకు మేలు చేసేలా అడుగులేస్తోంది. రబీ సీజన్‌కు గాను తొలుత 30 వేల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అనుమతిచ్చింది. దీనికి సంబంధించి లేట్ ఖరీఫ్ దిగుబడులే దాదాపు 42 వేల మెట్రిక్ టన్నులు ఉన్నాయని, సేకరణ లక్ష్యం పెంచాలనే డిమాండ్లు రైతుల నుంచి పెద్ద ఎత్తున వచ్చాయి. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా అధికారులు కూడా అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 30 వేల టన్నుల ధాన్యం సేకరణ.. ఈ నెల 21 కే పూర్తయింది. అదే సమయానికి అదనంగా మరో 25 వేల టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రైతాంగం ఊపిరి పీల్చుకుంది. ఇప్పటికి మొత్తం 33,250 టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయీస్ విభాగం సేకరించింది. 5,330 మంది రైతుల ఖాతాల్లో రూ.62 కోట్లను ప్రభుత్వం జమ చేసింది.



ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న నగరం మండల పరిధిలోని రైతులు (ఫైల్ ఫొటో)

కొత్తగొల్లపాలెం రైతులకు న్యాయం చేసేందుకు..

ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరపడానికి ప్రభుత్వం జీపీఎస్ నిబంధనను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. ఈ నిబంధన పాటించకుండా దాదాపు 2,800 బస్తాల ధాన్యాన్ని కొత్తగొల్లపాలెం రైతులు ఈ ఏడాది మార్చి 30న హడావిడిగా నేరుగా మిల్లులకు తరలించారు. దీంతో వారికి డబ్బులు జమ కావడం విషయంలో జాప్యం జరుగుతూ వస్తోంది. దీనిని ప్రత్యేక అంశంగా భావించి ఆ బస్తాల ధాన్యం వరకు జీపీఎస్‌కు మినహాయింపు ఇవ్వాలని సివిల్ సప్లయీస్ విభాగం ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపింది. దీనిపై సానుకూల స్పందన వచ్చిందని త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఆచరణ ఉండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూటమిలోకి.. కోవర్టులు

- మాచర్ల ఉదంతంతో బట్టబయలు
- పలు నియోజకవర్గాల్లో అదే పరిస్థితి
- నాడు వైసీపీలో ఉండి అరాచకాలు
- రక్షణ కోసం నేడు కూటమి పార్టీల్లోకి చొరబాటు

పల్నాడు ఎస్పీ తీరుపై టీడీపీ ఎమ్మెల్యేల ఆగ్రహం





తలలు పట్టుకుంటున్న టీడీపీ శ్రేణులు

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్న ఆనందం చాలా వరకూ పార్టీ శ్రేణుల్లో కనిపించడం లేదు. కూటమి పార్టీలలో వైసీపీ కోవర్టుల సంఖ్య ఎక్కువ ఉండడమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఈ కోవర్టుల వ్యవహారం పార్టీకి అంకితమై పనిచేసిన కార్యకర్తలను అభద్రతా భావానికి గురిచేస్తోంది. అధికారంలో ఉన్న టీడీపీని బలహీన పరిచేందుకు వైసీపీ ఆడుతున్న కొత్త నాటకం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నప్పటికీ ఏమి చేయలేని దుస్థితి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మెజారిటీ నియోజకవర్గాల్లో కనిపిస్తుంది. మాచర్ల నియోజకవర్గంలో తాజాగా జరిగిన హత్యలు.. ఆ తరువాత వెలుగులోకి వచ్చిన ఇద్దరూ ఒక పార్టీ వాళ్లే అన్న ప్రచారం కలవరాన్ని పుట్టిస్తున్నది. వాస్తవానికి హత్యకు గురయినవారు ఎప్పటి నుంచో తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. హత్యకు పాల్పడిన వారు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి అనుచరులుగా ముద్ర పడిన వాళ్లే. వ్యూహాత్మకంగా వాళ్లను టీడీపీలోకి పంపి హత్యలకు ఒడిగట్టినట్లు తెలుస్తోంది. టీడీపీ బలంగా ఉన్న ప్రతి గ్రామంలోనూ ఇదే రీతిలో వైసీపీ సానుభూతి పరులను పార్టీ మారినట్లు నాటకం ఆడించి, బలహీన పర్చే కుట్రలకు తెరలేచినట్లు తెలుస్తోంది. ఒక వేళ నేరుగా టీడీపీలో చేరే అవకాశం లేకపోతే కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన, బీజేపీల్లోకి వైసీపీ కీలక నేతలు చేరి పోతున్నారు. ఇటువంటి చేరికలవల్ల టీడీపీకి సంస్థాగతంగా కోలుకోలేని దెబ్బ తగులుతోంది. ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న పల్నాడులో కొత్త చేరికలు వల్ల టీడీపీకి పెను ప్రమాదం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

అప్పుడూ వాళ్లే.. ఇప్పుడూ వాళ్లే..

గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి గుంటూరులో కొందరు నేతలు భయంకరమైన అవినీతి, అక్రమాలకు పాల్పడినవారే. అదేమని ప్రశ్నించిన టీడీపీ నేతలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. ఇప్పుడు అదే నేతలు కూటమి ప్రభుత్వంలోని పార్టీలలో చేరటం టీడీపీ శ్రేణులను కలవరపరుస్తోంది. అప్పట్లో భయంకరంగా దాడులు చేసి అక్రమంగా కేసులు బనాయించిన వారు ఇప్పుడు ఏమి తెలియనట్లుగా 'సేఫ్ జోన్'లో ఉండటం ఇబ్బందులు పడిన కార్యకర్తలను మానసిక వ్యధకు గురిచేస్తోంది. ఉదాహరణకు పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేయని దుర్మార్గం లేదు. ప్రభుత్వాధికారాన్ని అడ్డం పెట్టుకొని మట్టిని ఇష్టానుసారంగా తవ్వి కోట్లాది రూపాయలు సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా ఎన్నికల సమయంలో అన్ని ఆరోపణలు ఉన్న ఆయనకు అసలు టిక్కెట్ ఇవ్వరని చాలామంది భావించారు. వైసీపీ అధినాయకత్వం అవేవీ పట్టించుకోకుండా ఎంపీ సీటును కట్టబెట్టింది. ఎన్నికల్లో రోశయ్య ఘోరంగా ఓడిపోయారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మీద విచారణ జరుగుతుందని అందరూ అనుకున్నారు. ఆలోపే కిలారు రోశయ్య కూటమి ప్రభుత్వంలోని భాగస్వామి అయిన జనసేనలో చేరారు. ఇప్పుడు అన్ని కేసులలో తప్పించుకొని దర్జాగా తిరుగుతున్నారు. తాజాగా జరిగిన మినీ మహానాడులో కూడా పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర అదే అంశంపై ఆందోళన వ్యక్తంచేశారు. వాస్తవానికి కూటమి పార్టీలలో ఎవరినైనా చేర్చు కొనే విషయంలో మిగిలిన పార్టీల అభిప్రాయంతో పనిలేకుండానే జరుగుతుండటం ఇబ్బందికరంగా మారింది.

పల్నాడు ఎస్పీ తీరుపై విమర్శలు

పల్నాడు జిల్లాలోని ఎస్పీ తీరు చూస్తుంటే అధికారంలో ఏ పార్టీ ఉందో అర్థం కాకుండా ఉంది. ఎస్పీ పూర్తిగా వైసీపీకి కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ వాళ్లకు ఏదైనా జరిగిందంటే తీవ్రంగా స్పందిస్తున్న ఎస్పీ, టీడీపీ వాళ్ళ విషయంలో మాత్రం పట్టీ పట్టనట్టు ఉంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా జంట హత్యలు జరిగిన వెంటనే టీడీపీలో అంతర్గత విభేదాలవల్లే హత్యలు అని పలనాడు ఎస్పీ ప్రకటించడం కూడా వివాదాస్పదమైంది. ఆ తరువాత జరిపిన దర్యాప్తులో పిన్నెల్లి సోదరుల పాత్ర కూడా ఉందని నిర్ధారణ కావటం వారిపై కూడా కేసు నమోదు అయింది. దీంతో ఎస్పీ తొలుత చేసిన ప్రకటన వైసీపీ నేతలకు అస్త్రంగా మారింది. ఈ నేపథ్యంలో ఎస్పీ పై పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.

పసుపు దండు కదిలింది!

- నేటి నుంచి మూడు రోజుల పాటు కడప వేదికగా టీడీపీ మహానాడు
- జిల్లా నుంచి భారీగా తరలివెళ్తున్న టీడీపీ శ్రేణులు
- మంత్రులు అనగాని, గొట్టిపాటికి కీలక బాధ్యతలు
- దాదాపు 500కార్లు, స్వచ్ఛందంగా వెళ్లే వారూ భారీగానే
- రూ.10లక్షల విరాళం అందజేసిన ఎమ్మెల్యే వేగేశన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): మహానాడు నిర్వహణ తెలుగుదేశం పార్టీ శ్రేణులకు ఓ పండుగ లాంటిది. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా సంబరంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గతేడాది ఇదే సమయానికి అంతటా ఎన్నికల వాతావరణం ఉండడంతో మహానాడు నిర్వహించడం వీలుపడలేదు. భారీ మెజారిటీతో ప్రజలు అధికారాన్ని ఇవ్వడంతో టీడీపీ నేతలు, శ్రేణుల కష్టానికి ఫలితం దక్కినట్లయింది. గతంలో ఎప్పుడూ కూడా కడప జిల్లాలో టీడీపీ మహానాడు నిర్వహించలేదు. కానీ ఈసారి కడప అందుకు వేదికగా కావడం ప్రత్యేకమైతే.. ఈ దఫా అధికారం చేపట్టాక తొలిసారి జరుగుతున్న సంబరం కావడంతో జిల్లా నుంచి అధిక సంఖ్యలో పసుపు సైన్యం కడప బాట పట్టింది. ఈ పండుగ నిర్వహణలో భాగంగా జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఇద్దరు మంత్రులతో పాటు ఎమ్మెల్యేలకు కీలక బాధ్యతలను పార్టీ అధిష్ఠానం అప్పగించింది. పార్టీలో శాశ్వత సభ్యత్వం కలిగిన వారికి మహానాడుకు సంబంధించి ప్రత్యేక ఆహ్వానాలు అందాయి.



మహానాడు కోసం రూ.10 లక్షల నగదు చెక్కును రెవెన్యూ మంత్రి అనగానికి అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

మండలాల వారీగా జనసమీకరణ

టీడీపీ మహానాడుకు తరలివెళ్లే విధంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి మండలాల వారీగా నేతలకు బాధ్యతలను ఎమ్మెల్యేలు అప్పగించారు. ఒక్కో నియోజకవర్గం నుంచి దాదాపుగా 80 కార్లలో కార్యకర్తలు తరలివెళ్లే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇవన్నీ కూడా మంగళవారం ఉదయమే బయల్దేరనున్నాయి. దాదాపు 5,500 మంది వరకు జిల్లా నుంచి మహానాడుకు తరలివెళ్లనున్నట్లు తెలుస్తోంది.

కీలక బాధ్యతలు.. కడపలోనే మకాం

జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులకు మహానాడు నిర్వహణలో కీలక బాధ్యతలను అప్పగించడంతో మూడు రోజుల నుంచి అక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను అత్యంత ప్రాధాన్యం కలిగిన ఆర్థిక వనరుల కమిటీకి కన్వీనర్‌గా పార్టీ అధిష్ఠానం నియమించింది. భోజనాల ఏర్పాట్ల కమిటీకి కో-కన్వీనర్, సమన్వయ కమిటీలో సభ్యుడిగా మంత్రి అనగానికి చోటు దక్కింది. మరో మంత్రి గొట్టిపాటికి జనసమీకరణ కమిటీ కన్వీనర్ పగ్గాలు అప్పగించి.. ఎమ్మెల్యే ఏలూరిని అందులో సభ్యుడిగా చేర్చింది. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబుకు తీర్మానాల కమిటీలో సభ్యుడిగా చోటు దక్కింది. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మహానాడుకు రూ.10 లక్షల విరాళాన్ని రెవెన్యూ మంత్రి అనగానికి సోమవారం అందజేశారు.

జిల్లాలో దాదాపు 1,500 మందిపై అక్రమ కేసులు

గడచిన ఐదేళ్లలో 1,500 మంది టీడీపీ శ్రేణులపై తప్పుడు కేసులను అప్పటి ప్రభుత్వం బనాయించింది. అప్పటి ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు అరెస్ట్ సమయంలో వివిధ రూపాలలో శాంతియుత నిరసన తెలిపిన వారిపైనే దాదాపు 850 వరకు కేసులు నమోదు చేశారు. ఇవన్నీ మహానాడులో చర్చకు రానున్నాయి.

కంపెనీలు వేగంగా బ్లాక్ బర్లీని కొనుగోలు చేసేలా చూడాలి : కలెక్టర్

బాపట్ల,మే 26 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ బర్లీ పొగాకు పంటను కంపెనీలు వేగంగా కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటమురళి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పొగాకు కొనుగోలులో సమస్యల పరిష్కారం కోసం పర్చూరులో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతుల కోసం టోల్‌ఫ్రీ నంబరు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. పొగాకు కొనుగోళ్ల తర్వాత పంట నిల్వకు అవసరమైన గోదాములు గుర్తించి, సిద్ధంగా ఉంచాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా మంగళవారం భావపురి మందిరం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై జిల్లా స్థాయి కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ వెంకటమురళి

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

- రూ. 10 వేల జరిమానా

వేటపాలెం(చీరాల), మే 26 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో దోషికి న్యాయాధికారి శైలజ 20 ఏళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే 2023వ సంవత్సరం నవంబరులో వేటపాలెం మండలంలోని గ్రామానికి చెందిన 65 ఏళ్ల వృద్ధుడు తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు సిమెంట్ రాళ్ల కార్ఖానా నిర్వహిస్తున్నాడు. సమీపంలోని బాలిక(13)ను పలుమార్లు మాయమాటలు చెప్పి అదే కార్ఖానా వద్ద అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవ్వరికి చెప్పొద్దని బెదిరించాడు. కొంతకాలం తరువాత ఆ బాలిక కడుపు నొప్పితో వేదన పడింది. దీంతో తల్లిదండ్రులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షలు నిర్వహించగా వైద్యులు బాలిక గర్భిణీగా తెలిపారు. వెంటనే ఆరాతీసిన తల్లిదండ్రులు వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన అప్పటి డీఎస్పీ ప్రసాదరావు, ఎస్సై సురేష్ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అలాగే సాక్షులను హాజరుపరచి రిమాండ్‌కు వెళ్లేలా చేశారు. అనంతరం ఒంగోలు కోర్టులో విచారణకు రాగా ప్రస్తుత డీఎస్పీ ఎండి మొయిన్, సీఐ శేషగిరిరావు, ఎస్సై వెంకటే శ్వర్లు, కోర్టు లైజనింగ్ ఏఎస్సై స్వామి, కోర్టు కానిస్టేబుల్ కరిముల్లా సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి శ్రీనివాసరావు వాదోపవాదనలు వినిపించారు. దీంతో నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు న్యాయాధికారి కే శైలజ దోషికి 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో పాటు, రూ. 10 వేల జరిమానా విధించారు. బాలికకు ప్రభుత్వం తరఫున రూ.6 లక్షలు నగదు పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. దీంతో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



దోషిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

కొత్తయాప్‌లో రిజిస్టర్ చేసుకోండి



రాచపూడిలో నల్లబర్లీ పొగాకును పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

మేదరమెట్ల, మే 26(ఆంధ్రజ్యోతి): బర్లీ రైతులు తమ పేర్లను ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన బ్లాక్‌బర్లీ యూజర్ మాన్యువల్ యాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండలంలోని రాచపూడిలో నల్లబర్లీ, పొగాకు మండెలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తమ శాఖ సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ కొత్త యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కొత్తగా డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌లల్లో బర్లి రైతుల పేర్లను నమోదు చేయాలన్నారు. రైతులు కూడా తమ పేర్లు యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకొనేది లేదు

● కార్మిక సంఘాల నాయకుల హెచ్చరిక

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉ క్కును ప్రైవేటీకరిస్తే ఊరుకోనేది లేదని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్‌టీయూ న్యూ జిల్లా కార్యదర్శి ఎంఎస్‌సాయిలు అధ్యక్షత వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంయుక్తకిసాన్ మోర్చా జిల్లాకన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. ఒక పక్క విశాఖ ఉక్కును ప్రైవేటీకరించమని చెప్తూనే మరో వైపు దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జి ల్లా కార్యదర్శి కే ఆంజనేయులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ను రక్షించుకొనేందుకు వ్యవసాయకార్మికులందరూ ఏకమై పోరాడతామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డెహనుమారెడ్డి మాట్లాడుతూ కేంద్రానికి మద్దతు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కే వీరారెడ్డి, ఎస్‌డీ సర్దార్, శ్రీరామ్ శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, బీవీ రావు, సీహెచ్ రాంబాబు, పేరయ్య, దామా శ్రీనివాసులు, జి. రమేష్ తదితరులు ఉన్నారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు.



నరసింహస్వామి దేవాలయం

దేవుడికి దిక్కేది?

● 161 ఎకరాల మాన్యం ఉన్నా ఆలనాపాలన కరువు
● శిథిలావస్థలో నరసింహస్వామి ఆలయం
● పట్టించుకోని దేవదాయ అధికారులు
● పునర్నిర్మాణం చేయాలంటున్న భక్తులు

పెద్దదోర్నాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : కోట్లాది రూపాయలు విలువ చేసే మాన్యాలున్నా.. ఆలనాపాలనా లేక చరిత్రాత్మక దేవాలయం శిథిలావస్థకు చేరింది. ఆలయ కమిటీ ఉందో లేదో కూడా తెలియని పరిస్థితి. పాలకుల అలసత్వం, అధికారుల స్వార్థంతో దశాబ్దాల నాటి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం కునారిల్లుతోంది. దోర్నాలలో క్రీస్తు పూర్వం జయమేజయరాజు శ్రీ లక్ష్మీ నరసింహుని ప్రతిష్ఠించారని, అంత ప్రాముఖ్యత గల దేవాలయాన్ని పట్టించుకోకపోవడం వల్ల శిథిలావస్థకు చేరుకుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయం అభివృద్ధికి దూపదీప నైవేద్యాన్ని అందించేందుకు 18 గ్రామాలకు చెందిన భక్తులు 161.40 ఎకరాల మాన్యాన్ని కేటాయించారు. ప్రస్తుతం ఈ భూముల విలువ రూ.15 కోట్లకుపైనే పలుకుతుందని భక్తుల నమ్మకం. కొన్ని భూములు ఆక్రమణకు గురి కాగా మరికొన్ని భూములను వేలం పాటలు నిర్వహించి వచ్చిన సొమ్మును ఎండోమెంటు అధికారులు బ్యాంకుల్లో జమ చేస్తున్నారే గానీ దేవాలయం అభివృద్ధికి ఎటువంటి కృషి చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

● **దేవాలయ మాన్యాలివీ...**

దోర్నాల రేగడిచేను 214 సర్వే నెంబరులో 7 ఎకరాలు, 113 సర్వే నెంబరులో 13.41, జమ్మిదోర్నాలలో 622/1 సర్వే నెంబరులో 12.48 ఎకరాలు, 284/2లో 12.21, అయినముక్కలలో రెవెన్యూలోని కడపరాజుపల్లెలో 238/1 సర్వే నెంబరులో 7.90 ఎకరాలు, గణపతిరస్తా వద్ద 3 సర్వే నెంబరులో 6.71 ఎకరాల భూములున్నాయి. ఈ క్రమంలో అర్చకులకు 21 ఎకరాలు కేటాయించగా 113 సర్వే నెంబరులోని 13.41 ఎకరాలు ప్రభుత్వం రూ.8లక్షలకు కొనుగోలు చేసి పేదలకు ఇంటి స్థలాలుగా అందజేసింది. కానీ దేవాలయానికి ఎటువంటి స్థలాన్నీ కేటాయించలేదు. తిమ్మాపురంలో 268/1 సర్వే నెంబరులో 5.06 ఎకరాలు, పెద్దబొమ్మలాపురంలో 465 సర్వే నెంబరులో 7.64 ఎకరాలు, 470 సర్వే నెంబరులో 7.78 ఎకరాలు, చిన్నగుడిపాడులో 36/2 సర్వే నెంబరులో 12.64 ఎకరాలు, చట్టుతాండాలో 485 సర్వే నెంబరులో 7 ఎకరాలు, చిలకచెర్ల 442 సర్వే నెంబరులో 5.21, రామచంద్రకోట 29/1 సర్వే నెంబరులో 9 ఎకరాలు, చిన్నదోర్నాల 26/2 సర్వే నెంబరులో 10.35 ఎకరాలు, సానికవరం రామాయలపాలెం 450 సర్వే నెంబరులో 12.69 ఎకరాలు, తమ్మడపల్లి 715 సర్వే నెంబరులో 5.50, లింగంవానిపల్లె 49 సర్వే నెంబరులో 8.45 ఎకరాలు ఆలయ మాన్యాలుగా ఉన్నాయి. ప్రతి ఏటా వేలం వేస్తూ వచ్చిన డబ్బును బ్యాంకుల్లో వేస్తున్నారో లేక ఏమైపోతున్నాయో కానీ ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా నరసింహ స్వామి జయంతి ఉత్సవాలకు కూడా పీసమెత్తు ఖర్చు చేయడంలేదు. కేవలం భక్తుల తోడ్పాటుతో నామమాత్రంగా ఉత్సవం నిర్వహిస్తున్నారు.

● **శిథిలావస్థలో దేవాలయం**

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పలుమార్లు దొంగలు పడి వెండి కిరీటాలు, హుండీలోని సొమ్ము, విలువైన వస్తువులు అపహరించుకుపోయాక ఇనుప గేట్లు ఏర్పాటు చేశారు. అలా కాకుండా కోట్ల విలువైన ఆస్తులున్నా నరసింహ స్వామి దేవాలయం పునర్నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి మూడు బృందాలు

ఒంగోలు విద్య, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన ప్రాథమిక సీనియారిటి జాబితాలపై అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారానికి మూడు బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 2వతేదీ వరకు ఈ బృందాలు పనిచేస్తాయి. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు పరిశీలించి పరిష్కరించేందుకు చీరాల ఉప విద్యాధికారి బి.గంగాధరరావు, తెల్లబాడు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఎం.రమేష్, స్కూల్ అసిస్టెంట్ల అభ్యంతరాల పరిశీలనకు పెట్లూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కేసీహెచ్.చలపతి, రుద్రవరం హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, చినగంజాం ఎంఈవో బి.అజయ్‌ను నియమించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ల అభ్యంతరాల పరిశీలన బాధ్యతను తాళ్లూరు హెచ్‌ఎం శ్రీనివాసరావు, తెల్లబాడు హెచ్‌ఎం ఎం.రమేష్, మల్లంపేట హెచ్‌ఎం పీఏ.పద్మనాభరావు, సుంకేశుల హెచ్‌ఎం కృష్ణప్రసాద్‌కు అప్పగించారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన సెక్షన్ అసిస్టెంట్లు వీరికి సహాయకారులుగా వ్యవహరిస్తారు. ఈ మూడు టీంలు బదిలీల ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తారు. ఎడిట్ ఆప్షన్‌ను ఉపయోగించి పాయింట్లలో మార్పులు,చేర్పులు చేస్తారు.

40 అభ్యంతరాలు పరిష్కారం

గ్రేడ్-2 హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాపై 40 మంది హెచ్‌ఎంలు అభ్యంతరాలు తెలిపారు. అవన్నీ ప్రధానంగా పాయింట్లు కలవకపోవడంపైనే వచ్చాయి. వాటిని పరిశీలించి పరిష్కరించి ఆ మేరకు ఆన్‌లైన్‌లో మార్పులు చేశారు. హెచ్‌ఎం బదిలీలకు మొత్తం 111 ఖాళీలను ప్రకటించారు. అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం ముగియడంతో బదిలీల తుది సీనియారిటీ జాబితా సోమవారం రాత్రికి విడుదలవుతుందని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. పీఎస్ హెచ్‌ఎంలు 149 మంది, 149 మంది ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు బదిలీకి దరఖాస్తులు చేశారు. వీటి మొదటిదశ పరిశీలన సంబంధిత ఎంఈవో స్థాయిలో జరిగింది. రెండవ దశ స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూల్‌లో సోమవారం ముగిసింది.

సమయపాలన తప్పనిసరి

ఎక్సైజ్ కమిషనర్ విజయ

పర్చూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల వద్ద సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎక్సైజ్‌శాఖ కమిషనర్ కే.విజయ ఆదేశించారు. సోమవారం పర్చూరులోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని ఆమె సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణాల వద్ద ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సిబ్బంది దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 10 గంటల వరకు మాత్రమే దుకాణాలు తెరిచి ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు భుజంగరావు, శ్రీధర్‌బాబు, పాల్గొన్నారు.



రోడ్డుపై బోల్తా కొట్టిన కారు

కారును ఢీకొన్న లారీ..

● నలుగురికి స్వల్పగాయాలు ● కలికివాయి ఫ్లైవోవర్‌పై ప్రమాదం

సింగరాయకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ముందువెళ్తున్న కారును వెనుకవైపు వస్తున్న లారీ ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కలికివాయి ఫ్లైవోవర్‌పై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిలకలూరిపేటకు చెందిన నిమ్మల చంద్రశేఖరరావు-రాజేశ్వరి, కాకుమాని అంజన్‌రావు-చిలకమ్మ దంపతులు తిరుమలకు వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. కారు కలికివాయి ఫ్లైవోవర్ వద్దకు చేరుకునే సరికి వెనుక వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై కారు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఉన్న వారిని బయటకు తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఎస్సై బి.మహేంద్ర హైవే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేయించి క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అనంతరం క్రేన్ సహాయంలో కారును పక్కను తొలగించారు.

టీడీపీ అభివృద్ధికి కృషి

దివంగత నేత వీరయ్య చౌదరి సతీమణి సుచిత్ర

నాగులుప్పలపాడు, మే 26 : తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని దివంగత నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి సతీమణి, చవటపాలెం ఎంపీటీసీ ముప్పవరపు సుచిత్ర వెల్లడించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలతో ఆమె రాజకీయ ప్రవేశ పరిచయ కార్యక్రమం, మహానాడు కార్యక్రమానికి పార్టీ శ్రేణుల సమాయత్త సమావేశం అమ్మనబ్రోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు తేళ్ల మనోజ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుచిత్ర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అంటే వీరయ్య చౌదరికి ఎనలేని అభిమానమన్నారు. ఆశయాలను కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు.

మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 21న నారాయణ్‌పూర్‌లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, మిలటరీ పత్రిక ఎడిటర్ నాగేశ్వరరావు, తెలంగాణాకు చెందిన విజయలక్ష్మి, సంగీత, రాకేష్‌తో పాటు మరో 22 మంది మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా మార్చురీలో పెట్టడం దుర్మార్గంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయిస్తే అక్కడి పోలీసులను కలవాలని చెప్పినా ఇంత వరకు మృతదేహాలను అప్పగించలేదన్నారు. ఇప్పటికైనా మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వీరాంజనేయులు, వెంకటేష్, క్రాంతి, చావలి సుధాకర్, జార్జి, పద్మ, రాజా, లింగయ్య, దాసరి సుందరం తదితరులు ఉన్నారు.



సాగు చేసిన పందిరి దొండ



పందిరి దొండ.. రైతుకు అండ!

పెద్ద దోర్నాల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఏటా సాగు చేసే వాణిజ్య పంటలు పత్తి, మిరపలో అపార నష్టాల్ని చవిచూస్తున్న రైతులకు పందిరి దొండసాగు అండగా నిలుస్తోంది. ఒకసారి మొక్కలు నాటితే మూడేండ్ల వరకు ఫలాసాయాన్నిచ్చే దొండ సాగు పట్ల రైతులు మొగ్గు చూపుతున్నారు. తెగుళ్ల బెడద పెద్దగా ఉండదు. కొద్దిపాటి నీటి తడులతో నికరాదాయం లభిస్తుంది. కూలీలు కూడా పెద్దగా అవసరం లేకుండానే ఇంటి మనుషులతోనే దిగుబడులు తీయొచ్చు. సీజను బట్టి ధరలు పెరుగుదలతో అధిక లాభాలు కూడా వస్తున్నాయి. దీంతో పందిరి దొండసాగు చిన్న సన్న కారు రైతులకు ఎంతగానో ఊతమిస్తోంది. పైగా ప్రభుత్వం కూడా ప్రోత్సాహాన్నిస్తూ పందిరి ఏర్పాటుకు రాయితీ కల్పిస్తోంది.

● **పందిరితో అధిక దిగుబడులు**

దొండ సాగుకు పందిరి ఖర్చు రైతులకు కొంచెం కష్టమనిపించినా మున్ముందు సమస్య కాదు. ఎకరంలో దొండ సాగుకు పందిరి వేసేందుకు రూ.4 లక్షలు ఖర్చవుతాయి. ప్రభుత్వం లక్ష రూపాయలు రాయితీ కల్పిస్తోంది. శాశ్వత పందిరి ఏర్పాటు వల్ల పంటలో తెగుళ్ల బెడద ఉండదు. తద్వారా దిగుబడులు పెరుగుతాయి. ఒకసారి నాటితే మూడేళ్ల పంట దిగుబడి తీయొచ్చు. వారం వారం కోతలు అందుబాటులోకి వస్తాయి. కోతకు ఎకరానికి 5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. సీజను బట్టి కిలో రూ.15లు నుంచి రూ.25 వరకు మార్కెట్టులో కొనుగోలు చేసినా మంచి ఆదాయం లభిస్తుందని చెబుతున్నారు. చిన్న, సన్నకారు రైతులకు మరింత ఉపయుక్తంగా ఉంటుందని దొండసాగు రైతులు చెబుతున్నారు. మండలంలోని చిన్నదోర్నాల, తిమ్మాపురం, రామచంద్రకోట, బొమ్మలాపురం గ్రామాల్లో కొందరు రైతులు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.

హెల్త్ అసిస్టెంట్ల బదిలీలు

● చీరాలకు చెందిన యూనియన్ నేత వైద్యశాఖ కార్యాలయం వద్ద హడావుడి
● మరో యూనియన్ నేతలు అడ్డుకొనే ప్రయత్నం

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో సీజనల్ వ్యాధులు అధికంగా ఉండే ప్రాంతాలకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద హెల్త్ అసిస్టెంట్లకు సోమవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల ప్రక్రియ జరిగింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మెరిట్ జాబితా ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి వర్క్‌అడ్జెస్ట్‌మెంట్ బదిలీలు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 97 మంది హెల్త్‌అసిస్టెంట్లకు ఈ ప్రక్రియను చేపట్టారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి క్లారిఫికేషన్ తీసుకున్న అనంతరం ఈ బదిలీలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో డెంగ్యూ, మలేరియా తదితర రకాల వ్యాధులు అధికంగా నమోదయ్యే ప్రాంతాలకు హెల్త్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్ల బదిలీలపై చీరాలకు చెందిన ఒక యూనియన్ నాయకుడు వైద్యశాఖ కార్యాలయం వద్ద హడాహుడి చేశారు. తానే ఈ బదిలీల ప్రక్రియను చేపడుతున్నట్లుగా వ్యవహరించడంతో బాపట్ల ప్రాంతానికి చెందిన మరో యూనియన్ నాయకుడు అడ్డుకొనే ప్రయత్నం చేశారు. దీంతో కొంత సేపు వైద్యశాఖ కార్యాలయం వద్ద గందరగోళం నెలకొంది. చీరాలకు చెందిన యూనియన్ నాయకుడికి వైద్యశాఖ కార్యాలయంలో ఏం పని ఉందని ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. ఆ యూనియన్ నాయకుడి హడాహుడితో హెల్త్ అసిస్టెంట్లకు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో వెంటనే ప్రభుత్వ గుర్తింపు పొందిన బాపట్లకు చెందిన మరో యూనియన్ నాయకుడు అక్కడకు వచ్చి ఈ విషయాన్ని ప్రశ్నించారు. దీంతో అక్కడ కొంత సేపు రగడ నెలకొంది.

విద్యతోనే విలువలు

● ప్రతిభచాటిన పద్మశాలీ విద్యార్థులకు సత్కారం



ప్రతిభచాటిన విద్యార్థులతో ముఖ్యఅతిథులు, ప్రతినిధులు

చీమకుర్తి,మే26(ఆంధ్రజ్యోతి): విద్య నేర్చుకోవటం ద్వారా విలువను పొందవచ్చని ఆర్‌డబ్ల్యూడీ జిల్లా పీడీ పి.విద్యాసాగర్ తెలిపారు.పట్టణంలోని భద్రావతి సమేత భావనారుషి కల్యాణమండపంలో గత విద్యాసంవత్సరంలో పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభచాటిన పద్మశాలీ విద్యార్థులకు పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభాపురస్కారాలు అందచేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాసాగర్ మాట్లాడుతూ చదువుతో జీవన స్థితిగతులు మారిపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నతవిద్యను అభ్యసించి అత్యున్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రముఖ న్యూరాలజిస్టు వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులు టెక్నాలజీతో కూడిన విద్యను అభ్యసించాలని కోరారు. గుండె వైద్యనిపుణుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యవిద్యను అభ్యసించటానికి విద్యార్థులు ఆసక్తి చూపాలన్నారు. అనంతరం విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా ప్రతిభాపురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి,కౌన్సిలర్ సోమా శేషాద్రి, సంఘనాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో 18.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 18.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. యర్రగొండపాలెంలో అత్యధికంగా 78.8 మి.మీ. వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా తాళ్ళూరు మండలంలో 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. పుల్లలచెరువు 76.0, తర్లుబాడు 46.4, దర్శి 41.4, త్రిపురాంతకం 38.4, పెద్దారవీడు 36.4, కంభం 35.4, వెలిగండ్ల 33.0, దొనకొండ 29.8, కురిచేడు 29.0, మార్కాపురం 27.2, అర్ధవీడు 20.4, బేస్తవారపేట 20.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. గిద్దలూరు 18.2, జరుగుమల్లి 17.8, హనుమంతునిపాడు 17.6, దర్శాల 16.4, పీసీపల్లి 16.2, పొన్నలూరు 15.2, రాచర్ల 15.0, సీఎస్‌పురం 14.2, కొమరోలు 12.4, టంగుటూరు 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

బకాయిలు చెల్లించకపోతే సంక్షోభంలోకి విద్యా సంస్థలు

● ప్రైవేటు పాఠశాలల సంఘాల సమాఖ్య

అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద చేరిన విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. లేనిపక్షంలో విద్యా సంస్థలు సంక్షోభంలో పడతాయని సోమవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేసింది. విద్యా హక్కు చట్టం కింద ప్రభుత్వం ప్రతిపాదించిన ఫీజులపై అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలిపింది. ప్రైవేటు పాఠశాలలకు ఇబ్బందికరంగా ఫీజులు నిర్ణయించడం సరికాదని పేర్కొంది. ఫీజులపై అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ప్రతిపాదిత ఫీజులను తాము ఆమోదించలేదని తెలిపింది.

చిత్తడి నేల అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యుల నియామకం

అమరావతి, మే26(ఆంధ్రజ్యోతి): స్టేట్ వెట్‌ల్యాండ్(చిత్తడి నేలల) అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులిచ్చింది. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన చిత్తడి నేలల జీవావరణ శాస్త్ర నిపుణుడు ఆర్ రామ సుబ్రహ్మణియన్, ప్రపంచవ్యాప్త ప్రకృతి నిధి(డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా) రాష్ట్ర సంచాలకుడు ఫరీదా తంపాల్, కోయంబత్తూర్‌లోని తడిభూముల జీవావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోల్డిన్ క్వాడ్రోస్, డెహ్రాడూన్‌లోని అంతరించిపోతున్న జాతుల నిర్వహణ సంస్థ శాస్త్రవేత్త ఆర్ సురేష్‌కుమార్ సభ్యులుగా నియమితులయ్యారు. కాగా రాష్ట్రంలో చిత్తడి నేలల పరిరక్షణ కోసం స్టీరింగ్ కమిటీ స్థానంలో ఈ అథారిటీ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటైంది. అధికారులతో పాటు మూడేళ్ల పదవీ కాలానికి అధికారేతర సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేసింది.

అవీ..ఇవీ..

దేవాలయం ముందు మందు పార్టీలు

● ఆందోళనలో ముక్తేశ్వరం ప్రజలు



శివాలయం ముందువైపు పడవేసిన ఖాళీ మందు సీసాలు

బల్లికురవ. మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలోని శివాలయం ముందుభాగంలో జోరుగా మందు పార్టీలు జరుగుతున్నాయి. రాత్రులు కొందరు యువకులు మద్యం సీసాలు తెచ్చుకొని అక్కడే పార్టీలు చేసుకొని సీసాలను అక్కడే పడేసి వెళుతున్నారు. దేవాలయానికి వెళ్లే భక్తులు ఈ సీసాలు చూసి ఆందోళన చెందుతున్నారు. ముక్తేశ్వరం గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన ముక్తి లింగేశ్వర స్వామి దేవాలయం కొండపై భాగంలో ఉంది. ఈ దేవాలయానికి వెళ్లే రోడ్డు ముందుభాగంలోని చెట్ల కింద కొందరు రాత్రి పగలు అనే తేడా లేకుండా మద్యం సేవిస్తున్నారు. దేవాలయానికి వచ్చే భక్తులు వీటిని చూసి అవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరువ్యక్తులు ఇక్కడే జూదం ఆడుతున్నారని వాపోతున్నారు. అధికారులు, గ్రామ పెద్దలు వెంటనే శివాలయం వద్ద మద్యం సేవించకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అమృతలూరుకు ఎస్సై బదిలీ

అద్దంకి, మే26(ఆంధ్రజ్యోతి):అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రవితేజ అమృతలూరుకు బదిలీ అయ్యారు. సీఐ స్టేషన్‌హౌస్ ఆఫీసర్‌గా ఉన్న అద్దంకి పోలీస్ స్టేషన్‌లో సీఐతో పాటు రెండు ఎస్సై పోస్టులు ఉన్నాయి. నెల రోజుల క్రితం ఖాదర్‌బాషా బదిలీ కాగా, సోమవారం రవితేజ బదిలీ అయ్యారు. రెండు పోస్టులలో ఇంకా ఎవరిని నియమించలేదని సిఐ సుబ్బరాజు తెలిపారు.

రోడ్డుపై ఇద్దరు యువకుల ఘర్షణ

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

● ఇద్దరూ పాత కేసుల్లో నిందితులే



ఘర్షణ సమయంలో గుమికూడిన స్థానికులు

అద్దంకి, మే26(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో పొట్టిశ్రీరాములు బొమ్మ వద్ద సోమవారం ఇద్దరు యువకులు ఘర్షణ పడ్డారు. వీరిలో ఒకరికి గాయాలయ్యాయి. దీంతో స్థానికులు పెద్ద ఎత్తున గుమికూడారు. దీంతో సమీపంలో విధులలో ఉన్న పోలీసులు అక్కడకు చేరుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరు యువకులు ముండ్లమూరు మండలానికి చెందిన వారే కాగా పలు పాత కేసులలో వీరు నిందితులుగా ఉన్నట్లు విచారణలో తేలింది.. వీరిలో ఒకరు వినుకొండ ప్రాంతంలో బ్రేక్‌ప్రాంతంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌ను అని బెదిరించిన వ్యక్తి గా గుర్తించారు. మరొకరు పాత కేసులలో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నట్లు తేలింది.

వాహనచోదకులకు హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్ లేనివారికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు

అద్దంకి, మే 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా దరించాలని సీఐ సుబ్బరాజు అన్నారు. అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో సోమవారం సాయంత్రం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు సీఐ సుబ్బరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. తమ వెంట ఖచ్చితంగా వాహనాలకు సంబంధించి పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు.

పొగాకు కొనుగోళ్లపై కదలిక

● ప్రభుత్వ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం ● పర్చూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు ఆదేశం



పర్చూరు ప్రాంతంలో అమ్మకానికి సిద్ధం చేస్తున్న పొగాకు మండెలు

పర్చూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కొనుగోళ్లు జరగక నైరాశ్యంలో ఉన్న పొగాకు రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్ర వ్యవసాయశాఖ, విద్యుత్‌శాఖ మంత్రులు స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నేతృత్వంలో ఇటు పొగాకు కంపెనీల ప్రతినిధులు, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ధరను కూడా నిర్ణయించి సమగ్ర సమాచారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుపోయారు. దీంతో త్వరిత గతిన కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. దీంతో పొగాకు కొనుగోళ్లపై అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే వ్యవసాయశాఖ అధ్వర్యంలో రైతుల వద్ద ఉన్న నిల్వల వివరాలను ప్రభుత్వ ప్రత్యేక యాప్‌లో రైతు భరోసా కేంద్రం సిబ్బంది నమోదు చేశారు. బ్లాక్ బర్లీ పొగాకు పంట వేగవంతంగా కంపెనీలు కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. కొనుగోళ్ల విషయంలో వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్‌ను భాగస్వామ్యం చేస్తూ కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. కంపెనీలు కొనుగోలు చేసిన పొగాకును నిల్వచేసుకునే విధంగా గోడౌన్‌లను కూడా గుర్తించాలన్నారు. దీనికి సంబంధించి పర్చూరులో కంట్రోల్ రూంతోపాటు, టోల్‌ఫ్రీ నెంబరు రైతుల కొరకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పొగాకు కొనుగోళ్లపై ప్రజా ప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు.

వాగులో గల్లంతైన యువకుడు మృతి

మృతదేహాన్ని వెలికి తీసిన ఫైర్ సిబ్బంది



వాగువద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న ప్రజలు ,మోహన్ కుమార్ (ఫైల్)

పర్చూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) మే 26: పర్చూరువాగులో యువకులు గల్లంతైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఇంటి నుంచి బహిర్భూమికి అని వెళ్లిన యువకుడు జొన్నలగడ్డ మోహన్ కుమార్(24) ఎంత సేపటికీ రాకపోవడంతో కుంటుంబ సభ్యులు బంధువులు వాగువద్దకు వెళ్లి వెతికారు. గట్టుమీద బైక్ ఉండటంతో వాగులో పడి ఉంటాడని ఆందోళనకు గురయ్యారు. యువకుడు వాగులో గల్లంతయ్యాడన్న వార్త తెలుసుకున్న కాలనీ వాసులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని తండ్రి నాగరాజు నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై మాల్యాద్రి, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని చీరాల ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వాగును గాలింపు చర్య లు చేపట్టారు. ఎట్టకేలకు మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. అనంతరం పోస్టు మార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పర్చూరు ఇందిరా కాలనీలో విషాదం

వాగులో ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు మృతి చెందడంతో పర్చూరు అంబేద్కర్ కాలనీలో విషాదఛాయలు అలము కున్నాయి. చేతికి అందివచ్చిన కుమారుడు ఇలా అకాల మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

కుటుంబ కష్టాలు వర్ణనాతీతం..

తండ్రి నాగరాజు ఆర్టీసీ గ్యారేజీలు ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం ఇతను పక్షవాతంతో బాధపడుతున్నాడు. రెండో కుమారుడు ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలువిరిగి మంచంలో ఉన్నాడు. అనారోగ్య సమస్యలు, కుటుంబ కష్టాలు వేదిస్తున్న తరుణంలో ఇలా చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడం కుటుంబాన్ని తీవ్ర దుఖంలోనికి నెట్టింది.

మహానాడుకు బయలుదేరిన తెలుగు తమ్ముళ్లు



మహానాడుకు బయలుదేరిన టీడీపీ నేతలు

పంగులూరు, మే 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల నేతలు కడపలో మూడు రోజుల పాటు జరిగే మహానాడుకు సోమవారం బయలు దేరారు. ఆరు ప్రత్యేక వాహనాలలో వివిధ గ్రామాలకు చెందిన 30 మంది టీడీపీ నాయకులు కార్యకర్తలు మహానాడుకు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవు డు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బా రావు, గుదిబండ్ల ఆదిరెడ్డి, జాగర్ల మూడి సుబ్బారావు, రేణంగివరం మాజీ సర్పంచ్ అవ్వృత పూడి ఏసోబు, బీసీ నాయకులు దాసరి హనుమంతరావుతో పాటు మరికొందరు నాయకులు, కార్యకర్తలు మహానాడుకు తరలివెళ్లారు.

బుచ్చయ్యను కలిసిన టీడీపీ నేతలు



బుచ్చయ్య చౌదరితో మాట్లాడుతున్న స్థానికులు

అద్దంకి,మే26(ఆంధ్రజ్యోతి): కడపలో మూడు రోజుల పాటు జరిగే మహానాడు కార్యక్రమాలలో పాల్గొనేందుకు వెళ్తూ సోమవారం మధ్యహ్నం రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అద్దంకి సమీపంలోని ఓ వెంచర్ వద్ద గెస్ట్ హౌస్ వద్ద ఆగారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని వెళ్లారు. ఈ సందర్భంగా అద్దంకి పట్టణానికి చెందిన వీవీఆర్ ట్రావెల్స్ అధినేత విప్పర్ల పవన్, వీరాంజనేయులు, గూడూరి రామకృష్ణ తదితరులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ని కలిశారు.

ఇంకొల్లు- పర్చూరు రోడ్డుకు నిధుల మంజూరుపై హర్షం

పూసపాడు వంతెన వద్ద కూటమి నాయకుల చిత్రాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

ఇంకొల్లు, మే 26,(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంత రావు అన్నారు. ఇంకొల్లు- పర్చూరు ఆర్‌అండ్ బీ రహదారికి టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.24 కోట్లు మంజూరు చేయడంపై ఇంకొల్లు,పర్చూరు,కారంచేడు మండలాల టీడీపీ నాయకులు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకొల్లు మండల పరిధిలోని పాత మద్రాసు రహదారిలో వంకాయలపాడు సమీపంలోని అడ్డరోడ్డు వంతెన వద్ద సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి జనార్ధన్‌రెడ్డి, పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి నేటి వరకు ఈ రహదారిలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఈ రహదారిలో ప్రజలు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లి రోడ్డు నిర్మాణానికి నిధుల కేటాయింపుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. గ్రామాలలో ప్రజలు సైతం నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంకొల్లు, పర్చూరు, కారంచేడు మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, షేక్ షంషుద్దీన్, శ్రీహరి, కరి శ్రీనివాసరావు, బేతపూడి శ్రీనివాసరావు, పేర్ని బాపయ్య, కరణం రమేష్, శ్రీనివాస రావు, మీరావలి, రమాదేవి, నాగేంద్రమ్మ, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వెంకట సుబ్బారావుకు విశ్వకర్మ లెజెండ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటసుబ్బారావు

పంగులూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన సిద్ధు వెంకట సుబ్బారావుకు విశ్వకర్మ లెజెండ్ అవార్డు లభించింది. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 9వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. వ్యవస్థాపక చైర్మన్ విశ్వనాధుల పుష్పగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బారావు తెలంగాణ క్రైంబ్రాంచ్ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్ ద్వారా ఈ అవార్డు అందుకున్నారు. సామాజికపరంగా, వృత్తిపరంగా వెంకట సుబ్బారావు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందచేశారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన వారి పిల్లల సర్వే

ఇంకొల్లు,మే 26,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రత్యేక అవసరాలున్న 0-18 వయస్సులోపు వివిధ రకాల మానసిక, శారీరక దివ్యాంగులైన వారి పిల్లలను గుర్తించడం కోసం సర్వే నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. వారి వివరాలు సర్వేలో తెలియజేసి నమోదు చేయించుకొని ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలను సంక్షేమాలను పొందాలని సూచించారు. తద్వారా వారి దైనందన జీవితానికి అభివృద్ధి తోడ్పాటు అందించడం జరుగుతుందన్నారు. అటువంటి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పేర్లను వారి తల్లిదండ్రులు తప్పక నమోదు చేయించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9014961616 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛగ్రామాలకు ప్రజలు సహకరించాలి

బల్లికురవ. మే 26 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ గ్రామాలగా అభివృద్ధి చేసుకొనేందుకు ప్రజలు సహకరించాలని పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో కార్యాలయ ఏవో పాండురంగస్వామి కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు గ్రామ సభలను అధికారులు నిర్వహిస్తున్నారు. వల్లాపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఏవో మాట్లాడారు. రోడ్ల వెంబడి ఎరువుల దిబ్బలు, చెత్తవేయకుండా ప్రజలు సరైన అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. పంచాయతీల తరపున అన్ని గ్రామాలలో పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. రాజీకయ పార్టీల నేతలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనీల్, టీడీపీ నాయకులు చింతల రామారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక జాగ్రత్తలు

కొత్తపేట (చీరాల), మే 26 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ విధుల్లో పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో రాజేష్ ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ కార్యాలయంలో మండలస్థాయి గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా పారిశుధ్యంపై గ్రామ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్‌కు అస్వస్థత

బల్లికురవ, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ కె.బ్రహ్మయ్య సోమవారం విధులలో ఉండగా ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే గమనించిన తోటి ఉద్యోగులు బల్లికురవ 108లో చికిత్స కోసం చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన బ్రహ్మయ్య వల్లాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు.

వీవోఏగా నియమించి న్యాయం చేయండి



తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందజేస్తున్న మీరాబీ

పంగులూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరు - 2 గ్రామైక్య సంఘం వీవోఏగా పనిచేస్తున్న తనను నిబంధనలకు విరుద్ధంగా తొలగించారని, తనను తిరిగి నియమించాలని, నందవరపు మీరాబీ స్థానిక తహసీల్దార్ సింగారావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. 13 ఏళ్లగా వీవోఏగా డ్వాక్రా సంఘ మహిళలకు సేవలందించానని తెలిపారు. తాను ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని తహసీల్దార్‌కు వివరించారు. మీరాబి వెంట స్థానిక సీపీఎం నేత వినోద్‌బాబు, పలువురు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గాలులకు విరిగిన విద్యుత్‌స్తంభం



హోటల్ పంచపై పడిన విద్యుత్ స్తంభం

కొత్తపాలెం (చీరాల), మే 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో ఆదివారం అర్ధరాత్రి కుండపోత వర్షం కురిసింది. ఈక్రమంలో పలు చోట్ల వృక్షాలు నేలవాలాయి. అంతేకాకుండా కొత్తపాలెం పంచాయతీ పరిధిలో ఓ టిఫిన్ హోటల్‌పై విద్యుత్‌స్తంభం విరిగి పడింది. దీంతో హోటల్ రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే ఆ సమయంలో ఎవ్వరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. వర్షానికి రహదారులు జలమయయ్యాయి. అయితే ఈక్రమంలో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయి.

ఒరిగిన విద్యుత్ స్తంభం పునరుద్ధరణ



సరిచేసిన విద్యుత్ స్తంభం

పంగులూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జనకవరం, కొండమూరు గ్రామాల మధ్య ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ అధికారులు పునరుద్ధరించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఒరిగిన విద్యుత్ స్తంభం' శీర్షికన ప్రచురితమైన వార్తకు విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. ఏఈ అనిల్‌కుమార్ తన సిబ్బందితో జనకవరం, కొండమూరు గ్రామాల మధ్య చెట్లపై ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. దాని స్థానంలో మరో స్తంభాన్ని ఏర్పాటు చేయించి పటిష్ట పరించారు. దీంతో ప్రమాదం తప్పిందని ప్రజలు పేర్కొంటున్నారు.

తమ్మవరం రోడ్డు పనులు ప్రారంభం




రోడ్డు పనులకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

మేదరమెట్ల, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మవరం వెళ్లే రోడ్డునిర్మాణ పనులను కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది. సోమవారం తమ్మవరం గ్రామస్థులు రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మేదరమెట్ల సబ్‌స్టేషన్ నుంచి మూడు కిలోమీటర్ల పొడవున ఈ రోడ్డు నిర్మించనున్నారు. ఈ రోడ్డు పూర్తిగా గుంటలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి రవికుమార్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాభివృద్ధికి రూ.2 లక్షల సాయం

● కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా అందజేత

మేదరమెట్ల, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలరావూరులో విద్యాభివృద్ధికి రూ.2 లక్షల సాయాన్ని గ్రామానికి చెందిన యువకులు అందజేశారు. దేసు సూర్యనారాయణ, జయలక్ష్మి దంపతుల కుమారులు వెంకటేశ్వరరావు, అనీల్ కుమార్‌లు తమ తల్లిదండ్రుల పేరుతో గ్రామంలో విద్యాభివృద్ధి చేయడానికి కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్‌కు రూ.2 లక్షల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దినిపై వచ్చే వడ్డీని పేద విద్యార్థులకు అందించాలని ఫౌండేషన్ ట్రస్టీ కందెపు రాజశేఖర్‌ను కోరారు. గ్రామంలో విద్యాభివృద్ధికి విరాళం అందించిన యువకులకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు ఈ విరాళం ఎంతో మందికి స్ఫూర్తిగా ఉంటుందని రాజశేఖర్ తెలిపారు.



అన్నీ ఆయనకు తెలియకుండానే జరిగాయా!?
కాకాణిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్
- వివరాలు 8లో..





కామాక్షితాయి సన్నిధిలో వివిధ రకాల పూలు, పండ్లతో అలంకరించిన అంతరాలయం

కల్యాణ వైభోగమే!

సంప్రదాయంగా కామాక్షితాయి వివాహం
భక్తజనంతో కిటకిటలాడిన జొన్నవాడ
తెప్పపై విహరించిన ఆదిదంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 26 (ఆంధ్రజ్యోతి) : వేద పండితుల మంత్రోచ్చరణ, మంగళవాయిద్యాల నడుమ భక్తులే పెళ్లిపెద్దలుగా జొన్నవాడలో సోమవారం గంగా, కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జునస్వామి వారి కల్యాణం సోమవారం కనులపండువగా జరిగింది. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగిన ఈ వేడుకకు ముందుగా స్వామి, అమ్మవారి ఎదురుకోలు భక్తులను అలరించింది. అనంతరం ఉత్సవర్లను కల్యాణవేదికపై కొలువుదీర్చి, ఉభయదాతలు వల్లూరు రవీంద్రకుమార్ రెడ్డి,పెద్ద కామాక్షమ్మ దంపతులు, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సేవా కమిటీ ఈఓ, వేర్వేరుగా పట్టువస్త్రాలు, పీతాంబరాలు సమర్పించారు. అనంతరం జరిగిన కల్యాణ మహోత్సవాన్ని తరలివచ్చిన భక్తజనం తిలకించి పులకించి పులకించింది. పలువురు దాతలు భక్తులకు మజ్జిగ, మంచి నీరు సరఫరా చేశారు. ఆలయ నిత్యాన్నదాన సధనంతోపాటు స్థానిక కాశీ అన్నపూర్ణేశ్వరి నిత్యాన్నదాన సదనం, టీటీడీ సత్రం ఆవరణం, స్థానిక బ్రాహ్మణ సామాజిక వర్గం ఇంకా పలుచోట్ల పలు సామాజిక వర్గాల వారు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, సేవా కమిటీ ఛైర్మన్ తిరుమూరు. అశోక్ రెడ్డి, సభ్యులు, సర్పంచు పెంచలయ్య పర్యవేక్షించారు.

● వైభవంగా తెప్పోత్సవం

రాత్రి పెన్నానదిలో గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి వారు తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తజనంతో పెన్నానదికి ఇరువైపులా కిటకిటలాడింది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉత్సవర్లకు గ్రామోత్సవం జరిగింది. కాగా, అంతరాలయం, గర్భాలయంతోపాటు ఆలయ ప్రాకారానికి చేసిన విశేష పుష్పాలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

యోగా ప్రాముఖ్యతను తెలియజేయండి!

అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలకు యోగాపై ఆసక్తి కల్పించేందుకు, యోగా ప్రాముఖ్యతను తెలియచేసేందుకు అధికారులంతా కృషి చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం అధికారులతో ఆయన సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపడుతున్న యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ ఇంటికి వెళ్లి యోగా ప్రాధాన్యతను, ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు వివరించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మండలస్థాయిలో నిర్వహించే అన్నీ కార్యక్రమాల్లో అధికారులు పాల్గొని యోగాలో ప్రజలను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. సుమారు 200 మంది మాస్టర్ ట్రైనర్స్ యోగాసనాలపై శిక్షణ పూర్తి చేశారని, వీరిని సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాల అమలుకు జిల్లాస్థాయిలో డీఎస్‌డీవో యతిరాజ్‌ను నోడల్ అధికారిగా నియమించామని, ఏదైనా సందేహాలుంటే ఆయనను సంప్రదించాలని సూచించారు.

● 4 పర్యాటక కేంద్రాల్లో కార్యక్రమాలు

జిల్లాలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నాలుగు ప్రముఖ కేంద్రాల్లో యోగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ చెప్పారు. బుధవారం నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద, జూన్ 6న మైపాడు బీచ్ వద్ద, జూన్ 10న ఉదయగిరి ఆలయం ఎదుట, జూన్ 16న పెంచలకోనలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగాసనాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతీ పర్యాటక కేంద్రంలో కూడా సుమారు వెయ్యిమంది యోగా కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానికుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

● ప్రతి శుక్రవారం చెత్త నిర్మూలన కార్యక్రమం

నెల్లూరు (హరనాథపురం) : గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ప్రతి శుక్రవారం ప్రత్యేక చెత్త నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో పరిష్కరించిన అర్జీలపై అర్జీదారుల నుంచి అభిప్రాయాలు తెలుసుకోవాలని సూచించారు. అర్జీల ఆడిటింగ్‌ను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల వేగం పెంచాలని, ప్రతివారం కనీసం 70 శాతం తగ్గకుండా పనులు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఎంపీడీవోలు ప్రతివారం సమీక్షలు నిర్వహించాలన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించడానికి చర్యలు చేపట్టాలన్నారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్, నెల్లూరు నగర కమిషనర్ నందన్, జడ్పీ సీఈవో విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకుంటున్న ఉపాధ్యాయులు

టీచర్ల బదిలీలకు

5,808 దరఖాస్తులు

పూర్తయిన ఎస్‌ఏల దరఖాస్తు ప్రక్రియ
నేటితో పూర్తికానున్న ఎస్‌జీటీల గడువు
హెచ్‌ఎంలకు సర్టిఫికెట్ల పరిశీలన

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి సోమవారం నాటికి 5,808 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల దరఖాస్తు గడువు పూర్తవగా, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లకు ఆదివారం రాత్రితో దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. సెకండరీ గ్రేడ్ టీచర్లకు మంగళవారం రాత్రికి దరఖాస్తుల స్వీకరణ పూర్తికానుంది. సాఫ్ట్‌వేర్ లోపాలు, సాంకేతిక సమస్యలతో ఆదివారం రాత్రి వరకు కూడా దరఖాస్తులు స్వీకరించాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు.

నెల్లూరు (విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ప్రధానోపాధ్యాయుల నుంచి 139 దరఖాస్తులు స్వీకరించడంతోపాటు 9 అభ్యంతరాల సమస్యలను కూడా పరిష్కరించారు. మొత్తం 92 పోస్టులకు గాను 1:3 చొప్పున సర్టిఫికెట్ల పరిశీలన చేసి తుది జాబితాను విడుదల చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ల దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా సాంకేతిక లోపాలతో ఆలస్యం కావడంతో మరో రోజు గడువు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తుండటంతో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వీటిని పరిశీలిస్తున్నారు. తొలిదశ పరిశీలన ఎంఈఓలు చేస్తుండగా రెండో దశ పరిశీలన జిల్లాస్థాయిలో డీఈఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. తొలిదశ పరిశీలనలో దరఖాస్తు చేసిన ఉపాధ్యాయుడి పూర్తి వివరాలను జతచేసి రెండోదశ పరిశీలనకు పంపిస్తున్నారు. ఆ తరువాత తుది జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రక్రియ కోసం సిబ్బంది అర్ధరాత్రి వరకు శ్రమించాల్సి వస్తుంది. దీనికి తోడు సాఫ్ట్‌వేర్ సమస్యలు ఉత్పన్నవవుతుండటంతో బదిలీల ప్రక్రియలో జాప్యం జరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

● భారీగా దరఖాస్తులు

టీచర్ల బదిలీలకు సంబంధించి భారీగానే దరఖాస్తులు అందుతున్నాయి. సోమవారం రాత్రి వరకు 5,808 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీరిలో ఇప్పటికే హెచ్‌ఎంలకు సంబంధించి 139 దరఖాస్తులు ప్రక్రియ పూర్తి కాగా ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు 82 మంది, స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ (తెలుగు, ఇంగ్లీష్, హిందీ) సబ్జెక్టులకు 1096 మంది, స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజ్ (గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్)కు 1752 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 2,739 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఎస్‌జీటీలకు సంబంధించి మంగళవారం రాత్రితో గడువు ముగియనుండటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

● నేడు హెచ్‌ఎంల సర్టిఫికెట్ల పరిశీలన

జిల్లాలోని జడ్పీ, మునిసిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్స్, తత్సమాన కేటగిరి ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. ఇప్పటికే తుది జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు చెప్పారు.



ఈ జాబితాలోని అభ్యర్థులంతా నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలకు మంగళవారం ఉదయం 9 గంటలకు సేవా పుస్తకాలు, అర్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. పరిశీలన పూర్తయ్యాక అర్హులైన వారి తుది జాబితాను ఎంపిక చేసి హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తామని తెలిపారు.



నర్రవాడ పర్యాటక హబ్‌గా మారేనా!?

● 50 ఎకరాలు కేటాయించినా ముందుకు పడని అడుగులు
● అన్నీ అనుకూలిస్తే భక్తులు, పర్యాటకులకు ఎంతో సౌలభ్యం

వివరాలు 8లో..



మినీ బైపాస్‌కు తూర్పు వైపున రామిరెడ్డి కాలువ స్థలంలో చదును చేసిన దృశ్యం

కాలువ భూముల కబ్జా

● రామిరెడ్డి కాలువపై కబ్జాదారుల కన్ను
● జీప్‌ట్రాక్‌ను ఆక్రమిస్తూ నిర్మాణాలు
● ఇప్పటికే రూ.కోట్లు విలువ చేసే స్థలం ఆక్రమణ
● కన్నెత్తిచూడని ఇరిగేషన్ శాఖ

నెల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కళ్ల ముందు కాలువను కబ్జా చేస్తున్నా ఇరిగేషన్ అధికారులకు పట్టడం లేదు. నెల్లూరు నగర నడిబొడ్డున రూ.కోట్లు విలువ చేసే రామిరెడ్డి కాలువ ఆక్రమణల చెరలోకి వెళుతోంది. ఇప్పటికే పలువురు కాలువ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. నెల్లూరు చెరువు నుంచి ప్రారంభమయ్యే రామిరెడ్డి కాలువ ఇస్కాన్ సిటీ వద్ద సర్వేపల్లి కాలువలో కలుస్తుంది. జెండావీధి, మూలాపేట, అరవింద్‌నగర్, శ్రీహరినగర్ మీదుగా ఈ కాలువ ప్రయాణిస్తుంటుంది. నగరంలో ఉన్న ప్రధాన డ్రెయిన్లలో ఇది ఒకటి. ఒకప్పుడు పంట కాలువ అయినప్పటికీ ఇప్పుడు నగరంలో ప్రధానమైన డ్రెయిన్‌గా ఉపయోగపడుతోంది. నగరంలో పడ్డ వర్షపు నీరు ఈ కాలువ మీదుగా సర్వేపల్లి కాలువలోకి చేరి నగరం బయటకు వెళుతుంటాయి. ఈ కాలువ ప్రాధాన్యతను గుర్తించి గత తెలుగుదేశం ప్రభుత్వంలో లైనింగ్ పనులు చేశారు. కాలువకు రెండు వైపులా కాంక్రీట్ వాల్స్ నిర్మించారు. అయితే కాలువ వెడల్పును తగ్గించి వాల్స్ నిర్మించడంతో ఒక్కో వైపు కాలువ స్థలంతోపాటు జీప్‌ట్రాక్‌ను కలుపుకుంటే 30 అడుగుల వరకూ స్థలం మిగులుతోంది. వాల్స్ నిర్మించడంతో ఆక్రమణదారులకు కలిసొచ్చింది. జీప్‌ట్రాక్‌ను కాపాడుకోవడంలో ఇరిగేషన్ అధికారులు విఫలమవడంతో కబ్జాదారులు ఆక్రమించేస్తున్నారు.

● రాళ్లు తొలగించి మరీ ఆక్రమణలు

మాగుంటలేఅవుట్ ఎన్టీఆర్ పార్కు సమీపంలో మినీబైపాస్‌కు తూర్పు, పడమర వైపు రామిరెడ్డి కాలువ ప్రవహిస్తుంది. కాలువ జీప్ ట్రాక్ స్థలం వరకూ గతంలో ఇరిగేషన్ అధికారులు ఫెన్సింగ్ రాళ్లు నాటారు. అయితే కొన్నాళ్ల తర్వాత ఆక్రమణదారులు ఆ రాళ్లను తొలగించారు. అయినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు ఒక్కొక్కరుగా కాలువ భూమిలోకి చొచ్చుకొని వస్తున్నారు. మినీబైపాస్‌కు పడమర వైపు అయితే కాలువ ఆక్రమణ స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడే దాదాపు వంద అంకణాలకుపైగా స్థలం కబ్జాకు గురైంది. తాజాగా తూర్పు వైపు కొందరు కాలువను ఆక్రమించి ఏకంగా గోడలు నిర్మిస్తున్నారు. మరోకొందరు డస్ట్‌తో కాలువ స్థలాన్ని చదును చేస్తున్నారు. ఇక్కడ నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ప్రాంతంలో అంకణం విలువ రూ.10 లక్షలకు పైగానే ఉంది. మినీబైపాస్‌కు తూర్పు, పడమరన కాలువకు ఇరువైపులా సుమారు ఎకరం భూమి వరకూ ఇరిగేషన్ శాఖకు చెందినది ఉంటుంది. దీని విలువ రూ.60 కోట్ల వరకూ ఉంటుంది. ఇప్పటికే ఇందులో కొంత ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. మరికొన్ని రోజులు గడిస్తే కాలువ జీప్‌ట్రాక్ కనిపించకుండా పోయే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ స్థలాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోకతప్పదు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	35.3	27.3
కావలి	33	28
ఆత్మకూరు	36	24
ఉదయగిరి	36	25
కందుకూరు	36	26



ఇదేం పద్ధతి మేయరమ్మా?

సుమారు 30 లక్షలమంది జనాభా కలిగిన జిల్లాకు ప్రథమ పౌరురాలిగా వ్యవహరిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఒక్క కారు మాత్రమే వినియోగిస్తున్నారు. అయితే 8 లక్షల జనాభా కలిగిన నెల్లూరు నగర ప్రథమ పౌరురాలు (మేయర్) మాత్రం రెండు కార్లను వినియోగిస్తున్నారు. ఈ విషయం వివాదస్పదంగా మారింది. ఆమె ఉపయోగి స్తున్న కియో కారుకు డ్రైవర్ల జీతం, డీజిల్ ఖర్చులు మేయర్ భరించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా కార్పొరేషన్ నెలకు రూ. 60 వేలు అద్దె చెల్లిస్తున్నది. అంతేకాక కార్పొరేషన్ డ్రైవర్లు, ఆయిల్‌నే వాడుతున్నట్లు సమాచారం. మరో కొత్త కారును కూడా ఆమె వాడుతుండగా, దానికి కూడా ఆయిల్ ఎస్‌ఎంసీ నుంచి పడుతున్నట్లు వినికి డి. కార్పొరేషన్ ఆదాయాన్ని పరిరక్షించాల్సినవారే ఇలా వృథా చేయడం ఏమిటని నగర వాసులు ప్రశ్నిస్తున్నారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

పోస్టల్‌లో ఆధార్ సీడింగ్ చేయించుకోవాలి

నెల్లూరు(విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖ ద్వారా ప్రభుత్వ పథకాలు, పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులందరూ వెంటనే ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ కే.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ సీడింగ్, బ్యాంక్ లింకింగ్, మ్యాపింగ్ చేయిం చుకోని లబ్ధిదారులకు పింఛను నిలిపి వేస్తామని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పథకాల అమలులో భాగంగా ప్రతి లబ్ధిదారుడు బ్యాంక్ ఖాతాను ఆధార్‌తో మ్యాపింగ్ అయ్యి ఉండాలన్నారు. ప్రతి గ్రామ, వార్డు పరిధిల్లో పోస్టల్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయని, తగిన ఆధారాలతో పోస్టల్ కార్యాలయాలను సంప్రదించి సీడింగ్ చేయించుకోవాలని ఆయన తెలిపారు.



పూల దారి..!

దుత్తలూరు (ఉదయగిరి), మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు, ఎంపీడీవో, ఉపాధి, వెలుగు, వ్యవసాయ, హౌసింగ్ కార్యాలయాలకు వెళ్లే రహదారి ఇది. సుమారు అర కిలోమీటర్ పొడవునా ఉన్న ఆ రహదారికి రువైపులా చెట్లు పందిరిలా ఉండి పుసుపురంగు పూలతో చూపరులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం కాస్తున్న ఎండలకు ఆ కార్యాలయాలకు వచ్చే అధికారులు, ప్రజలు ఆ చెట్ల నీడన సేదతీరుతూ ఉపశమనం పొందుతున్నారు.

అన్నీ ఆయనకు తెలియకుండానే జరిగాయా!?

● కాకాణిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఫైర్

పొదలకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డికి తెలియకుండానే అక్రమ మైనింగ్, భూ ఆక్రమణలు జరిగాయా!? అంటూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం పొదలకూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ గోవర్ధన్ రెడ్డి ప్రమేయం లేకుండానే అక్రమ మైనింగ్ జరిగిందని వైసీపీ నేతలు చెబుతారా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు చివరకు జర్నలిస్టులపై కూడా తప్పుడు కేసులు పెట్టించాడని అన్నారు. ఐదేళ్లు లెక్కకు మించి పాపాలు చేశాడని, ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నాడని అన్నారు. ఇప్పటివరకు 55రోజులుగా అజ్ఞాతవాసం, ఈ రోజు నుంచి జైలు వాసం గడపబోతున్నాడంటూ వ్యాఖ్యానించారు. తప్పుడు పనులు చేసి జైలుకు పోతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై వైసీపీ నేతలు సానుభూతి చూపడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, పెంచలభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సగటు వర్షపాతం 11.8 మి.మీ

నెల్లూరు (హరనాథపురం) మే 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం సగటు వర్షపాతం 11.8మి.మీగా నమోదైంది. అత్యధికంగా దుత్తలూరులో 43.6మి.మీ., అత్యల్పంగా నెల్లూరు అర్బన్‌లో 1.4మి.మీ వర్షపాతం నమోదైంది.

నర్రవాడ పర్యాటక హబ్‌గా మారేనా!?

● గత ప్రభుత్వంలో పరిశీలనకే పరిమితం
● 50 ఎకరాలు కేటాయించినా ముందుకు పడని అడుగులు
● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

ప్రముఖ పుణ్యక్షేత్రం నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఆలయానికి రాష్ట్రంతో పాటు కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఏటా ఇక్కడ జరిగే తిరునాళ్లతోపాటు ప్రతి ఆది, గురువారాల్లో భక్తులతో కిక్కిరిసిపోతుంది. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ ఆలయాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం స్థల పరిశీలన చేసింది. అయినా అందుకు అనుగుణంగా అడుగులు ముందుకు పడలేదు.

దుత్తలూరు (ఉదయగిరి), మే 26 (ఆంధ్రజ్యోతి) : వెంగమాంబ పేరంటాలు కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందడంతో ఏటేటా భక్తుల తాకిడి పెరుగుతూనే ఉంది. అయితే అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పచ్చవ కరుణాకర్ సొంత నిధులు వెచ్చించి కొన్ని వసతులు కల్పించారు. అందులో భాగంగానే నర్రవాడ క్షేత్రాన్ని పర్యాటక హబ్‌గా చేస్తే మరింత అభివృద్ధి చెందుతున్న ఆలోచనతో ఆయన ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఇందుకుగాను నర్రవాడలో 565 జాతీయ రహదారి పక్కనే 50 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఆ భూమిని ఏపీ టూరిజం శాఖకు అప్పగిస్తే ఆ ప్రాంతంలో భక్తులు సేదతీరేందుకు హరిత హోటల్స్ రిసార్ట్స్ క్రీడా మైదానం, స్పోర్ట్స్ క్లబ్, యాత్రికులకు అవసరమైన భవనాలు, ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుంది. అటు ఆలయానికి వచ్చే భక్తులతోపాటు జాతీయ రహదారి పక్కనే వీటిని ఏర్పాటు చేయనుండటంతో ప్రయాణికులు సైతం సేదతీరేందుకు వీలుగా ఉంటుందని భావించారు.



హైవే పక్కన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ధర్మకర్తలు (ఫైల్)

● పరిశీనలకే పరిమితం

నర్రవాడను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు 2023, జూన్ 8న కావలి ఆర్డీవో శీనానాయక్, పలు శాఖల అధికారులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు నర్రవాడలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఆ భూమిని పర్యాటక శాఖకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. దీంతో స్థానికులతోపాటు అమ్మవారి భక్తులు ఎంతో సంతోషించారు. కానీ రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా వెంగమాంబ ఆలయాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్ది, అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.



ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు

వెంగమాంబ ఆలయ అభివృద్ధికి రూ.6.50 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. లక్షలాది మంది భక్తులతో పూజలందుకుంటున్న అమ్మవారి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిద్దడంతోపాటు పలువురికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

- కాకర్ల సురేష్, ఎమ్మెల్యే, ఉదయగిరి

వెంగమాంబ బ్రహ్మోత్సవాలపై 30న సమీక్ష

దుత్తలూరు (ఉదయగిరి), మే 26 (ఆంధ్రజ్యోతి): శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తుండటంతో ఏర్పాట్లపై ఈనెల 30న అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వెట్టిగుంట ఉషశ్రీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కావలి ఆర్డీవో వంశీకృష్ణ హాజరవుతారన్నారు. కావున సంబంధిత అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. అలాగే ఉత్సవాల సందర్భంగా తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తిగల వారు పాటలో పాల్గొనాలని ఆమె కోరారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు(ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 518 బేళ్లను తీసుకురాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 450 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 68 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.280 కాగా, కనిష్ఠ ధర రూ. 200 పలికినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

95 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి(ఆంధ్రజ్యోతి): కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 476 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 381 బేళ్ల కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 95 బేళ్ల తిరస్కరించారు. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టీ ఇసాక్ స్వరన్‌దత్ తెలిపారు.

సముద్రపు నాచు మొక్కల పెంపకంపై శిక్షణ

● ప్రారంభించిన జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు

కందుకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు సమీప గ్రామమైన గుడ్లూరు మండలం కర్లపాలెంలో సముద్రతీరంలో సాగు చేయుచున్న సముద్ర నాచు మొక్కలు (సీవీడ్)పై మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈనెల 28 వరకు జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమం స్కందమెరైన్ ఆల్గే సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు ఎం నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.సతీష్, స్కంధ మెరైన్ ఆల్గే ప్రతినిధులు రామాయపట్నం పోర్టు పరిసరాల్లో సీ వీడ్ సాగుకు ఉన్న అనువైన పరిస్థితులను ప్రస్తుతం సీ వీడ్‌కు మార్కెట్లో ఉన్న డిమాండ్‌ను వివరించారు. ఇది రైతులకు లాభసాటిగా మారుతుందని తెలిపారు. స్థానిక మత్స్యకారులతో పాటు డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి వచ్చిన మత్స్యకారులు, మత్స్యశాఖ అధికారులు ఈ శిక్షణలో పాల్గొని సీ వీడ్ సాగు గురించి తెలుసుకున్నారు. ఆరు నెలలపాటు పరిశోధన అనంతరం ఈప్రాంతంలో సీవీడ్ సాగు చేయటం జరుగుతోందని వివరించారు. తొలిరోజు బోటు సహాయంతో శిక్షణకు హాజరైన వారందరినీ సముద్రంలో ఉన్న సముద్రుడు నాచుమొక్కల క్షేత్రసందర్శన చేయించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి లక్ష్మణ్ నాయక్, వీఎఫ్ఏలు, సాగర్‌మిత్రలు, స్థానిక మత్స్యకార సహకార సంఘం సభ్యులు, గ్రామసర్పంచు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సముద్రపు నాచు పెంపకంపై అవగాహన కల్పిస్తున్న సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్, మత్స్యశాఖ అధికారులు

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి వంద ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), మే 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కి జిల్లావ్యాప్తంగా 100 మంది ఫిర్యాదుదారులు తరలివచ్చి వారి సమస్యలు తెలుపుకున్నారు. నగర డీఎస్పీ సింధుప్రియ ఫిర్యాదులను స్వీకరంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. అందిన ఫిర్యాదుల్లో కొన్నింటి వివరాలు.

● ఉలవపాడు ప్రాంతానికి చెందిన ఓ మహిళకు ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి పరిచమయ్యాడు. కిడ్నీవ్యాధులకు మందులు విదేశాల నుంచి తెప్పించి, పూర్తిగా తగ్గిస్తానని చెప్పి రూ.4.90 లక్షల నగదు తీసుకున్నాడు. మందులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుంటే, తాను ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వాలని ఆ మహిళ కోరింది. నగదు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని, న్యాయం చేయాలని ఆ మహిళ కోరింది.

● నెల్లూరుకి చెందిన ఓ యువకుడు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని పొదలకూరు ప్రాంతానికి చెందిన జరీనాబేగం, ఆమె కుటుంబసభ్యుల నుంచి రూ.9 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా, నగదు తిరిగి ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని ఆ యువతి తండ్రి కోరాడు.



ఫిర్యాదును పరిశీలిస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

● నెల్లూరు సంతపేటకి చెందిన ఓ వ్యక్తికి హైదరాబాద్‌కు చెందిన రామ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్షలు తీసుకొని మోసం చేశాడు. ఉద్యోగం ఇప్పించకపోగా, తిరిగి నగదు ఇవ్వడం లేదని న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

● కలిగిరికి చెందిన ఓ మహిళను కావలి ప్రాంతానికి చెందిన జమీర్ వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరకంగా కలిశాడని, పెళ్లి చేసుకోమంటే చేసుకోనని బెదరిస్తున్నాడని బాధితురాలి ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలని కోరింది.

● నెల్లూరు నవాబుపేటకి చెందిన ఓ మహిళ భర్త ప్రమాదంలో మరణించాడు. తన అత్త ఈశ్వరమ్మ తన ఇద్దరి పిల్లలను తన దగ్గర ఉంచుకొని ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నదని, ఇదేమని అడిగితే వారిని చంపేస్తానని బెదరిస్తున్నదని ఆ మహిళ ఫిర్యాదు చేశారు.

● తన కుమారుడు ఆస్తి కోసం వేధిస్తూ తన బాగోగులు చూసుకోవడం లేదని ఓ వృద్ధుడు ఫిర్యాదు చేశారు. నగరంలోని చిన్నబజారు ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు పక్షవాతంతో బాధపడుతున్నట్లు, తన కుమారుడు పట్టించుకోవడం లేదని న్యాయం చేయాలని కోరాడు.

● టీపీ గూడూరుకి చెందిన రైతు తన రొయ్యలను సింగరాయకొండలోని రొయ్యల ఫ్యాక్టరీకి చెందిన శివరామకృష్ణకు రూ.12 లక్షలకు అమ్మాడని అతను, నగదు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని న్యాయం చేయాలని కోరాడు.



అర్జీదారుల సమస్యపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆనంద్

కలెక్టరేట్‌కు వినతులే.. వినతులు

● సమస్యలు పరిష్కరించాలంటూ ఏకరువు ● అందిన అర్జీలు 407

నెల్లూరు (హరనాథపురం) మే 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నడూలేని విధంగా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు భారీగా అర్జీలు వచ్చాయి. 407 మంది తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు సమర్పించారు. ఒకవైపు అర్జీదారులు, వారి బంధువులు, మరోవైపు ర్యాలీలతో కలెక్టరేట్ కిటకిటలాడింది. సోమవారం వాతావరణం చల్లగా ఉండడంతో జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ ఆనంద్ క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం ఉండాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

● 407 అర్జీలు

పీజీఆర్ఎస్‌కు సోమవారం 407 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో రెవెన్యూవి 133, మున్సిపల్‌శాఖవి 17, సర్వేశాఖవి 46, పంచాయతీరాజ్‌శాఖకు 16, పోలీసు శాఖకు 52, సివిల్ సప్లయిస్ విభాగానికి 31 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జేసీ కే.కార్తీక్, డీఆర్వో ఉదయ భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

● 'ఎండీయూ'ను కొనసాగించాలి

ఎండీయూ వాహనాలను కొనసాగించాలని కోరుతూ ఏపీ రాష్ట్ర సమైఖ్య ఎండీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లకు 2027 జనవరి వరకు ప్రభుత్వంతో అగ్రిమెంట్ ఉందని, ఎండీయూ వ్యవస్థ రద్దుతో 9260 మంది ఎండీయూ ఆపరేటర్లు, అదనంగా 9260 మంది హెల్పర్లు ఉపాధి లేకుండా పోయారన్నారు. 2027 వరకు ఎండీయూ వాహనాలను కొనసాగించాలని కోరారు. అంతకుముందు వారు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.



ఆందోళన చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

ఎండీయూ వాహనాలను ఆపొద్దు : ఆర్‌పీఐ

రాష్ట్రంలో రేషన్ సరుకుల పంపిణీకి సంబంధించిన ఎండీయూ వాహనాల నిలిపివేతను వ్యతిరేకిస్తూ సోమవారం నెల్లూరులోని బోసుబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు మాట్లాడుతూ ఎండీయూ వాహనాలను నిలిపివేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల నిరుపేదలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. 18,500 ఎండీయూ వాహనదారుల కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టపు రంగారావు, ఉపాధ్యక్షుడు కొత్తల మధుసూదన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నంబూరు గణేష్, సురేష్, చిరంజీవి పాల్గొన్నారు.



- నెల్లూరు (హరనాథపురం)

ప్రయాణికుడిపై ట్రావెల్స్ బస్ క్లీనర్ దాడి

కావలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుడిపై వి నాయక ట్రావెల్స్ బస్ క్లీనర్ గణేష్ దాడి చేసిన ఘటన కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. బాపట్ల నుంచి బెంగళూరుకు వెళుతున్న వినాయక ట్రావెల్స్ బస్‌లో బెంగళూరు వెళ్లేందుకు జలదంకి మండలం ఆదిరెడ్డి పాలెంకు చెందిన నేలపాటి రమేష్, భార్య, పిల్లలతో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ట్రావెల్ ఏజెన్సీ వద్దకు వచ్చారు. కావలి చేరుకున్న బస్ లో రమేష్ లగేజీ పెట్టె విషయంలో బస్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించటంతో వారి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో బస్ క్లీనర్ గణేష్ ప్రయాణికుడు రమేష్‌పై దాడి చేశాడు. రమేష్ తలకు గాయాలు కావటంతో క్లీనర్ అక్కడ నుంచి పరారయ్యాడు. రమేష్ భార్య పిల్లలతో బస్ దగ్గర ఆందోళన చేయడంతో బస్సు నిలిచిపో యింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బస్సును పంపించి గా యపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరా రైన బస్ క్లీనర్ గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

సోమశిలలో నీటి నిల్వల

అనంతసాగరం, మే 26 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 43.960 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 972 క్యూసెక్కులు ప్రవాహం వస్తుండగా పెన్నా డెల్టాకు 3,480, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



ఉదయగిరిలో కురుస్తున్న వర్షం

విస్తారంగా వర్షాలు

ఉదయగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): గతనెల రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఎన్నడూలేని విధంగా పలు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. వర్షాలు కురుస్తుండడం, మరోవైపు నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తుండడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. వ్యవసాయ శాఖ పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతోంది. గతేడాది రబీలో సాగు చేసిన పొలాల్లో రైతులు ఇతర పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

ఆధార్ కోసం అవస్థలు

ఉదయగిరి, మే 26(ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రం తప్ప మరెక్కడా అందుబాటులో లేకపోవడంతో ప్రజలు చేర్పులు, మార్పుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. మరోవైపు సర్వర్ సమస్య ఉండడంతో రోజంతా పిల్లలతో అక్కడే ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నా అవి సక్రమంగా పనిచేయడం లేదని, ఆయా మండలాల వారు సైతం బీఎస్ఎన్ఎల్ కేంద్రానికే వస్తుంతడడంతో సమస్య జటిలంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్ని మండలాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆధార్ కేంద్రంలో చిన్నారులతో నిరీక్షిస్తున్న తల్లిదండ్రులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 510



అట్టహాసంగా యోగా డే సన్నాహక శిబిరం

కందుకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం జూన్ 21న ప్రతిష్ఠాత్మకంగా యోగా డే నిర్వహించనున్న సందర్భంగా సోమవారం కందుకూరు పట్టణంలో యోగా సన్నాహక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.అనూష ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో మాస్టర్ ట్రైనర్స్‌చే యోగా శిక్షణ శిబిరం నిర్వహించారు. ఔత్సాహికులు, యోగా శిక్షకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అందరూ యోగా ప్రాక్టీస్ చేయించారు. కార్యక్రమంలో సీఐ కే.వెంకటేశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర వైద్యం దైవాధీనం!

- » వలేటివారిపాలెం పీహెచ్‌సీలో అందని సేవలు
- » సాయంత్రం 4గంటల తరువాత నాడి పట్టేనాథుడు కరువు
- » అర్ధరాత్రి వెళ్తే కందుకూరుకు సిఫార్సు
- » మార్గమధ్యంలో కోల్పోతున్న ప్రాణాలు
- » పేరుకే 24 గంటల ఆసుపత్రి
- » ఆందోళనలో మండల ప్రజలు
- » పట్టించుకోని అధికారులు, పాలకులు



వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వలేటివారిపాలెం, మే 26(ఆంధ్రజ్యోతి) : అది 24 గంటలు పని చేయాల్సిన ఆసుపత్రి. అక్కడ పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది ఉన్నారు. అయినా అక్కడ అత్యవసర వైద్యం దైవాధీనంగా మారింది. సాయంత్రం 4 గంటలు దాటితే నాడి పట్టేవారే కరువయ్యారు. అర్ధరాత్రి సమయంలో అనారోగ్యంతో వైద్యం కోసం ఆసుపత్రికి వెళితే కనీసం ప్రాథమిక చికిత్స కూడా చేయకుండా కందుకూరు ఏరియా వైద్యశాలకు సిఫార్సు చేస్తున్నారు. దీంతో సకాలంలో వైద్యం అందక కొందరి ప్రాణాలు మార్గమధ్యంలోనే గాలిలో కలిసిపోతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదు. ఇది వలేటివారిపాలెం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుస్థితి. ఈ పీహెచ్‌సీలో రోగులకు అత్యవసర వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయి. ఇక్కడ పూర్తి స్థాయిలో ఇద్దరు వైద్యులు, సిబ్బంది ఉన్నారు. మందులు, పరికరాలు, భవనం వసతి తదితర సౌకర్యాలు ఉన్నాయి. అయితే అందరూ పీహెచ్‌సీకి దూరంగా పట్టణాల్లో నివాసం ఉంటుండడంతో ఇక్కడ అందుబాటులో ఉండలేకున్నారు. ఈ క్రమంలో వైద్యులు, సిబ్బంది ఉదయం 10 గంటలకు ఆసుపత్రికి వచ్చి సాయంత్రం 4 గంటలకు తిరిగి వెళ్తున్నారు. ఆ తరువాత స్టాఫ్ నర్సు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఇది 24 గంటలు ఆసుపత్రి అయినప్పటికీ సాయంత్ర 4 గంటల తరువాత ఎప్పుడు వెళ్లినా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని రోగులు వాపోతున్నారు. రాత్రి వేళ్లలో ఎవరైనా గుండెపోటు, పాముకాటు, రోడ్డు ప్రమాదాలు బారినపడి ఇక్కడికి వస్తే స్టాఫ్ నర్సు మాత్రమే ఉంటుంది. ఇక్కడ వైద్యులు సిబ్బంది లేకపోవడంతో స్టాఫ్‌నర్సు కందుకూరు ఏరియా ఆసుపత్రికి సిఫార్సు చేస్తున్నారు. అదేవిధంగా వ్యయ ప్రయాసాలకోర్చి దూరప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు ఇక్కడ వైద్య సేవలు అందించేవారు లేక కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మండలంలోని సుమారు 20 గ్రామాల ప్రజలకు ఈ నే దిక్కు. అలాంటి పరిస్థితుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండనప్పటికీ ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు


ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనరు ఉమామహేశ్వరరావు

అల్లూరు, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరు మౌఖిక ఆదేశాల మేరకు అల్లూరు నగర పంచాయతీ పరిధిలో గిరిజన ప్రజలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ప్రారంభించినట్లు నగర పంచాయతీ కమిషనరు ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం అల్లూరు సచివాలయం -2 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ 27న సచివాలయం-3, 28న సచివాలయం-4, 29న సచివాలయం-1, 30న సింగపేట సచివాలయం, 31న నార్తుమోపూరు సచివాలయాల్లో నిర్వహిస్తాన్నామని తెలిపారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ ఆధార్ క్యాంపుల్లో వారు ఎటువంటి జనన ధ్రువీకరణ పత్రం లేకుండానే 18 ఏళ్లలోపు బాలలకు ఆధార్ నమోదు, సవరణలు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయ వైభవాన్ని కాపాడాలి

కందుకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయం వైభవానికి నేతలు చేస్తున్న కృషికి ప్రతిఒక్కరూ తమవంతు తోడ్పాటు అందించాలని, అనవసర అపోహలు సృష్టించటం ద్వారా ఆలయ వైభవాన్ని అడ్డుకోవాలని చూడటం ఎవరికీ తగదని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి సంకల్పించి ఆలయనిర్మాణం పూర్తిచేయించటమే గాక నేటికీ అనివేటిమండపం నిర్మాణంను తన పర్యవేక్షణలోనే పూర్తిచేయిస్తున్నారని పేర్కొన్నారు. ఆ క్రతువులో దాతలు పార్టీలకు అతీతంగా అందించిన తోడ్పాటు మరువలేనిదని పేర్కొన్నారు. అయితే ఎంతోవైభవంగా ఆలయ నిర్మాణం జరిగినా నిర్వహణకు తగినంత నిధులు లేని విషయాన్ని గుర్తించి ప్రస్తుత ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆలయ ప్రాంగణంలో షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణంకు పూనుకోగా ఆ ప్రయత్నం కూడా విజయవంతమై ప్రతినెలా రమారమి 3లక్షలు అమ్మవారికి ఆదాయం వచ్చేందుకు మార్గం సుగమమైందని తెలిపారు. ఈ తరుణంలో కొందరు తిరుణాళ్ల నిర్వహించేందుకు శాశ్వత షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అడ్డంకి అవుతుందని ప్రచారం చేస్తూ భక్తులలో అపోహలు సృష్టించే ప్రయత్నం చేయడం మంచిది కాదని పేర్కొన్నారు.

మంత్రి పార్థసారధికి ఎమ్మెల్యేల సన్మానం


మంత్రి పార్థసారధిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తదితరులు

కందుకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కె.పార్థసారధిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యలు కలిసి సత్కరించారు. కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తూ ఆదివారం రాత్రి పొద్దుపోయాక పార్థసారధి కందుకూరు పట్టణం కనిగిరి రోడ్డులో ఉన్న చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య నివాసానికి వచ్చారు. ఆయన ఆహ్వానం మేరకు ఇంటూరి నాగేశ్వరరావు అక్కడికెళ్లి మంత్రిని కలిశారు. ఆయన వెంట దామా మల్లేశ్వరరావు, గుర్రం మాల్యాద్రి, ఎన్వీ రమణయ్య, మాదాల మాల్యాద్రి, ముప్పవరపు వేణు తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


రైల్వే మిక్సర్ తెలుగు మీడియం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బిట్రగుంట, మే 26 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని రైల్వే మిక్సర్ తెలుగు మీడియం ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థుల(1999-2000) కలయిన సోమవారం జరిగింది. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న విద్యార్థులు 25 ఏళ్ల సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం తమకు విద్యాబోధలు చేసిన ఉపాధ్యాయులను నెల్లూరులోని ఓ ఫంక్షన్ హాల్‌కు చేర్చి శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు బాబురెడ్డి, దేవదాసు, ప్రసాద్, ఝాన్సీ, మల్లేశ్వరి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

31న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

- ఎమ్మెల్యేను ఆహ్వానించిన నూర్‌బాషా సంఘం ప్రతినిధులు


కావలి ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేసిన నూరుబాషా సంఘం ప్రతినిధులు

కావలి, మే 26(ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చాటిన నూర్‌బాషా విద్యార్థులకు నెల్లూరు టౌన్ హాల్‌లో ఈనెల 31న ప్రతిభా ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని నూర్‌బాషా సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం కావలిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నందున డివిజన్‌లోని నూరుబాషా సోదరీ సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూరుబాషా సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ సలీమ్, గౌరవాధ్యక్షుడు షేక్ మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శి మీరా సాహెబ్, కావలి మండల అధ్యక్షుడు షేక్ ఖలీల్, స్థానిక నేతలు షానవాజ్, గౌస్‌బాషా, షేక్ మస్తాన్, షేక్ హజరత్, షేక్ కాజావలి పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక, అక్షరాస్యతపై అవగాహన

- పల్లపోతు వెంకట కృష్ణారావు, ఏపీఎం, వెలుగు



కావలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మహిళలకు వివిధ రకాల రుణాలు ఇచ్చి ఆర్థిక అభివృద్ధికి కృషి చెయ్యడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్నాం. రుణాలు ఎలా పొందాలో తెలియజేస్తున్నామని వెలుగు ఏపీఎం పల్లపోతు వెంకటకృష్ణారావు తెలిపారు.

? మండలంలో ఎన్ని పొదుపు గ్రూపులు ఉన్నాయి.

! మండలంలో చిన్న పొదుపు సంఘాలు 1452, గ్రామ సమాఖ్యలు 42 ఉన్నాయి.

? 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎన్ని గ్రూపులకు రుణాలు ఇచ్చారు.

! 2025 మార్చి వరకు 941 పొదుపు సహాలకు సుమారు రూ.162.63 కోట్ల రుణాలు ఇచ్చాం.

? ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకించి ఏమైనా రుణాలు ఇస్తున్నారా.

! 121 మంది ఎస్సీ, ఎస్టీ గ్రూపు సభ్యులకు రూ.69 లక్షల రుణాలు ఇచ్చాం, మొత్తం గ్రూపుల పై ఉన్న అప్పు నిల్వ రూ.77,75,198.

? బ్యాంక్ లింకేజ్ రుణాలు ఎన్ని ఇచ్చారు, పొదుపు రుణాల రికవరీ ఏవిధంగా ఉంది.

! మండలంలో గత ఆర్థిక సంవత్సరానికి 295 గ్రూపులకు రూ.29.52 కోట్లు రుణాలు ఇవ్వగా 98 శాతం బ్యాంక్ లింకేజ్ రుణాలు రికవరీ అయ్యాయి. 308 సంఘాలకు స్త్రీ నిధి గ్రూపు రుణాలు రూ.6.62 కోట్లు ఇవ్వగా జిల్లాలో 100శాతం రికవరీలు సాధించిన మండలంగా కావలి నిలిచింది.

మాకు న్యాయం చేయండి

- ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో రోడ్డుపై బైఠాయించిన రైతు కుటుంబం


ఆర్డీవో కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించిన రైతు కుటుంబం

కావలి, మే 26(ఆంధ్రజ్యోతి): పూర్వీకుల నుంచి తమకు వారసత్వంగా వస్తున్న పొలాలకు హక్కు కల్పించకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారంటూ బోగోలు మండలం తెల్లగుంట పంచాయతీ అల్లిమడుగుకు చెందిన ఓ రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఆ గ్రామానికి చెందిన గడ్డం తిరిపయ్య, ఆయన కుమారుడు వంశీ, కుటుంబ సభ్యులలోని చిన్న పిల్లలతో సహా కుటుంబం అంతా సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయానికి వచ్చారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తమ సమస్య చెప్పుకోవడానికి అక్కడ ఆర్డీవో అందుబాటులో లేకపోవటంతో వారు న్యాయం కావాలంటూ అక్కడే రోడ్డుపై బైఠాయించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోడ్డుపై బైఠాయించినా వారి మొర ఆలకించేవారు కనిపించలేదు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామంలో ఉన్న 4 ఎకరాల భూమి తమ తాతల కాలం నుంచి తాము చేసుకుంటున్నామని, దానిని కావలికి చెందిన ఒక వ్యక్తి తమదని చెప్పి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారుల చుట్టూ పలు పర్యాయాలు తిరిగినా న్యాయం చేయకుండా ఇబ్బంది పెడుతున్నందున ఆర్డీవో వద్ద అయినా న్యాయం జరుగుతోందని వచ్చి నిరసన తెలిపామని ఆవేదన చెందారు.

మహానాడుకు తరలిరండి

కొండాపురం, మే 26(ఆంధ్రజ్యోతి): కడపలో జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు కోరారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని 19 పంచాయతీలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 19 పంచాయతీల నుంచి కడపకు వెళుతామన్నారు.

అన్నవరంలో లో ఓల్టేజీ సమస్య

- 10 రోజులుగా విద్యుత్ సమస్యతో అల్లాడుతున్న ఎస్సీ కాలనీ ప్రజలు
- ట్రాన్స్‌కో సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన


అన్నవరం ఎస్సీకాలనీలో విద్యుత్ స్తంభం పక్కనే పడేసి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

జలదంకి, మే 26(ఆంధ్రజ్యోతి): ఓ ప్రధాన గ్రామంలో అయితే మీరిలానే స్పందిస్తారా... పది రోజులకు పైగా లోటల్టేజీతో లైట్లు గుడ్డిగా వెలుగుతుండగా... ఫ్యాన్లు అసలు తిరగడం లేదు. ట్రాన్స్‌కో సిబ్బందికి పలు దఫాలు ఫిర్యాదు చేస్తే వారిలో స్పందన లేకుండా పోయింది అని జలదంకి మండలం అన్నవరం ఎస్సీకాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ కాలనీలో 200పైగా కుటుంబాల వారు నివసిస్తుండగా రెండు సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌పార్మర్లు ఉండగా అవి 10రోజుల క్రితం మరమ్మతులకు గురయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి నేటికీ ట్రాన్స్‌కో సిబ్బంది ఏర్పాటు చేయలేదు. ట్రాన్స్‌పార్మర్లు మరమ్మతులకు గురవడంతో స్థానిక కరెంటు మెకానిక్‌ల సాయంతో కాలనీ పక్కనే గత ప్రభుత్వంలో జగనన్న లేఔట్‌లో ఏర్పాటు చేసి ఉన్న ట్రాన్స్‌పార్మర్లకు వైర్లు తగిలించి కాలనీకి విద్యుత్‌సరఫరా చేసుకున్నారు. నేటికీ అక్కడ నుంచి కాలనీకి కరెంటు సరఫరా అవుతోంది. జగనన్న లేఔట్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్ 200కుటుంబాల వారికి సరిపడా విద్యుత్ రాక లోఓల్టేజితో గుడ్డిగా లైట్లు వెలుగుతుండగా ఫ్యాన్లు అసలు తిరగడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై స్థానిక విద్యుత్ లైన్‌మెన్‌కు, జలదంకి ఏఈ కార్యాలయాల్లో స్థానికులు ఫిర్యాదు చేసి మరమ్మతులకు గురైన ట్రాన్స్‌పార్మర్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాన్స్‌పార్మర్లు అయితే గ్రామంలోకి తెప్పించారే తప్ప నేటికీ వాటిని బిగించలేదు. దీంతో స్థానికులు ట్రాన్స్‌కో సిబ్బందిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కులస్తులమని మా పట్ల ట్రాన్స్‌కో సిబ్బంది అలుసుగా ప్రవర్తిస్తున్నారు. అదే ప్రధానగ్రామంలో ఇన్ని రోజులు విద్యుత్ సమస్య ఉంటే ఇలానే పట్టించుకోకుండా ఉంటారా అని ట్రాన్స్‌కో సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మా సమస్యను వెంటనే పరిష్కరించాలని అన్నవరం ఎస్సీకాలనీ ప్రజలు కోరుతున్నారు.

పగిలిన మంచినీటి ప్రధాన పైపులైన్

- ఆ మార్గంలో తరచూ ఇదే పరిస్థితి


ఉదయగిరి రోడ్డులో చర్చి సమీపంలో పగిలిన ప్రధాన పైపులైన్‌కు చేస్తున్న మరమ్మతులు

కావలి, మే 26(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులోని ఆర్వోబీ వంతెన అప్రోచ్ రోడ్డులో చర్చి సమీపంలో మంచినీటి ప్రధాన పైపులైన్ పగిలింది. దీంతో సోమవారం ఆ పైపులైన్‌కు మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నుంచి రైల్వేట్రాక్‌కు తూర్పువైపున ఉన్న ప్రాంతానికి మంచినీటి సరఫరా చేసేందుకు ఆపైపులైన్ ఏర్పాటు చేశారు. అయితే కాలంచెల్లిన పైపులు కావడంతో ఆ మార్గంలో తరచూ పగిలి పోతున్నాయి. రైల్వే ట్రాక్ నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు ఉన్న ఆ పైపులైన్ తరచూ పగిలి పోతుండటంతో ఆ రోడ్డంతా గుంతలమయంగా మారి రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. దీంతో ఆ పాత పైపులైన్‌ను తొలగించి ఐరన్‌పైపుతో పైపులైన్ వేసేందుకు ప్రతిపాదనలు పంపినా దానికి నిధులు మంజూరు కాలేదు. మున్సిపల్ అధికారులు స్పందించి ఆ పాత పైపులైన్‌ను మార్చి శాశ్వత ప్రాతిపదికన కొత్త పైపులైన్ నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గృహ లబ్ధిదారులకు 'ఉపాధి' కూలి చెల్లించండి

లింగసముద్రం, మే 26(ఆంధ్రజ్యోతి) : మండలంలో పక్కా గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఉపాధిహామీలోని 90 రోజుల పని దినాలకు సంబంధించిన కూలి డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ టీఏలు, హౌసింగ్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హౌసింగ్ సిబ్బంది ఇచ్చిన నివేదిక ప్రకారం మండలంలో ఏఏ గ్రామాల్లో పక్కా గృహాలు నిర్మిస్తున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. మండలానికి కేటాయించిన 21 ఫారం పాండ్లకు నిధులు మంజూరుకు ప్రణాళిక తయారు చేసి జిల్లా డ్వామా కార్యాలయానికి పంపించాలన్నారు. టీఏలు గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పనుల వద్దకు ఉదయం 9 గంటలకు వెళ్లి తప్పనిసరిగా కూలీల హాజరును పరిశీలించి పని చేసే వారికే మస్టరు వేయాలన్నారు. కూలీలు కొలతల ప్రకారం పనిచేసి రూ.300 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


కొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీద మస్తాన్‌రావు

బిట్రగుంట, మే 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బోగోలు మండలం ఏబీకండ్రికకు చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, టీడీపీ నేత జీ కొండయ్య కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సోమవారం పరామర్శించారు. అంతకు ముందు టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, మాజీ కన్వీనర్ పిన్నిబోయిన సుధాకర్, మాజీ సర్పంచు దొడ్ల అంజయ్యయాదవ్‌లు బీదను పూలమాలలు, శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, నేతలు వెంకటేశ్వరరెడ్డి, రఘురాంనాయుడు, సుబ్బారావు, మన్నన్‌బాషా, పద్మలత, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న మూగజీవాల దాహార్తి

- గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణంతో పశువులకు తాగునీటి వసతి



పోకూరులో నిర్మించిన పశువుల నీటి తొట్టె

వలేటివారిపాలెం, మే 26(ఆంధ్రజ్యోతి) : వేసవిలో నాలుగు నెలలు పాటు చెరువుల్లో, వాగుల్లో, కాలువల్లో నీటి లభ్యత తక్కువగా ఉటుంది. అలాంటి సమయంలో మూగజీవాలు మేతకు వెళ్లి వచ్చిన తరువాత తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి ఉంటుందని, దీని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 21 పశువుల నీటి తొట్టెలను మంజరు చేసింది. అందులో 8 పంచాయతీల్లో నీటి తొట్టెలు పూర్తయ్యాయి. మిగిలిన 11 పంచాయతీల్లో నిర్మాణ పనుల శరవేగంగా జరుగుతున్నాయి. ఒక్కో నీటి తొట్టెకు ప్రభుత్వం రూ.30 వేలు మంజూరు చేసింది. పొలాల్లో చేతి పంపులు ఉన్న ప్రదేశంలో నీటి తొట్టెలు నిర్మిస్తున్నారు. పశుపోషకులు, సన్నజీవాల పెంపకదారులు చేతి పంపులను వినియోగించుకొని తొట్టెల్లోని నీటిని పశువుల గొర్రెల దాహార్తి తీరుస్తున్నారు

నీటి తొట్టెలను సద్వినియోగం చేసుకోవాలి



వేసవిలో మూగజీవాలు దాహార్తికి పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు 21 నీటి తొట్టెలను మంజూరు చేసింది. అందులో 8 పంచాయతీల్లో నీటి తొట్టెల నిర్మాణం పూర్తయింది. మిగిలిన 11 పంచాయతీలోని నీటి తొట్టెలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అవి కూడా త్వరలో పూర్తవుతాయి. నీటి తొట్టెలను పశుపోషకులు, సన్నజీవాల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలి.

- దయాసాగర్, ఏపీవో, వలేటివారిపాలెం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం, మే 26 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద పనులు జరుగుతున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ విజయ్‌బాబు, మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్‌లు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

తిరుపతి ఐఐటీలో ఇంటర్న్‌షిప్

కందుకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండు నెలలకాలం ఇంటర్న్‌షిప్ చేసే అరుదైన అవకాశాన్ని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు దక్కించుకున్నారని కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ (ఏఐ) విభాగం విద్యార్థినులు గంగపట్ల మహిత, చుండూరి సంయుక్త చౌదరి తిరుపతి ఐఐటీలో ప్రొఫెసర్ సీహెచ్ విష్ణు నేతృత్వంలోని పరిశోధనా బృందంలో ఇంటర్న్‌షిప్ చేస్తారని తెలిపారు. ఈ అవకాశం కళాశాలలోని పరిశోధనా స్థాయికి అద్దం పడుతుందని, విద్యార్థుల పరిశోధనా సామర్థ్యాన్ని మెరుగుపరచటానికి కళాశాలలో ఏఐ ఇన్నోవేషన్ ల్యాబ్ స్థాపించటంతో పాటు గూగుల్ క్లౌడ్ కంప్యూటింగ్, జర్మన్ రోబోటిక్ సెంటర్లతో ఎంఓయూ చేసుకుని తర్ఫీదునివ్వటం వల్లే ఈ అవకాశం లభించిందన్నారు. విద్యార్థినులను మార్గదర్శనం చేసిన కళాశాల అకడమిక్ డీన్ డాక్టరు ముప్పా లక్ష్మణరావును ఈ సందర్భంగా విజయ్‌శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి.హరిబాబు, అధ్యాపకులు అభినందించారు.